కథా నిలయం
48
శ్రీకాకుళం

అన్నంత పనీ జరిగింది

ఇంజను స్టార్టయివున్న మోటారెక్కడం కోసం చంద్రమౌళి పంతులు ద్వారమండపంలోకి వచ్చాటప్పటికి, వంగి నమస్కారం చేస్తూ వొక యువకుడు పక్కకి వచ్చి నుంచున్నాడు.

మోటారు తలుపు పట్టుకు నుంచుని వున్న నాలుగో గుమాస్తా "ఇదా సమయ" మన్నట్టు తీక్ష్ణంగా చూశాడు.

"వోరి శకునపక్షీ" అన్నట్టు నిరసనగా చూసి, డ్రయివరు, లోపల్లోపల గింజుకున్నాడు.

మొదట నమస్కారం అందుకున్నట్టు తల వూపి, తరవాత సులోచననా లలోనుంచి కిందికీ మీదికీ చురుగ్గా చూసి "కట్టినవి నీరుకావి బట్టలూ, దిద్దింది క్రాపింగు జుట్టునూ. ఎవరయ్యా నువ్వూ?" అని దర్జాగా అడిగాడు పంతులు.

"అన్నార్తుల్లో వొకణ్ణండి" అన్నాడు చేతులు కట్టుకుని ఆగంతుకుడు.

"ఇదివరకే రోజుకి ముగ్గురు చొప్పున వున్నారు వారాల విద్యార్థులు. ఒక్క శనివారం మాత్రమే యిద్దరే వున్నారు. నువ్వు మూడోవాడవు. తప్పకుండా రావచ్చు."

ఆగంతుకుడితో యిలా చెప్పి పంతులు తనకేసి చూడగా "మరి రావయ్యా" అంటూ గుమాస్తా లోపలికి బయలుదేరాడు.

"నేనీపూట భోజనం చేసే వచ్చానండి, నా మనవి—"

"ఇంకేమిటీ మరీ? కోర్టుకి తొరగా వెళ్ళిపోవాలే?"

ఇలా అంటూ పంతులు రిస్టువాచీ చూసుకున్నాడు. పదకొండింటికీ యిక అయిదు నిమిషాలే తరవాయి.

ఇది వినీ, చూసీ వెనక్కి మళ్ళి "సావకాశంగా మనవి చేసుకోవచ్చు, సాయంత్రం నాలుగున్నరకి రావయ్యా" అని గుమస్తా సద్ది చెప్పాడు; గాని ఆగంతుకు డది వినిపించుకోక "నా సంగతి నిమిషాల్లో—" అంటూ మాట నాన్చేశాడు.

"గంట కరవై నిమిషాలు"

"అయిదు చాలండి నా విన్నపానికీ, తమ సెలవు కూనూ"

"మోటా రెక్కబోతూ వుండగా—"

"నాలుగు—"

"అదీ యెక్కువే"

"మూడు—"

"మరి కానియ్యి" అని చెప్పి పంతులు మళ్ళీ వాచీ చూశాడు.

అపవారించి గుమస్తా వురిమి చూడగా, స్వగతంగా విసుక్కుని డ్రయివరు యింజ నాపు చేశాడు.

ఇప్పుడు నేనున్న స్థితిలో తమర్ని కోరేది సాయంలోనే చేరుతుందండి" అని ప్రారంభించాడు ఆగంతుకుడు.

"ఉపోద్ఘాతం వద్దు"

"చిత్తం, చిత్తం, నేను విద్యార్థిని కానండి"

"అలాగా?"

"కనక వారం కోసం రాలేదండి"

"డబ్బు కావా లంటావా?"

"సరిగా అంతే నండి. అయితే దానికి "జీతం" అని పేరు పెట్టించవలసిందని ప్రార్థన"

ఈ విలక్షణధోరణి పంతుల్ని ఆకర్షించింది.

"కవిత్వం కడుతున్నావే? చమత్కార మయినవాడివిలాగే వున్నావు. అయితే, యేంపని చేస్తావు నా దగ్గిర?"

"తమ కేమి అవసరమయితే అదీ, తమ రేమి సెలవిప్పిస్తే అదీ చేస్తానండి."

పంతులు వొక్క క్షణం నిదానంగా చూసి "గుమాస్తా గిరీ" అన్నాడు.

"చెయ్యగలనండి"

"అటెండరీ"

"అభ్యంతరం లేదండి"

"మోటారు డ్రయివింగు?"

ఈ మాట విని డ్రయివరు వులిక్కిపడ్డాడు. అది కనిపెట్టి, అతని కేసే చూస్తూ ఆగంతుకుడు "చేత నవునండి" అన్నాడు.

"మహానసంమీద పెత్తనం"

"ఆక్షేపణ లేదండి"

పంతులు వొక్క క్షణం ఆగి, చురుగ్గా చూస్తూ, "ఎప్పుడైనా — పొరుగూరు వెళ్ళినప్పుడు అధ్వర్యం?" అనడిగాడు.

"సందేహించనక్కరలేదండి" అని తడుముకోకుండా బదులు చెప్పాడు ఆగంతుకుడు.

పంతులు చకితు డయినాడు. ఒకమాటు యెగాదిగా చూశాడు. చివరికి "అయితే నీకు చేతగాని పనేమిటయ్యా?" అన్నాడు.

"ఏదో వొక ప్రయోజనం తీర్చకుండా దబ్బడగడమండి"

"సెబాస్, చాలా దిట్టమైనవాడవే. చూడదగ్గవాడవు కూడాను. కనక వుండిపో, తరవాత మాట్టాడుకుందాం"

ఇలా అని పంతులు రెండడుగులు ముందుకి వేశాడు. డ్రయివరు ఇంజను స్టార్టు చేశాడు.

ఆగంతుకుడు పొంగిపోయాడు. అతని కళ్ళల్లో ఆనంద బాష్పాలు గిర్రు మనేశాయి. ఆ కళ్ళతోనే కృతజ్ఞత విన్నవించుకుంటూ, మొదట మాట రాక దోసిలి వొగ్గి నమ్రుడు మాత్రం అయి, తరవాత ప్రయత్నించి "ఇన్నాళ్ళకి నాకు అవలంబం దొరికింది" అన్నాడు.

తలుపుమీద చెయ్యివేసి "యేమిటీ?" అన్నట్టు చూశాడు పంతులు. తలుపు విడిచిపెట్టి గుమాస్తా పంతులు వెనక్కివచ్చి నుంచున్నాడు.

ఎన్ని విధాలో ప్రయత్నించాను. ఎందర్నో ఆశ్రయించాను; కాని యీ మాత్రం మాట అనగలిగినవారు కనపడలేదండి"

"దానికేం లేః కాక, దీల్లో యేపుంత విశేషం వుంది కానీ— మరి నేను వెళ్ళిపోవచ్చునాః"

"చిత్తం చిత్తం. ఒక్క అరగంటలో కోర్టుదగ్గిర కలుసుకుంటా నండి"

"ఇవాళ అక్కర్లేదు."

"అయితే నాకు సెలవు—"

"ఎక్కడికి వెళ్ళాలిః"

"నాళంవారి సత్రంలో బస చేశానండి. అక్కడికి—"

"నీ కక్కడ తొందరపని యేదైనా వుందాః"

"ఏమీ లేదండి; కాని మూడు నిమిషాలూ ముగిసి—"

"అయితే లే. నువ్వేం చదివావూః"

"సంస్కృతంలో మేఘసందేశం పూర్తిచేశానండి. ఇంగ్లీషులో లోవరు సెకండరీ సర్టిఫికెట్టు సంపాదించానండి."

ఇది విని డ్రయివరు కళ్ళు తేలవేశాడు. గుమాస్తా మొగం పక్కకు తిప్పుకుని పెదవి విరిచాడు.

వారిద్దరూ స్కూలుఫైనలు పట్టభద్రులు.

"అందులోనూ యిందులోనూ కూడా త్రయమే అన్నమాట" అన్నాడు పంతులు.

"టైపు కూడా కొంచెం అలవాటుంధండి. సర్టిఫికెట్టు మాత్రం లేదండి."

"ఏం, పరీక్ష పోయిందాః"

"పరీక్షకి వెళ్ళలేదండి."

"డబ్బు లేకపోయింది."

"అవునండి"

"మరి వెళ్ళిరా"

ఇలా అంటూ పంతులు పడిచెక్కమీద కాలు పెట్టాడు.

ఆగంతుకుడు పక్కకి తప్పుకున్నాడు; కాని "నీ పేరెవరూః" అంటూ ఆగిపోయి పంతులు మళ్ళీ అడగ్గా యెదటికి వచ్చి "రామచంద్రశాస్త్రి" అని చెప్పాడు.

"ఇంటిపేరుః"

"వేమూరివారండి

"వూరు?"

"రామచంద్రపురం తాలూకా మహేంద్రవాడ"

"సరే"

"తమరు కోర్టునుంచి వచ్చాటప్పటికి మళ్ళీ దర్శనం చేసుకుంటానండి"

ఇలా అని రామచంద్రం పక్కకి తప్పుకున్నాడు.

"మా— మన వొంటెద్దుబండి తీసుకువెళ్ళి సామాను పట్టించుకు వచ్చి అదిగో, ఆగదిలో ప్రవేశించు."

అంగుళినిర్దేశంతో గది చూపిస్తూ పంతులు గుమాస్తా కేసి చూశాడు. గుమాస్తా, స్తంభం చాటునవున్న పోతునాయణ్ణి సంబోధించి "ఆ గది వారికి స్వాధీనం చెయ్యి. ముందు బాగా తుడిపించు—దులిపించు" అని చెప్పాడు.

"సామా నల్లా చిన్న రైలు సంచీ మాత్రమే. బండి అక్కర్లేదండి"

"సరే"

ఇలా అని పంతులు మోటారులో ప్రవేశించబోయి, అంతలో మళ్ళీ యథాప్రకారంగా నుంచుని "చూడూ, నీకు పెళ్ళయిందా?" అని అడిగాడు.

"లేదండి"

"వెనక ఆసరా—"

"ఏకాకినండి. మా అమ్మగారు మా అన్నగారి దగ్గిర వున్నారండి."

"మీ రెంద రన్నదమ్ములు?"

"ఇద్దర మేనండి. మా అన్నగారు కాకినాడలో వకీలు గుమాస్తాగా వున్నారండి"

"అయితే, భోజనాని కిక్కడే వుంటా వన్నమాట నువ్వు"

"చిత్తం చిత్తం తమ సెలవు—"

"ఉండు, పూటకూటింటి భోజనం యేమి సుఖమూ?"

రామచంద్రం మాట్టాడలేక నమ్రుడు మాత్రం అయినాడు.

పంతులు మోటా రెక్కాడు, తలుపు వేసేసి గుమాస్తా డ్రయివరు పక్కని కూచున్నాడు. డ్రయివరు వెనక్కి చూసి యజమాని యింగితం కనిపెట్టి కారు పోనిచ్చాడు.

గది తాళంతీస్తూ పోతునాయడు "ఏం పనిమీద వచ్చారు బాబూ" అని అడగ్గా "భోజనాని" కనిచెప్పి, తాళంచెవి పుచ్చుకుని, ఆనందతరంగాలమీద వూగిపోతూ స్నానానికి వెళ్ళిపోయాడు రామచంద్రం.

2

పంతులూ రామచంద్రమూ మళ్ళీ రాత్రి భోజనాల దగ్గిర కలుసుకున్నారు.

రామచంద్రం యెదటి బంతిలోనే వున్నాడు; కాని చివర పడిపోయాడు. ఆ సన్నివేశం పంతులుకి యెలాగో అనిపించింది; కాని యేమనడానికి మాత్రం సాహసం కలగలేదు.

ఆపూట వారాల విద్యార్థులు కాక మరో అయిదారుగురు అభ్యాగతులున్నారు. అమలాపురం సబిన స్పెక్టరూ రైటరూ వున్నారు. చిన్నగుమాస్తాలిద్దరూ కూడా ఆపూట అక్కడే వున్నారు.

బంతి బాగా పూటుగా వుంది. వాయువేగ మనోవేగాలతో వంటలక్క వడ్డన పూర్తి చెయ్యగా, నేతిగిన్ని పట్టుకుని జానకమ్మ వంటింటి గుమ్మంలో నుంచుని వుంది.

అలవాటు చొప్పున పంతులు తన బంతీ యెదటి బంతీ పారజూశాడు. మెరుపు దీపాలు మూడూ ఝామ్మని వెలుగుతున్నాయి కనక హాలంతా నల్లపూస కూడా కనపడేటంత ప్రకాశమానంగా వుంది.

ఆ వెలుగులో పంతులుకి, రామచంద్రం మొగంమీద సమధికమైన విలక్షణ తేజస్సు కనపడి సాదరబుద్ధి కలిగించింది.

"వచ్చావా?" అని అడిగాడతను.

"చిత్తం. నేను చిన్న గుమాస్తాగారితో మాట్లాడుతూ వుండడంవల్ల తమరు కోర్టు నుంచి రావడమూ, షికారు వెళ్ళడమూ గమనించలేకపోయానండి"

"కోర్టులో వొక గంట వూరికే కూచోవలసి వచ్చింది. నిన్నక్కడికి తీసుకువెళ్ళనందుకు చాలా విచారించాను"

"తమరలా సెలవిప్పిస్తే—"

"తప్పేమీ? అది అక్షరాలా నిజం. నిజం వొప్పుకోడం తప్పా?"

"వాస్తవం అన్నదీ— చిత్తగించారూ?" అంటూ అందుకున్నాడొక అభ్యాగతుడు. "సత్యం హృదయానికుత్తేజనం కలిగిస్తుంది. అసత్యం దాన్ని కుంగదీసేస్తుందండి"

"మీ ప్రసక్తి లేదిప్పుడు. చూస్తూ వింటూ వూరుకోం"డని ఆక్షేపించాడు పంతులు.

"చిత్తం చిత్తం, తమ శెలవు. అయితే సందర్భం వచ్చింది కనక—"

"లేదు కనక వూరుకోమ్మంటున్నాను" అని కొంచెం చిరాగ్గా అన్నాడు

పంతులు. దాంతో అభ్యాగతుడు నిర్విణ్ణుడూ, నిరుత్తరుడూ, అయి వూరుకున్నాడు.

తక్కినవారిలో యిద్దరూ "పిలవని పేరంటానికెందుకయ్యా?" అన్నట్టు అభ్యాగతుడికేసి చురుగ్గా చూశారు. ఒకడు "ఈ మాత్రానికే అంత నిర్భాగ్గ మాటంగా మందలించాలా?" అన్నట్టు పంతులు కేసి, పక్కవాటుగా విషపు చూపులు చూశాడు.

"రామచంద్రం"

"ఏమి సెలవు?"

"నువ్వని వచ్చేస్తోందిమాట. ఎవర్నీ కూడా 'మీ'రనడమే మంచిది కానీ—"

"భృత్యుణ్ణి నువ్వనడమే మంచిదండి"

"ఈమాత్రం భాగ్యానికి భృత్యుడంటే యేమిటికాని— అయితే నువ్వక్కడ కాదు నా యెదటికి రా"

ఈమాట విని మూడో గుమాస్తా, నాలుగో గుమాస్తా కేసి చూసి, అతను లేచివెళ్ళి రామచంద్రం లేచినచోట కూచోగా తా నతని పీటమీద కూచున్నాడు. గుమాస్తాల యీ తరతమ భేదభావాలకు వింతపడుతూ రామచంద్రం పంతులుకి అభిముఖంగా కూచున్నాడు.

"ఇత న్నెరుగుదువా జానీ?"

"ఎరగను"

"ఇంట్లో మనిషిని చూ సేటట్టు చూస్తూ వుండు"

"అలాగే"

ఈమాటలువిని చకితురాలై, వంటింట్లో చారూ అన్నమూ తింటూవున్న సుభద్ర రామచంద్రాన్ని తొంగిచూసింది.

తరవాత పంతులు, వుద్ధరిణతో చేతిలో నీళ్ళు పోసుకుని "ఇక కానిద్దామా? ఏమండి శాస్త్రులుగారూ, పరిషేచన చేద్దామా?" అంటూ ఆనీళ్ళు విస్తరిమీద చల్లాడు.

3

"ఇవాళ నాన్నారూ నువ్వూ ముందు కూచుంటారుటా, నేను డింగీ నడుపుతానుట, ఏమే పిన్నీ?"

ఇలా అని గునిసి, లేడిపిల్లలాగ యెగురుతూ దుముకుతూ వెళ్ళి డింగీ యెక్కి, సుభద్ర, వెనకవైపున కూచుని తెడ్డు అందుకుంది.

"అయితే నేను రానుబాబూ" అంటూ మూతి బిడాయించుకుని, జానకమ్మ, చివరి పావంచామీద నిలిచిపోయింది.

"అదేమిటే?"

"ఏమో బాబూ నేను రాను"

"ఏం?" అని బతిమాలుతూ వున్నట్టడిగింది సుభద్ర.

"ఇవాళ చెరువు నిండుకుండలా వుంది. కెరటాలు కూడా వస్తున్నాయి"

"అయితే?"

"అయితే యేమిటి, అయితే? డింగీ వొరిగిపోతే?"

"నేను లక్షమాట్లు నడిపానే? నాకు బాగా చేతవునే మాతల్లీ?"

"అయినా సరే"

ఇలా అంటూ జానకమ్మ పక్కకి తిరిగింది.

"రావూ? రావూ?........చూశావా? ఇవాళ నాకు సరదాగా వుందే?"

భయం పూర్తిగా పోలేదు; గాని జానకమ్మకి జాలియెక్కువయింది. వెంటనే ఆమె మళ్ళీ సుభద్రకేసి తిరిగి "అయితే, చెరువుచుట్టూరా వొడ్డునే నడుపుతావా మరీ?" అంటూ లాలనగా అడిగింది.

సుభద్రకి వొప్పుకోక తప్పిందికాదు

వెంటనే జానకమ్మ డింగీ యెక్కి ముందువైపున కూచుని, చేతిలోవున్న పొట్లం చెక్కమీద వుంచింది. అది చూడగా జ్ఞాపకం వచ్చి "మరి—మరి— యివాళ పావురాలను పస్తు పెడతావా యేమిటమ్మా?" అంటూ ముదలకించింది సుభద్ర.

జానకమ్మ తెల్లపోయింది. ఆమె మాట్లాడలేక పొట్లంకేసి చూడసాగింది.

ఇదే సందని సుభద్ర, వెంటనే ఆమె దగ్గిరికి వెళ్ళి భుజాలమీద అని మొగంమీద మొగంపెట్టి "నీకేమీ భయంలేదే? నువ్వెంత నింపాదిగా నడప మంటే అంత నింపాదిగానూ నడుపుతానే. కాకపోయినా, నాన్నారు దగ్గరే వుంటారు కాదుటే?" అని చాలా దూరం నచ్చచెప్పింది.

విధిలేక వొప్పుకున్నట్టు "సరే మరీ" అంటూ కొంచెం చురుగ్గా అంది జానకమ్మ.

తన కోరిక నెరవేరడమే ప్రధానం అనుకుని సుభద్ర పొంగిపోతూ వెళ్ళి తన స్థానంలో కూచుంది.

"ఇంకా రారేం?" అన్నట్టు జానకమ్మ వొడ్డుకేసి చూసింది.

పంతులూ వొకదారసానీ మెల్లిగా వస్తూ పక్కనివున్న సిమెంటు బల్లకేసి మళ్ళారు. రామచంద్రం పదిగజాలలో నుంచుని వున్నాడు.

"ఎవరో దొరసానేవ్" అంది జానకమ్మ.

సుభద్ర వెనక్కి విరగబడి చూసి "మరేనేవ్! ఎందుకు వచ్చిందో?" అంటూ తెడ్డు డింగీమీద వుంచేసి జానకమ్మ కేసి చూసింది.

మాట్టాడుతూ మాట్టాడుతూ వున్నవాడు "వస్తానుండండి" అని దొరసానికి చెప్పి, పావంచాలు దిగి వచ్చి "ఇవాళ నువ్వునడుపుతావా యేమిటమ్మా?" అని అడిగాడు పంతులు.

"అవునండి" అంటూ గారాం కుడిచింది సుభద్ర.

"ఇవాళకి వద్దమ్మా! ఇకముందు నేనున్నప్పుడు ప్రతీరోజునా నువ్వే నడుపుతూ వుందువుగాని. ఏదో మాట్టాడ్డానికి మిషను దొరసాని వచ్చింది, యివాళకి నేనురాను. ఇవాళమట్టుకి రామచంద్రం నడుపుతాడు నువ్వు పిన్ని దగ్గిర కూచోతల్లీ"

"మేమూ మానేస్తే యేం?" అన్నట్టు చూసిందిజానకి; కాని "వెళ్ళిరండి" అన్నాడు పంతులు.

మాట్టాడకుండా వెళ్ళి సుభద్ర జానకమ్మకి చేరబడి కూచుంది. రామచంద్రాన్ని పిలిచి, సంగతంతాచెప్పి పంతులు దొరసాని దగ్గిరికి వెళ్ళి పోయాడు.

4

"నాన్నారు లేరు కనక యివాళ తొరగావచ్చేద్దామే" అంది సుభద్ర.

"వినపడింది టోయ్?" అని అడిగింది జానకమ్మ.

"చిత్తం"

"తిన్నగా పావురాల గూటి దగ్గిరికి పోనియ్యి డింగీ"

"చిత్తం"

డింగీ వొయ్యారి నడకలతో బయలుదేరింది.

చేతికందిన పెద్ద యెర్ర కలవపువ్వు లందుకుంటూ, జానకమ్మతో కేరింతాలాడుతూ, సుభద్ర, మధ్యమధ్య తెడ్డువేసినట్టు తన చేతితోనే నీళ్ళు వెనక్కి గెంటసాగింది.

డింగీకి వడి యెక్కువయింది. అంత దూరాన్నుంచేచూసి "పెద్దది" అని నిశ్చయించుకుని సుభద్ర చెయ్యిచాపేటప్పటికి కొన్ని పువ్వులు వెనకబడిపో సాగాయి.

జానకమ్మ కూడా మధ్యమధ్య వొకొక్కక్క పువ్వు అందుకుంటూ

"అదిగో, అదిగో, వచ్చేసింది అందుకో—అందుకో—హ—య్యో, వెళ్ళి పోయింది" అంటూ మళ్ళీ, ముందుకి చూడసాగింది.

డింగీ సగం దూరం వెళ్ళింది. ఎడమ చేతి మీదుగా దూరాన తెల్ల తామరపువ్వొకటి పే-ద్దది. కనబడగా "ఇవాళ అది కూడా పట్టుకు వెడదామే" అంటూ గునిసింది సుభద్ర.

"ఆలస్యం అయిపోదూ?"

"అయితే అయింది"

"తొరగా వెళ్ళిపోదామన్నావు కాదుటే యిందాకానూ?"

"ఆలస్యం అయినాసరే అంటున్నాను కాదుటే యిప్పుడూ?"

"వినపడింది టోయ్?"

"వినపడిం దండి"

దగ్గరికి వెళ్ళాటప్పటికి అనుకున్నంతకంటేనూ పెద్దదిగా వుండడం చూసి "యించక్క—యించక్క" అని మురిసిపోతూ తీసి, తిప్పితిప్పి చూస్తూ పొంగిపోయి "దీనికి చుట్టూ నల్లకలవలూ, వాటికి చుట్టూ యెర్రకలవలూ వుండే బేసిను ఎంతో బాగుంటుంది. కదుటేపిన్నీ?" అని అడిగింది సుభద్ర.

"అవి కావాలంటే ఆచివరికి వెళ్ళాలి, తెలుసా?"

"కావాలే! తీసుకువెడదామే....ఏమే పిన్నీ?"

జానకమ్మ రామచంద్రం కేసిచూసింది. రామచంద్రం నల్లకలవలున్న దిక్కుకి చూశాడు.

డింగీ బరిమీద తాచు లాగ పరిగెత్తింది.

తల్లీ కూతురూ పది పన్నెండు నల్లకలవలు తీశారు. చిన్న పరిమాణంలో ముద్దొస్తూ వుండగా, సుభద్ర అయిదారు తెల్ల కలవలు కూడా తీసి "పావురాలు గుటకలు మింగుతూ వుంటాయే పాపం" అంటూ వెనక్కి విగరబడి గూటికేసి సకరుణంగా చూసింది.

డింగీ మళ్ళింది.

అలికిడి విని గూళ్ళల్లో వున్న పావురాలన్నీ బయటికి వచ్చాయి. వెంటనే మహోల్లాసంతో సుభద్రా, జానకమ్మ "ఆ,ఆ," అంటూ చేతులు చాపారు.

ఉన్న యేడెనిమిది పావురాలూ కిలకిల్లాడుతూ వచ్చి వారి చేతులమీదా బుజాలమీదా వాలాయి. ఒక నీలాపు పావురం సుభద్ర చెవిదగ్గర ముట్టెపెట్టి కువకువలాడగా, తే-ల్లని పావురం వొకటి యీ బుజంమీద ఆబుజం మీధా వాలి ఆమె బుగ్గలు పొడిచింది.

ఒక్కొక్కటే చేతిలోకి తీసుకుని వారు ముద్దులాడి విడిచిపెట్టారు. వెంటనే అవి స్తంభంమీదికి వెళ్ళిపోయాయి.

ఉత్తరక్షణంలో డింగీ స్తంభం దగ్గరికి చేరుకుంది. సుభద్రలేచి పెద్ద గూట్లోవున్న పింగాణీ పళ్లెం తీసి దులిపి పట్టుకుంది. జానకమ్మ లేచి పొట్లం విప్పి అర్ధశేరు సెనగపప్పు పోసి పళ్లెం గూట్లో వుంచేసింది.

తరవాత తల్లీ కూతుళ్ళిద్దరూ వొక్కొక్క పావురాన్నే తట్టి "లాం-జముం దల్లారా, కమ్మగాతినండి" అని సెలవిచ్చి డింగీలో కూచున్నారు.

తిరిగి వచ్చేటప్పుడు కూడా సుభద్ర మరికొన్ని పువ్వులు తీసింది.

మందహాసం చేస్తూ పంతులుతో కూడా చివరి పావంచామీదికి యెదురు వెళ్ళి జానకమ్మతోటి, సుభద్రతోటి "గుడీవినింగ్, గుడీవినింగ్" అంటూ కరస్పర్శచేసింది దొరసాని.

"మార్గరెట్టు దొరసానిగారి నర్సింగు హోముకి రేపు వార్షికోత్సవట తల్లీ" అన్నాడు పంతులు.

"అలాగా? చాలా సంతోషం" అని సుభద్ర అనగా, మీరు మా పిల్లల్ని రక్షిస్తున్నారు. చాలా సంతోషం మార్గరెట్టుగారూ" అంది జానకి.

దొరసాని మళ్ళీ మందహాసం చేస్తూ తల వూపింది.

"నువ్వు బహుమతులు పంచిపెట్టాలిట. పిన్ని అధ్యక్షత వహించాలిట" అని పంతులు చెప్పగా, "అయ్యో" అంటూ జానకీ సుభద్రా మొదట వొకర్ని వొకరు చూసుకుని, తరవాత పంతులు కేసీ దొరసాని కేసీ చూశారు.

"మా కది చాలా గౌరవం" అంటూ దొరసాని కళ్ళు తిప్పుకుంది. దొరసానికి తెలవకుండా పంతులు కళ్ళు మెరిశాయి.

దానిమీద "బహుమతులు మా అమ్మే పంచిపెడుతుంది? కాని అధ్యక్షులు పంతులుగారే" అంది జానకమ్మ.

"లేదు లేదు. తమరే అధ్యక్షత వహించాలి. అనుగ్రహించండి" అని దొరసాని యింగ్లీషు యాసగా చెబుతూ రెండు చేతులూ పట్టుకోగా, జానకమ్మ పంతులు యింగితం కనిపెట్టి చివరికి వొప్పుకుంది.

ఈ లోపున తెల్ల తామరపువ్వూ, రెండు నల్లకలవలూ, మూడు యెర్రకలవలూ తెచ్చి సుభద్ర సగౌరవంగా యివ్వగా, ప్రీతిపూర్వకంగా పుచ్చుకుని దొరసాని వందనాలు సమర్పించింది.

అందరూ వొడ్డుకి బయలుదేరారు.

"ఇప్పుడు చికిత్స పొందుతూవున్న పిల్లలెందరూ?" అని అడిగాడు పంతులు.

"ఇరవై మంది" అంది దొరసాని.

"నర్సులు?"

"ఎనమండుగురు"

"సరే, రేపు బజారుకి వెళ్ళి, ఆపిలుపళ్ళూ, ద్రాక్షపళ్ళూ, బిస్కత్తు డబ్బాలూ, యెనిమిది వుప్పాడ చీరలూ, పెద్దాపురం సిల్కుజాకెట్టు తానొకటీ, సిల్కుచీర వొకటీ, తేవాలి. మరిచిపోకేం రామంచంద్రం?" అంటూ పంతులు వెనక్కి తిరిగి చూశాడు; కాని రామచంద్రం లేడు.

అందరూ ఆగిపోయి వెనక్కి తిరిగారు.

చూడగా, డింగీ చెరువు మధ్యని వుంది. రామచంద్రం మరో పెద్ద తెల్ల తామరపువ్వు తీస్తున్నాడు.

దయార్ద్రహృదయురాలయి జానకమ్మ "నీకోసం" అన్నట్టు చూడగా సుభద్ర ఆనందపరవశురా లయిపోయింది.

సంగతంతా జానకమ్మ చెప్పగా విని "చాలా తెలివయినవాడు. మంచి యోగ్యుడు" అని మెచ్చుకుంటూ పంతులుకూడా ఆనందించాడు.

తరవాత మెల్లిగా వెళ్ళి నలుగురూ బల్లమీద కూచున్నారు.

డ్రయివ ర్లిద్దరూ కార్లు తెచ్చి రేవులో నిలపగా, నల్లకలవలూ, యెర్ర కలవలూ, తెల్ల కలవలూ అరవిచ్చిన యెర్రతామర పువ్వొకటీ గొడుగు తామ రాకుతో యెడమసందిటా, తెల్ల తామర పువ్వు ప్రత్యేకంగా కుడిచేతా పట్టుకు వెళ్ళి, కారులో వుంచి, రామచంద్రం పక్కగా నుంచున్నాడు.

బల్లమీద యేమి టేమిటో మాటలు వచ్చాయి. వాటితోపాటు సందె చీకటి వచ్చింది. దాని వెనకనే మెరుపుదీపం వచ్చింది.

సెలవు పుచ్చుకుని, మళ్ళీ కరస్పర్శలున్నూ చేసి వెళ్ళి, దొరసాని కారెక్కింది.

పువ్వులదొన్నె వొళ్ళోవుంచుకుని సుభద్ర మధ్య కూచోగా యీ వేపు నుంచి వొకరూ, ఆవేపునుంచి వొకరూ యెక్కి జానకమ్మా పంతులూ ఆమెకి రెండు పక్కలా కూచున్నారు.

బూరాలు బర్రు మన్నాయి.

కారులు తుర్రో మన్నాయి.

5

ఆవేళ రాత్రి భోజనా లయినాక, పంతులు పడకగదిలో వుయ్యాలా మంచంమీద కూచుని వుండగా, తాంబూలపు పళ్లెం తెచ్చి అందించి, సుభద్ర, పక్కని కూచుంది.

"ఏమిటి తల్లీ కబుర్లూ?"

"మళ్ళీ వొక కథ రాసేశాను నాన్నారూ"

"సాపు రాయించా లన్నమాట"

"అవునండీ"

"సూరయ్యని పిలిపించు"

"ఏ సినీమా కయినా వెళ్ళారో యింట్లో వున్నారో" అంటూ బయలు దేరింది సుభద్ర.

ఇంతలో జ్ఞాపకం రాగా "ఏం తల్లీ! రామచంద్రం రాయగలడేమో" అన్నాడు పంతులు.

అక్కడే నుంచుని, గ్రీవాభంగాభిరామంగా చూస్తూ, సుభద్ర "కను క్కోండి నాన్నారూ! సూరయ్యగారు రాస్తే మళ్ళీ నేను మొదణ్ణుంచీ దిద్దుకో వలసి వస్తోందండీ" అంది.

మెట్ల దగ్గిరికి వెళ్ళి సుభద్ర పిలవడమూ, నాయడు పైకి రావడమూ, సుభద్ర చెప్పడమూ, నాయడు మళ్ళీ కిందకి వెళ్ళిపోవడమూ, రామచంద్రం పైకి రావడమూ వెంటవెంటనే జరిగిపోయాయి.

సుభద్ర, కథ తెచ్చి తండ్రిచేతి కివ్వడం యీ లోపునే అయిపోయింది.

ఉయ్యాలా మంచంమీద, చోటు చూపిస్తూ, పంతులు కూచోమన్నాడు; కాని రామచంద్రం నుంచునే వుండిపోయాడు.

"మా అమ్మాయి తరుచు చిన్న కథలు రాస్తూ వుంటుందోయ్."

"చిత్తం."

"నువ్వు సాపు రాస్తూ వుండాలి."

"అలాగే నండి."

"రాయగలవా?"

"రాయగలనండి."

"తెనుగులో నువ్వు రచన చెయ్యగలవా?"

"కొంచెం కొంచెం చేతవునండి. అయితే, వ్యావహారికంలో వెళ్ళినంత వుత్సాహంగా వెళ్ళదండి గ్రాంధికంలో కలం"

"అదేనోయ్! వ్యావహారికం దేశం అంతటా అప్పుడే పాకిపోయింది కాదూ? మహాదిట్టమైన వాడోయ్ గిడుగు రామమూర్తిపంతులు. నవీనవాఙ్మయ నిర్మాతలయిన యువకుల నందర్నీ లోపు చేసుకున్నాడు పంతులు. ముసలి తలకాయలు గ్రాంథికమో అంటూ యెంత గోలపెడితే మాత్రం, ఆవాదం యింకెన్నాళ్ళు నిలుస్తుంది? మా అమ్మాయిక్కూడా రామమూర్తి పంతులు వాదమే నచ్చింది. నువ్వూ మా అమ్మాయీ చివరికి వొక జట్టే అయినారు. మహా బాగుంది. కనక నువ్వు సాఫు రాయడమే శ్రేయస్కరంగా కనపడుతోంది.

"తమ అమ్మాయిగారివంటి యువతీమణులు వ్యావహారికంలోనే చిన్న కథలు రాయడం చాలా గొప్పసంగతండి. నాకు చాలా సంతోషంగా వుందండి"

సుభద్ర మొగంమీద చిరునవ్వు మొలిచింది. ఆమె కళ్ళు వోరచూపులు చూశాయి.

"ఇదివరకి నాలుగో గుమాస్తా సాఫు రాస్తున్నాడు; కాని అతని సాఫుకంటే మా అమ్మాయి చిత్తేనయం"

"నాశక్తికొద్దీ బాగారాసి దాఖలు చేసుకుంటానండి"

"ఒక కథ రాస్తే తెలుస్తుందండీ నాన్నరూ?" అంది సుభద్ర.

"విన్నావుటోయ్?"

"చిత్తం విన్నానండి. దస్తూరీ విషయంలో మాత్రం ముందు తమర్నిద్దర్నీ మెప్పించుకోగలనండి''

"అది యేమంత తక్కువ యోగ్యత అనుకున్నావా?"

రామచంద్రం "చిత్తం" అన్నాడు; కాని సుభద్ర సిగ్గుపడింది. ఇక ముందయినా దస్తూరీ బాగుచేసుకోవాలనీ, సొంతంగానే సాఫు రాసుకోవడం మొదలుపెట్టాలనీ అనుకుందామె.

పంతులు కథ అందించాడు.

రామచంద్రం అది పుచ్చుకుని "యెన్నాళ్ళకి పూర్తిచెయ్యగల"వని పంతులు అడగ్గా, కాగితాలు లెక్కచూసి 'రేపు తమరు కోర్టుకి వెళ్ళకుండా అందించేస్తానండి" అన్నాడు.

ఇది విని తండ్రీ కూతురూ చాలా ఆనందించారు.

"ముందు కథ అంతా పూర్తిగా చదివితే గాని రాత మొదలుపెట్టగూడదు నాన్నారూ" అంది సుభద్ర.

"ఆ సంగతి అతనికి తెలపదుటమ్మా వెర్రిపిల్లా?"

"అలాగే చేస్తానండి నేను"

సుభద్ర కొంచెం సిగ్గుపడింది.

"మరి వెళ్ళు. సూరయ్య కింద వున్నడా?"

"నేను వచ్చాటప్పటి కున్నారండి"

"అప్పుడే యెనిమిదీ యాభై. తొరగా వెళ్ళు, లేకపోతే అతను వెళ్ళి పోతాడేమోను. కలమూ కాగితాలూ అతన్నడిగిపుచ్చుకో"

రామచంద్రం కిందికి వెళ్ళిపోయాడు.

ఇంతలో, జానకమ్మ, వెండి చెంబుతో మంచినీళ్ళు తెచ్చి కడపరాతి బల్లమీద వుంచి, హాల్లోకి వెళ్ళి వాక సోఫాలో చతికిలబడింది.

వెంటనే తండ్రికి వార్తాపత్రిక అందించి "రేపటి వుపన్యాసం ఆలోచించు కుంటానే పిన్నీ" అంటూ సుభద్ర తన గదిలోకి బయలుదేరింది.

"కథలు రాస్తావు కనక నువ్వు సొంతంగా ఆలోచించుకుంటావు. మరి నామా టేమి టమ్మా?"

"నీకేమమ్మా, నువ్వు మేష్టారివి"

"అయితే జీతం యేమిస్తారో కనుక్కో"

సుభద్ర నవ్వుకుంటూ చక్కాపోయింది.

"జీతం కాదు, వుపన్యాసం బాగుండకపోతే చపట్లిస్తారు సభ్యులు" అని పంతులు కేకేశాడు.

"ఉపన్యాసం బాగున్నా చప్పట్లేయిస్తారు సభ్యులు; కాని మీరే వొప్పిం చారు. మరి నాభారం అంతా మీమీదే వుంది తెలుసా?" అని తల యెగర వేసుకుంటూ అడుగుతూ గదిలోకి వెళ్ళింది జానకమ్మ.

చిరునవ్వు నవ్వుతూ పంతు లేదో గొణిగాడు.

"ఏమిటి?" అని మెల్లగా అడుగుతూ దగ్గిరికి వెళ్ళి, అతని బుజాలమీద చేతులువేసి కళ్ళల్లోకి చురుగ్గా చూసింది జానకమ్మ.

6

దరోతీ గొట్టంలోంచి పొగా, కొండల మొగంగా చలిగాలీ రివ్వురివ్వున వస్తున్నాయి. సూర్యకిరణాలు వొణుకుతూ వొణుకుతూ అడుగులు వేస్తున్నాయి.

రాజమహేంద్రవరపట్నం అంతా జాగ్రదవస్థలోనే వుంది; గాని భోగపరాయణులు కొందరింకా మంచాలూ దిగలేదు, కళ్ళూ విప్పలేదు.

అంతచలిలోనూ, గోదావరిలో, గట్టు పొడుగునా అన్ని రేవులలోనూ చాలామంది స్త్రీపురుషులు సావకాశంగా స్నానాలు చేస్తున్నారు.

రామచంద్రం అప్పుడే స్నానం చేసివచ్చాడు. కనక షర్టుమీద కండువా కప్పుకునీ కూడా కొంచెం వొణుకుతూనే పొగడ చెట్టుకింద కూచుని, సాపు రాసిన కాగితాలలో అక్షరస్ఖాలిత్యాలున్నా యేమో అని పరిశీలిస్తున్నాడు.

నాలుగో గుమాస్తా, ఆవేళ చూడవలసిన కాగితాలన్నీ ఆఫీసులో మేజామీద సద్దుతున్నాడు.

కదంబవృక్షంకింద నుంచుని కక్షిదారు తెచ్చినకాగితాలు తిరగవేస్తూ, చెట్టుకింది ప్లీడరులాగ మధ్యమధ్య యేమిటేమిటో ప్రశ్నలు వేస్తూ లాయరు దర్జా అనుభవిస్తున్నాడు పెద్ద గుమాస్తా.

"కాఫీకి పొద్దెక్కి-పోయిందిరా" అంటూ పాలికాపుమీద చిరాకుపడి, జానకమ్మ, అప్పుడే మేడమీదకి వెళ్ళిపోయింది.

ఈ సమయంలో సుభద్రా, పంతులూ యినపగేటు తెరుచుకుంటూ లోపలికి వచ్చారు.

ఇద్దరూ తలకి వూలు మఫ్లరులు చుట్టుకునీ, కాళ్ళకి కేన్వాసుజోళ్ళు తొడుక్కునీ వున్నారు. పంతులు చేతిలో పేముకర్ర వుంది. సుభద్ర చేతిలో టార్చిలైటుంది.

వారు గేటులోకి వచ్చీ రావడంతోటే, పక్కనే పనిచేస్తూవున్న తోట మాలీ, పెద్ద గులాబీపువ్వులు రెండు దోసిటిలో వుంచుకుని యెదురువెళ్ళి చెరొకటీ అందించాడు.

కొంచెం ముందుకి వచ్చాటప్పటికి, ముందు పెద్దగుమాస్తా, తరవాత కక్షిదారూ నమస్కారాలు చేసి తప్పుకున్నారు.

మరికొంత దూరం వచ్చాటప్పటికి, పక్కకి వచ్చి నమస్కరించి, పంతులు చేతికి కాగితా లందించాడు రామచంద్రం.

"ఏమిటోయ్?"

"కథ సాపు రాసేశానండి"

"ఏమిటీ?" అంటూ పంతులయ్య చకితుడై చూశాడు. సుభద్ర కూడా మొదట చకితురాలై, తరవాత తండ్రి దగ్గిరికి వచ్చి, ముంగాళ్ళమీద నిలిచి కాగితాలు చూడసాగింది.

"నువ్వు కాగితాలు పుచ్చుకున్న దెప్పుడు రాసిందెప్పుడు?" అని అడిగాడు పంతులు.

"తమ దగ్గిర సెలవు పుచ్చుకున్న వెంటనే కాగితాలు పుచ్చుకున్నానండి. పదకొండు గంటలకే రాత పూర్తి చేశానండి."

"ఏం చురుకురా?" అని ప్రశంసించి, పంతులు "చూశావా?" అన్నట్టు సుభద్ర కేసి చూశాడు.

"సూరయ్యగారి చేతిలోనుంచి కాగితాలు వూడిపడేటప్పటికి విసుపొచ్చిందండి."

"అక్షరాలు కావివి, ఆణిముత్యాలు. చూడు తల్లీ."

"ఇంచక్కవుంది నాన్నారూ దస్తూరీ. ముద్దొస్తూ వుందండి"

ఈ మాట అన్నప్పుడు, ఆ ముత్యాల గౌరకాంతి ఆమె దంతాలశ్వేత కాంతితో మిశ్రితం అయి, ప్రవాళాధరం మీద ప్రతిఫలించి మొగం అంతా కమ్మేసింది.

"మంచి ప్రజ్ఞ" అంటూ పంతులు, కాగితాలు సుభద్రచేతి కిచ్చాడు. ఆమె అవి తిరగవేస్తూ "మధ్య మధ్య యేవో కొత్త మాటలు — ఇవేమిటండి నాన్నారూ?" అని ప్రశ్నించింది.

"మార్పు లేమయినా చేశావా యేమిటోయ్?"

"మార్పులంటే అవేమీ మార్పులు కావండి. తమ అమ్మాయిగారు నన్ను క్షమించకపోరనే ధైర్యంతో నేనాపని చేశానండి. అక్కడక్కడ కొన్ని మాటలు కొంచెం పేలవంగా వున్నాయనుకుని, అవి అలాగే రాసి, అక్కడ వుండతగ్గవని నాకు తోచిన మాటలు యెర్ర సిరాతో పైని రాశానండి. ఇలా యిప్పిస్తే కొట్టేస్తానండి."

"ఏమంటావమ్మా?"

"చాలా బాగున్నాయండి వారు చేర్చినవీ."

"అయితే, యిక కొట్టెయ్యడం యెందుకూ?"

"వెనుకటి కథలు కూడా యిలా సవరిస్తే - ఏమండి నా[illegible]రూ?"

ఆమె తండ్రికేసి ప్రశ్నార్థకంగానూ, ఆశాపూర్ణంగానూ చూసింది. అవి అందుకుని, పంతులు యథాతథంగా రామచంద్రాని కందించాడు.

"నాకంత తాహతు లేదండి. ఏదో ఘుణాక్షర న్యాయంగా వచ్చాయండి ఆమాటలు" అని వుల్లాసభరితమైన కృతజ్ఞత వెల్లడించాడు రామచంద్రం.

"పోనీ, తాహతున్నంత వరకే సవరించు. ఏం తల్లీ?"

"దిద్దడం మొదలు పెడితే ఆఘుణాక్షర న్యాయం అప్పుడు మాత్రం యెందుకు పట్టదండీ నాన్నారూ?"

"విన్నావుటోయ్?"

చక్కగా విన్నాడు; కనకనే రామచంద్రం మాట్టాడ లేకపోయాడు. సుభద్ర మాటలు అతన్ని పరవశుణ్ణి చేసేశాయి.

రామచంద్రం చేసిన దిద్దుబాటువల్ల తన రచనకి వచ్చిన విశిష్టత తలుచుకుంటూ, మధ్యమధ్య అతని మీదకి క్రీగంటి చూపులు కూడా పోనిస్తూ సుభద్ర కూడా అలాంటి స్థితిలోకే వెళ్ళిపోయింది.

ఒక్క నిమిషం అందరూ అలాగే నుంచిని వున్నారు.

తరవాత పంతులు "సరే, తోటలో కూడా యేవయినా సవరణలు చేయించా లేమో చూస్తూవుండు. ఇంతలో నేను కూడా స్నానం చేసి పిలుస్తాను, కాఫీ పుచ్చుకుందాం" అని చెబుతూ వడిగా బయలుదేరాడు.

పదేసి అడుగుల్లో యీ వేపుకి తిరిగి వోమాటూ ఆవేపుకి తిరిగి వోమాటూ రామచంద్రాన్ని చూస్తూ, సిగ్గువల్ల అంతట్లోనే చూపులు గిరుక్కున మళ్ళించు కుంటూ, మెల్లిగా నడిచి, చాలా తాపీగా చీడీలెక్కి, యెవరో గెంటుతున్నట్టు బలవంతాన గుమ్మంలోకి వెళ్ళి తలుపు చాటుచేసుకుని వొక్కమాటు నిదానంగా చూసి, తరవాత వొక్క పరుగున మెట్లదగ్గిరికీ, వొక్క దూకున మేడమీదికీ వెళ్ళిపోయింది సుభద్ర.

7

జయంతి చంద్రమౌళి పంతులంటే రాజమహేంద్రవరం వకీళ్ళలో కిరీటం లేని రాజని ప్రసిద్ధి.

నెలనెలకీ యే లాయరుకీ లేని రాబడి. రెండు మూడు వందల యకరాల యినాములు. ఎన్ని కరువులు వచ్చినా తరగని గాదులు. ఇంద్ర భవనం వంటి మేడ. చుట్టూ నందనవనం వంటి విశాలమైన వుద్యానం. మోరంపూడి రోడ్డున పాతిక యకరాల తోట. నడిబజారున పెద్ద పెద్ద కొట్లు. ఆల్కట్టు తోటలో వొక పెద్ద నివేశనం. దానవాయి గుంటలో కొత్త పంపిణీ బంగళా.

రెండు మూడు కంపెనీలలో యాభై వేల పై చిలుకు భీమా పోలసీలు.

ఒక మోటారు. ఒక బ్రూహాం. ఒక వొంటెద్దు బండి. పుష్కలమైన పాడి.

ఇన్నీ వున్నందు కతను మంచి భోగి త్యాగీనీ.

చుట్టాలు, అతిథులు, అభ్యాగతులు, స్నేహితులు, పరిచితులు, ఆశ్రితులు, యాచకులు, పరదేశులు, ఆఫీసర్లు — యెవరో వొకరెప్పుడూ యింట్లో వుంటూనే వుంటారు.

రాజమహేంద్రవరంలో సాహసానికీ, ఔదార్యానికీ అతనిదే మొదటి పద్దు. అతని సమ్మతీ, అతని సలహా, అతని సాయమూ లేకుండా సాధారణంగా అక్కడ యే వుద్యమమూ ప్రారంభం కాదు. ఏ కార్యమూ నెరవేరదు.

వకీళ్ళకందరికీ అతనిమాట అంటే చాలాగురి. తప్పుడు కేసులుపట్టడని న్యాయస్థానంలో అతనిమీద యెంతో నమ్మకం.

ఆరేళ్ళనుంచి అతను పబ్లిక్ ప్రాశిక్యూటరుగా వున్నాడు. మూడోమాటు కూడా మొన్న మొన్ననే నియుక్తుడయినాడు. అతని దగ్గిర అల్లిక పనులు చెయ్యడాని కెలాంటి కక్షిదారులూ జంకిపోతారు.

ఏ విధంగా చూసినా అతని కాపట్నంలో ప్రాతికూల్యం అనేది లేదు. లోటూ పాటూ కూడా యేమాత్రమూలేవు; కాని ముప్పయితొమ్మిదో యేట— అంటే ఆరేళ్ళ కిందట అతని ప్రథమభార్య చనిపోయింది.

పరామర్శ చెయ్యడానికి వచ్చి, మళ్ళీ పెళ్ళి చేసుకోవలసిందని రోజుల్లోనే యెందరో సలహాలు చెప్పారు. అనేకమంది కూతుళ్ళ తండ్రులు రకరకాలుగా రాయబారాలు పంపారు. వితంతువివాహం చేసుకుంటాడేమో అని తదుద్యమనిర్వాహకులు కూడా తీవ్రంగా ప్రయత్నించారు.

కాని అతను దేనికీ అంగీకరించలేదు.

"రోజు లెలాగేనా వెళ్ళిపోతాయి. సుభద్ర చల్లగావుంటే నాకదే సౌఖ్యం. అదే ఆనందమూనూ" అని అతనందరికీ వొకటే సమాధానం చెబుతూ వచ్చాడు.

అతనికి సుభద్ర యేకైకసంతానం. మరి కలగా లేదు, కలగలేదని అతనికి బెంగాలేదు. ఒక్కకొడుకు కూడా పుట్టనందుకు భార్య తల్లడిల్లిపోయేది; కాని "ఆడపిల్లచేదా?" అనేవాడతను.

రోజు లిలా గడచిపోతూ వుండగా ఆమె జబ్బుపడి, పదిమాసాలు తీసుకుని, యెన్ని వైద్యాలు చేయించినా ప్రయోజనం లేక చివరికి కాలం చేసింది.

అయితే, జబ్బు ముదిరి, యిక జీవించడం దుర్ఘటం అని అనుమానం స్థిరపడగానే "పిల్ల పెళ్ళిఅయినా నాకళ్ళ బెట్టండి" అని ప్రాధేయపడింది.

కానైతే సుభద్ర అప్పటి కెనిమిదేళ్ళ పిల్లే. అంత చిన్నతనంలో ఆమెకి పెళ్ళిచేయడం అతనికి సుతరామూ యిష్టమూలేదు. అయినా యిది భార్యతుది కోరిక అని తానుకూడా గ్రహించి వున్నాడు కనకనూ, స్వతహాగా ఆమె చెప్పిన పనిచెయ్యకుండా వుండలేకపోయేవాడు కనుకనూ, ఆమె కోరిన వరుణ్ణి తెచ్చి, దేవదుందుభులు మోగిపోయేటట్టు సుభద్రకి పెళ్ళిచేశాడు.

అదివరకి యింటోనే సరిగా మసల్లేని ఆమె, యీ వుత్సాహాతిరేకం వల్ల, పెళ్ళివారిని భోజనాలకు పిలవడానికీ, వారికి లాంఛనాలు తీర్చడానికీ, ఇంకా యిలాటివాటికీ, ఆ అయిదారు రోజులూ పూచలాగ మసిలింది.

"నా మాట విను. అన్నివిధాలా మంచిదీ, బండిలో వెళ్ళు" అంటూ అతనెంతయినా నచ్చ జెప్పబోయేవాడు; కాని ఆమె "నాళంవారి సత్రంలో విడిది—యేమంత దూరమండీ? కాకపోయినా, నా జబ్బు మళ్ళిపోయిందండీ" అంటూ ఆ గుంటలుపడ్డ కళ్ళే తిప్పుకుంటూ, చెల్లెళ్ళనీ, మరదళ్ళనీ మేన గోడళ్ళనీ, వెంట వేసుకుని దుడుగూ దుడుగూ తిరిగేది.

మనుగుడుపులు కాగానే అతను, ఆమె ఆజ్ఞ ననుసరించి అల్లుణ్ణి యిల్లరకం తీసుకు వచ్చాడు.

ఆవేళ రాత్రి, ఆమె, అతనివొళ్ళో కూచుని, అతని నోటికి తమలపాకుల చిలకొట్లు అందిస్తూ "మీరు చాలా మంచివారండీ. నా కోరికలూ, ముచ్చట్లూ అన్నీ తీర్చారండీ. ఎన్ని జన్మలెత్తి కూడా మీ రుణం తీర్చుకో లేనండీ" అంటూ మెడచుట్టూ చేతులు చుట్టేసి, బుగ్గకి బుగ్గ ఆనించి కొత్త— పెళ్ళికూతురు లాగ గునిసింది.

అంతే.

తరవాత వారంరోజులకే రోగం తిరగబెట్టి, విషమించి ఆమె గుటుక్కు-మంది.

మరో ఆరుమాసాలికి, గోదావరిలో యీతా లాడుతూ వరకంలోకి వెళ్ళిపోయి, పదహారేళ్ళ అల్లుడుకూడా దగాచేశాడు.

ఇలాగ భార్య పోవడం, కూతురు మూలపడడం, మరో సంతానం లేకపోవడం—కొన్నాళ్ళదాకా అతను అతనయి తిరగలేదు.

కాని మరో ఆరుమాసాలు గడిచాటప్పటికి "నువ్వానేనా?" అన్న క్రిమినల్ కేసొకటి రాగా అందులో పూర్తిగా దిగి, తరవాత ప్రాక్టీసులో మునిగిపోయాడు పంతులు.

వైధవ్యం వచ్చాటప్పటికి సుభద్రకి తొమ్మిదో యేడు వెడుతూ వెడుతూ

వుంది. గారంగా పెరగడంవల్ల ఆమె ప్రతీపూటా బడికి వెళ్ళి యెరగదు. కాగా, మొగుడు పోయాటప్పటి కామె మూడో తరగతి చదువుతోంది.

అప్పటికి, ఆమె, భర్తను గురించిన దుఃఖం ఆట్టే యెరక్కపోయినా అతను తరవాత బడికి పంపడాని కిష్టపడలేదు.

వెంటనే లోవరుసెకండరీ అంతస్థుకి చేరేటట్టు లెక్కలూ, చరిత్రా, భూగోళమూ నేర్పడానికి బాలికల హైస్కూలు వుపాధ్యాయురాలి నొకామెనీ, సంస్కృతాంధ్రాలు నేర్పడానికొక శాస్త్రినీ యేర్పరిచాడతను.

అప్పటికే ఆమెకి సంగీతంలో మంచి రుచీ, పరిచయమూ యేర్పడి వున్నాయి. అంచేత, వుషఃకాలంలో వొకగంటా, సాయంత్రం రెండు గంటలూ సంగీతం చెప్పడానికీ, వీణావాద్యం నేర్పడానికీ వొక విఖ్యాత విద్వాంసుణ్ణి అతను సొంతంగా రాజమహేంద్రవరంలో ప్రవేశపెట్టాడు.

కుట్టుపనులూ, అల్లికపనులూ నేర్చుకోడానికి తగిన గోష్టినీ యేర్పరిచాడు.

తల్లి చూపవలసిన శ్రద్ధ కూడా తానే చూపిస్తూ యిలాగ, అతను, ఆమె భవిష్యత్తుకి మంచి పునాదులు వెయ్యసాగాడు.

8

జానకమ్మ కూడా చిన్నతనంలోనే వితంతు వయిపోయింది.

పుట్టింట పడి, గొడ్డులాగ నానా చాకిరీచేస్తూ, బానిసలాగ కుళ్ళుమాటలు పడుతూ, కుక్కిన పేనయివుంటే ఆమెకి నిష్పూచీగానే దినాలు వెళ్ళిపోయి వుండును.

కాని అందుకామె యిష్టపడలేదు.

అస్వతంత్రపు బతుకంటే ఆమెకి సుతరామూ అంగీకారం లేకపోయింది.

చిన్నప్పుడామె మిషనరీల బాలికా పాఠశాలలో యేడో తరగతి చదివి వుంది. తద్వారా, వొక దారీ వొక తెన్నూలేని కుళ్ళు సంఘంమీద తిరగబాటు చేసే ధైర్యమూ సాహసమూ అలవర్చుకునీ వుంది.

కాగా, అన్నదమ్ములు కోపపడినా, తల్లి గోలపెట్టినా, వదినలూ మరదళ్ళూ దెప్పినా, అక్కలూ చెల్లెళ్ళూ యీసడించినా, కావలసినవాళ్ళు కళ్ళు తేలవేసుకున్నా లెక్కచెయ్యక, ఆడపిల్లలికి ప్రయివేట్లు చెబుతూ ఆమె రాజమహేంద్రవరంలోనే వుండిపోయింది.

ఈ వృత్తిలో ఆమెకి నెలకి పదిహేనురూపాయలు దొరికేవి. ఏపాతధో

చిన్న కొంప కూడా సొంతం వుంది కనుక, అద్దెబాధ లేక, ఆ సంపాదనతో ఆమె రాజాంగంగా బతికేది.

ఇలాగ రెండేళ్లు గడిచేటప్పటికి ఆమెకీ సుభద్రకీ పరిచయం కలిగింది.

జానకమ్మ పాఠంచెబితే పండువొలిచి చేతిలో పెట్టినట్టుండడం చూసి. నాలుగైదుమాట్లు యాదాలాభంగా చెప్పి, చివరికి కోరగా, నెలకి పదిరూపాయ లివ్వడానికి కంగీకరించి, రోజూ రెండుగంటలు పాఠం చెప్పడానికి జానకమ్మని కూడా యేర్పాటు చేశాడు పంతులు.

ఆమె యెనిమిదిన్నరకి వచ్చేది. ఇక్కడ తండ్రీ కూతుళ్ళకి పదింటికి భోజనసమయం.

ఏమి లేకపోయినా సర్దుకునేవాడు కాని, పంతులు, కుడివైపున యెడమ చేతి కందేటంత దగ్గిరగా సుభద్ర కూడా వుంటేగాని భోజనానికూర్చునే వాడుకాడు. ఆమె రజస్వల అయిన తరవాత కూడా వొకటి రెండు మాసాలు యీ పద్ధతే నడిచింది కాని తరవాత్తరవాత నిర్బంధంగా మానుకోవలసి వచ్చింది.

అంచేత, జానకమ్మ ఆ గంటా పాఠం చెప్పి, మళ్ళీ సాయంత్రం వచ్చి మరో గంట చెబుతూ వుండేది. ఒక్కొక్కప్పుడు సుభద్ర భోజనం అయిదాకా కనిపెట్టుకుని వుండి తరవాత పూర్తిచేసి వెళ్ళిపోయేది. మరొక్కొక్కప్పుడు—అంటే పిండి వంటలు చేసుకున్నప్పుడల్లా సుభద్ర పట్టుపట్టగా యిక్కడే భోజనంచేసి, యేవొంటిగంటదాకానో కబుర్లూ చదువూ చెప్పి ఆ దారినే తక్కిన పిల్లలయిళ్ళకి వెళ్ళేది.

ఇలాగ నాలుగుమాసాలు గడిచాయి. ఈ నాలుగుమాసాలలోనూ సంకురాత్రీ, సంవత్సరాదీ—రెండుపండుగలు వచ్చాయి. ఆ పండుగుల్లో సుభద్ర తండ్రి మనస్సు కరిగించి జానకమ్మకి రెండు పట్టుచీరలు బహుమతీ చేసింది.

మరో రెండు మాసాలికి తన హృదయమే ఆమెకిచ్చి వేసింది.

కాని పాతిక రూపాయల ఆర్జన చూసుకునీ, యీ శిష్యురాలిని చూసుకునీ సంతోషించినంత కాలం పట్టలేదు జానకమ్మకి. ఆమె ఆదాయమూ, అనుభవమూ కొందరు మొగరాజులికి కళ్ళుకుట్టాయి.

9

వారు కుట్రలు పన్నారు.

"వెధవముండకి ఆ బర్మా సిల్కుప్పర్లేమిటండీ? ఆ గొడుగేమిటండీ? ఆబర్మా

ముడి యేమికోయ్? ఆ పట్టుచీరలు-ఆ జంపర్లు-ఆ కాఫీలు-ఆ తాంబూలం-దాని దగ్గిర చదువుకున్న యేపిల్ల అయినా చేసుకున్న మొగుణ్ణి లక్ష్యపెడుతుంది టయ్యా?" అంటూ యిలాగ తీవ్రప్రచారం సాగించేశారు.

ఇందుకు ఫలితంగా "సుభద్రనే ప్రధానంగా చూసుకుంటూ మా పిల్లలికి సరిగ్గా చెప్పడంలే"దని వంకలుపన్ని, ముగ్గురుపిల్లల తండ్రులు ఆమెని నిషేధించారు. మరోపిల్ల "మానాన్న మరో మేష్టార్ని కుదురుస్తా-డు-ట" అంటూ పాట మొదలుపెట్టింది. ఇంకోపిల్ల తండ్రి "జీతం తగ్గించుకుంటేగాని నావల్ల కా"దని కబురంపాడు.

ఏమిటీ ఘోరకలి? ఏమిటి చెయ్యడం?

ఇంకో పదిరూపాయల కాశపడితే అసలుకే మోసం వచ్చింది.

జానకమ్మకి ధైర్యం సన్నగిల్లి దిగులు పెరిగింది. సంతోషం పోయి యేడుపు పట్టుకుంది.

"పోనీ, సుభద్రనే విడిచిపెట్టేస్తే?" అని ఆలోచించిందామె. "తక్కిన పిల్లల కందరికీ వరాసగా ముందు చెప్పేసి, యే మూడు గంటలకో సుభద్ర కోసం వెడితే?" అని కూడా ఆమె ఆలోచించింది.

ఆ సంరక్షకులు ఇందుకూ వొప్పుకోలేదు.

పూర్తిగా వొక్కనెల తంటాలుపడింది; కాని వ్యవహారం పొక్తుపడలేదు.

ఆ యిర్గాళువుల కీ సంగతి కూడా తెలిసిపోయింది.

మళ్ళీ వారు చెలరేగారు.

"బోగందిటయ్యా సంసారిపిల్లలికి పాఠం చెప్పవలసిందీ?" అని వొకడు. "పిల్లల చదువుకోసం ఆశిస్తే, దానివెంటపడి మొగుళ్ళెక్కడ బికారులయిపోతారో అని ఆడాళ్ళు గగ్గోలు పడిపోయారు కాదుటయ్యా?" అని యింకొకడు. "ఆగుడిశేటి పోకిళ్ళు చూసి ఆ మొగుడు ముండాకొడుకు పవిత్రాత్మ యెంత తపించిపోయిందోనయ్యా! ఆ వుసురు తగలదుటయ్యా పీనుక్కి?" అని మరొకడు.

వీటికి చిలవలూ, పలవలూ, పెట్టి మరికొందరు.

జానకమ్మ దీనికే బెంబేలుపడిపోయి వుండగా "నేనుండగా నీకంత బెంగెందుకూ?" అని జిల్లాబోర్డు ప్రెసిడెంటు వొక వుపాధ్యాయురాలిద్వారా కబురందించాడు.

"మనం యెలాంటి సాయం అయినా చెయ్యగలం" అని వొక స్కూళ్ళ యినస్పెక్టరు తన వుపాధ్యాయసచివుడి దగ్గిర సొరకాయలు నరికాడు.

"మనవార్డులో హెడ్‌మిస్ట్రెస్సుగా వేసేద్దాం వచ్చి కనపడమనవోయ్" అని మునిసిపల్ చెయిర్మను వొక బిల్లుకలెక్టరుతో చెప్పాడు.

"తగిన ఆడదిదొరక్క యింతవరకూ వూరుకున్నాం. స్థానం నరసింహారావుకి మూడురోజుల్లో వుప్పగల్లయినా పుట్టకుండా చెయ్యవచ్చు, మనలోకి రమ్మనవయ్యా" అని వొక నాటకసభ అధ్యక్షుడు తన కార్యదర్శి భుజం తట్టాడు.

"ఫలానా డైరెక్టరు మన గుప్పిట్లో వున్నాడు తెలుసా? మనం పూనుకున్నామంటే వొక మహోజ్వాలతారను చేసెయ్యగలం యెరుగుదువా?" అని వొక స్టుడియో ఆశ్రితుడు తన ఆశ్రితుడి దగ్గిర వెన్ను విరుచుకున్నాడు.

దీనికి సాయం వరాసగా రెండురాత్రులు ఇంటిమీద రాళ్ళవర్షం కురిసింది.

దానిమీద, పోలీసు సబినస్పెక్టరొకడు "లక్ష్మీకొడుకుల్ని రెండేళ్ళు జెయిలుకి పంపించేస్తాను. సాయంత్రం స్టేషనుకి తీసుకురా దాన్ని, ఈలోపున కంప్లెయింటు తయారు చేయిస్తా"నని వొక యేజెంటుని తొందరపెట్టాడు

"మనకి దమ్మిడీ ఫీజక్కర్లేదు సరిగదా, తక్కిన ఖర్చులు కూడా మనమే భరించేస్తాం. అల్లరి చేయించిన వాళ్ళెవరో, చేసిన వాళ్ళెవరో తెలుసుకునే బాధ్యతే కాకుండా, సాక్షులను సమకూర్చుకునే పూచీ కూడా మనదే, రాత్రి భోజనం అయినాక తీసుకురావయ్యా వకాల్తనామామీద సంతకం చేస్తుంది" అని వొక క్రిమినల్ లాయరు తన గుమాస్తాని తొందరపెట్టాడు.

దీంతో, యెటుచూసినా దావానలం చుట్టుముట్టినట్టు కనబడి జానకమ్మ దిగ్భ్రాంతురాలయిపోయింది.

"రాజమహేంద్రవరానికీ మనకీ యిక రుణానుబంధం లేదూ?" అని తహతహ లాడిపోయింది.

10

ఎంతో చలాకీగా వుండే జానకమ్మ మందు తిన్నట్టుండడం చూసి, గుచ్చిగుచ్చి అడిగి, సుభద్ర వొకనాడిదంతా తెలుసుకుంది. అయితే, ఆమె కిందులో చాలాభాగం బోధపడలేదు. బహుకొంచెం మాత్రం అర్థం అయింది.

పాపం పదేళ్ళపిల్ల ఆమె, యిలాంటి సంగతులు తెలవకపోవడం వింత యేమిటి? కాని "యిక నేనీవూళ్ళో వుండిబతకలేను" అని జానకమ్మ అన్నమాట ఆమెగుండెలు బద్దలు చేసేసింది.

జానకమ్మ అంటే ఆచిన్ని హృదయంలో విడిపోని అనుబంధం యేదో పురివేసుకుపోయింది. అంచేత "రాజమహేంద్రవరం విడిచి వుండడం యెలాగా?"

అని జానకమ్మకి అనిపిస్తూ వుంటే "మేష్టార్ని విడిచి వుండడం యెలాగా?" అని సుభద్రకి అనిపించసాగింది.

కాని జానకమ్మకి లాగ సుభద్రకి మార్గం దొరక్కపోలేదు.

కార్య కారణ సంబంధాలూ, సాధ్యాసాధ్యాలూ, సంభవా సంభవాలూ — చివరికి మంచి చెడ్డలు కూడా గుర్తించలేని లేత హృదయం ఆమెది. దాని కింకా మాయావరణం ఏర్పడలేదు. మానవకోటిని నడిపే స్వార్థమూ, కుయుక్తులూ, కుశ్శంకలూ దాన్నింకా కలుషితం చెయ్యలేదు.

అది వొక పొంగు పొంగింది. ఆ పొంగులో వొక ఆశారేఖ రూపొందింది.

వెంటనే ఆమె "అలా అయితే ఆ పాతిక రూపాయలూ నే నొక్కర్తెనే యిచ్చేస్తానండి. నేను మాట యిచ్చేశానంటే మా నాన్నారు తప్పకుండా వొప్పుకుంటారండి. ఏమండీ, మేష్టారూ! మా యింటికి వచ్చెయ్యండి. మా యింట్లోనే భోజనం చేద్దురుగా నండి. మా యింట్లోవుంటే యిక మిమ్మల్నెవరూ అల్లరి పెట్టలేరండి" అంటూ జానకమ్మ రెండు చేతులూ పట్టుకుని "వస్తానండి. వచ్చెయ్యండి. మీ కాళ్ళు పట్టుకుంటానండి. మీరే మా అమ్మ అనుకుంటానండి" అని ఆచేతులు వూపుతూ జాలిగా చూస్తూ ప్రాధేయపడింది.

జానకమ్మ గుండె ఝల్లుమంది. ఆమె స్త్రీత్వం ప్రబుద్ధం అయింది. సంసారజంజాటంలో అలుముకున్న కార్కశ్యం అంతా క్షాళితం ఆయిపోయి అది నిజరూపం పొందింది.

నమ్మినవాళ్ల గొంతు కోసెయ్యడం—ఎప్పుడూ యెరగనివాళ్ళు భూతాల్లాగ మింగెయ్యాలని నోళ్ళు తెరుచుక్కూచోడం — అంత పట్నంలోనూ "అయ్యో, నీ గతి చివరకి యింతకి వచ్చిందా?" అని పరామర్శ చెయ్యగల వాళ్ళు కనపడక పోవడం — ఇలాంటి స్థితిలో వొక ఆడపిల్ల — పదేళ్ళ నిసుగు— తల్లి లేని గుడ్డు — ఇలా పాకు లాడడం — దీంతో జానకమ్మ నిలువునా మాతృదేవత అయిపోయింది.

"మామ్మే, మా తల్లే" అంటూ గభీమని సుభద్రని యెత్తుకుంది. రెండు చేతులూ బిగించి రొమ్ముకి గా—ట్టిగా వొత్తుకుంది. ఊర్ధ్వశ్వాసతో మూర్ధాఘ్రాణం చేసింది.

నూత్నావేశంతో ఆ బుగ్గా యీ బుగ్గా ముద్దులాడి, వొక్కమాటు ఆ అమాయకపు కళ్ళల్లోకి సకరుణంగా చూసి, ఆ లేమోముదమ్మిలో తొణికిసలాడే శైశవ మౌగ్ధ్యమాధుర్యం అంతా అనుభవించి, కంఠంలో గద్గదికా, కళ్ళల్లో బాష్పలహరీ ఆవిర్భవించగా, హృదయం వాత్సల్య పరిప్లుతమున్నా

అయిపోగా, ఆమె మొగం తన భుజం మీదికి చేర్చి పరవశురా లయిపోయింది.

సుభద్ర తన్ను తానే మరచిపోయింది.

11

ఏదో పనిమీద, యీ స్థితిలో పంతులు అక్కడికి వచ్చాడు.

అతని కళ్ళు చెదిరిపోయాయి.

అవసరం అయితే గదుముతూ చదువు చెప్పవలసిన జానకమ్మా, యెదట కూచుని చేతులు జోడించుకుని భయభక్తులతో పాఠం చెప్పించుకోవలసిన సుభద్రా యిలా వుండడం అతన్ని ఆశ్చర్యచకితుణ్ణి చేసేసింది.

కింద పలకా పుస్తకాలూ చెదిరి చెదిరి పడివున్నాయి.

"సుభద్ర అల్లరి చేసిందా? చేస్తే జానకమ్మ యిట్టే అందా? అంటే రోషం వచ్చి సుభద్ర యేడ్చిందా? ఏడిస్తే తనకి తెలిసి యేమని పోతానో అని యెత్తుకుని జానకమ్మ సముదాయిస్తోందా?" అని మొదట అతని కనుమానం కలిగింది; గాని యిద్దరూ వొకర్ని వొక రింకా అదుముకుంటూనే వున్నారు. ఇద్దరి మొగాలూ ముగ్ధమోహనా లయే వున్నాయి. ఇద్దరి కళ్ళూ ఆనంద ముద్రితాలయే వున్నాయి.

ఎటు నిర్ధారణ చేసుకోడానికీ వీలుపడలేదు.

చివరకి "అదేమిటి తల్లీ" అని మాత్రమే పలకరించి వూరుకున్నా డతను.

దీంతో ఆ యిద్దరూ ప్రకృతిలో పడ్డారు.

జానకమ్మ కొంచెం సిగ్గుపడింది.

కాని, సుభద్ర గభీమని దిగజారి, వొక్కదూకున తండ్రి దగ్గరికివెళ్ళి, రెండు చేతులూ పట్టుకుని, అప్పటికీ కొంచెం సుడి తిరుగుతూనే వుండిన తాదాత్మ్యంవల్ల మధ్యమధ్య నట్టుకుంటూనే తాను విన్నదంతా యెగుడు దిగుడుగా చెప్పి "ఆ పాతిక రూపాయలూ నేనే యిచ్చేస్తానన్నానండీ. మీరు వొప్పేసుకోవాలండీ. మన యింటికి వచ్చెయ్య మన్నానండీ. మేష్టారే మా అమ్మ అనుకుంటానండీ" అంటూ కళ్ళల్లోకి అనూయికంగా చూసింది.

"మేష్టారే మా అమ్మ అనుకుంటానండీ" అన్న మాట చెవిని పడేటప్పటికి పంతులు చూపులూ, జానకమ్మ చూపులూ చకితాలై శరవేగంతో తారసిల్లాయి.

వెంటనే ఆచ్ఛాదనం తొలిగిపోయి, పిహిత మయిపోయివుండిన దృఢ తరానుబంధం యేదో వారి కిద్దరికీ హఠాత్తుగా అనుభూతం అయినట్టయింది

ఇద్దరి కళ్ళల్లోనుంచీ వొక నూత్నసందేశం బయలుదేరి యిద్దరి హృద యాలకూ అందినట్టుకూడా అయింది.

దాంతో వారెప్పుడూ అనుకోని వొక కొత్త భావం అంకురించింది. దాని వేగానికి తట్టుకోలేక యిద్దరూ వొకమాటు వూగిపోయారు.

వల్లమాలిన సిగ్గువచ్చి జానకమ్మ మొగం కిందికి వంచేసి. పంతులు మొగం పక్కకి తిప్పేసింది.

ఇదంతా వొక్క క్షణంలోనే జరిగిపోయింది; కాని అక్కడికే యెంతో అలస్యం అయిపోయినట్టు అసంతృప్తురాలై సుభద్ర "ఏమండీ? ఏమంటారండీ? చూశారా? మాట్టాడరూ? మాట్టాడరూ? మాట్టాడరూ? పోనీయండి" అని ముచ్చెం మూడు మాట్లూ అడిగి, మూతి బిడాయించుకుని దూరంగా వెళ్ళిపోయింది.

సుభద్రను చూసి జానకమ్మ "వెర్రిపిల్ల. ఉబలాటం తప్ప మరేమీ యెరగదు" అని మాత్రమే అనుకుని వూరుకుంది; కాని పంతులు గజగజ లాడిపోయాడు.

ఎవ రసంతృప్తులయినా, యెవరు భీష్మించుకూర్చున్నా, యెవరు కోపించినా అతను జంకడు. లక్ష్యపెట్టడు. పైగా నిర్దాక్షిణ్యంగా యెదురుకుంటాడు. ఎంత పనయినా చేస్తాడు.

సుభద్ర అయితే మాత్రం యిక నిలవలేడు.

ఆమె మూతి ముడుచుకుందంటే. అతను, ప్రళయం వచ్చినంతగా తల్లకిందులయిపోతాడు.

అంచేత, అతను, వెంటనే ఆమె దగ్గిరికి వెళ్ళి "లేదమ్మా లే"దంటూ యెత్తుకుని, తటపటాయిస్తూనే జానకమ్మకి కొంచెం దగ్గిరగా వచ్చి "మా అమ్మ చిన్నపిల్ల" అని అనుకోవద్దు. ఈ యింట్లో ఆమె మాటకి అడ్డులేదు. అది అక్షరాలా జరిగితీరవలసిందే. "ఒక్క పిల్లకోసం పాతికరూపాయలా?" అని మీకు సంకోచం అక్కర్లేదు. నా సంపాదన అంతా మా అమ్మది. ఇదంతా జాగ్రత్తగా చూచుకోవాలంటే యెంతజ్ఞానం కావాలీ? దానికి మీరువేసే పునాదిని పట్టి చూస్తే పాతికరూపాయలంటే యేపాటి? ఇక తక్కిన సంగతులు - వాటి విషయమై నేను చెప్పడం ధర్మంకాదు" అని జానకమ్మతో అని "ఏంతల్లీ? నీకోపం తీరిందా?" అని సుభద్రని గారాంగా అడిగాడు.

"కోపం తీరడానికిందులో యేం వున్నట్టూ?" అనుకుంది జానకమ్మ.

తనకి కావలసిందేదో అది లేకపోగా సుభద్రకి ఈ మాటలు నచ్చలేదు.

దానిమీద ఆమె తండ్రి బుగ్గలు పుణుకుతూ, తన కాళ్ళు వూపుకుంటూ "మరి-మరి- మన యింటికి వచ్చెయ్యమనండి" అంటూ గునిసింది.

పంతులు జానకమ్మకేసి చూశాడు. సిగ్గుపడి జానకమ్మ బదులు చూపులు చూడలేకపోయింది; కాని ఆ గండస్థలాల మీదా, ఆ పెదవులమీదా,

ఆ కీగంటి చూపుల్లోనూ లాస్యంచేస్తూ వున్న చిరునవ్వు లొంగదీసుకోలేక పోయింది. దానికి ప్రోద్బలం చేస్తూ వున్న ఆమోదం వుపసంహరించుకోలేక పోయింది. మొగానికి గాంభీర్యం పూసుకోలేకపోయింది.

సుభద్ర కిది కూడా అర్థం కాలేదు. తన ప్రశ్నకి జవాబు వచ్చితీరాలి. తాను చెప్పింది జరిగి తీరాలి. ఇదీ ఆమె పద్ధతి.

"మరి మన యింటికి వచ్చెయ్యమనండి నాన్నారూ" అని ఆమె మళ్ళీ రెట్టించింది.

ఇరుకున పడ్డాడు పంతులు.

అంతా స్పష్టంగా తెలుస్తూనే వుంది; అయినా అతనికి ధైర్యమూ సాహసమూ కలగలేదు. మనస్సు పరిపరివిధాలా పోయింది.

ఏమయినా సుభద్రని మరిపించడం అసంభవం. చివరికతనికొక యుక్తి తోచింది.

"ఈ మేడ నాదేకాదూ తల్లీ?" అని కొంటెచూపులు చూస్తూ అడిగాడతను.

"అమ్మో! మీదేం? నాకిచ్చేసీ? మామ్మే? మళ్ళీ పుచ్చేసుకుందా మనుకుంటు న్నారు కామోసు పా—వం"

కళ్ళుతిప్పుకుంటూ యిలా అని గారాం కుడిచిందామె.

"అయితే, మరి నీయింటికిరమ్మని నేనెలాగమ్మా పిలవడం?"

తల వూపుకుంటూ కళ్ళున్నూ తిప్పుకుంటూ యిలా అడిగి ఆమెకంటే యెక్కువ గునిశాడతను.

సుభద్ర తెల్లపోయింది.

ఆమెకి మాట తోచలేదు. అలా అని వూరుకోనూ లేకపోయింది. తండ్రి చంకనే వుండి, కాళ్ళూపుకుంటూ, యిలాగా అలాగా అభావదృష్టులు పరుపుతూ యుక్తికోసం వెతకసాగింది.

అటు సుభద్ర లాగే యిటు జానకమ్మ కూడా మొదట తెల్లపోయింది.

"మన యింటికి రమ్మన మనండి" అంటూ సుభద్ర మళ్ళీ మళ్ళీ రెట్టించి నప్పుడు తన కెంతో మధురమైన ఆహ్వానం వస్తుందని అనుకుందామె.

నమ్మింది. ఆశించింది. ఎదురు చూసింది; కాని అదేమి మాటా? అందులో యెన్ని అర్థాలూ? ఎంత బింకమూ ఎంత యుక్తీ? ఎంత ముస్సద్దీతనమూ?

చివరి కెంత ఆశాభంగమూ?

ఈ నిర్విణ్ణతకి సాయం, ఆమెకి, అమాయికురాలయిన సుభద్రమీద జాలి కూడా కలిగింది. తనకోసం అంతగా దేవుల్లాడుతూ వున్నందుకు ఆమె మీద మమకారమున్నూ కలిగి ఆ నిర్విణ్ణతను అణిచేసింది.

పైగా యెన్నాళ్ళనుంచో అణిగి వుండిన్నీ అప్పుడప్పుడే మళ్ళీ రేకెత్తి అల్లుకుపోయి వుండిన ప్రణయం చనువూ సాహసమూ కలిగించింది.

దాంతో, వోరకంట చూస్తూ జానకమ్మ "పాపం! పసిదాన్నీ చేసీ—" అంటూ మందరంలో యేదో అనబోయింది; కాని సగంలోనే అత నందుకుని "పసిది కనకనే కథ యిలా నడిపించింది. లేకపోతే—" అంటూ శేషం చూపులతో పూర్తిచేశాడు.

చాలు.

ఆ చూపులు ఆమె హృదయం దూసుకుపోయాయి.

ఆమె యెదురుచూస్తూ వున్న మధురాహ్వానం కూడా అందించాయి.

వెంటనే "రాతల్లీ" అంటూ చేతులు చాపుకుని ఆమె వొక్క అడుగు ముందుకివేసింది. "వెళ్ళమ్మా" అంటూ అతనున్నూ వొక్క అడుగు ముందుకి వేశాడు.

కాని ఆ సన్నివేశం, సుభద్రని చంటిపిల్లని చేసేసింది. ఇంకా మాటలు రాని పసిపాపనే చేసేసింది.

దీంతో తండ్రి చంకనే వుండి ఆమె "నేను దిగిరాను" అన్నట్టు, "ఊఁ, ఊఁ" అంటూ గునుస్తూ చేతులుచాపి గభీమని ముందుకి వాలింది.

ఆమె పడిపోతుందేమో అని యిద్దరూ కంగారుపడ్డారు.

మొదట కూతుర్ని గట్టిగా పట్టికుని, తరవాత, అతను జానకమ్మకేసి సాకూతంగా చూశాడు.

ఒకప్పుడు ఇక లేనే లేదని నిరాశ చేసుకున్న మాతృత్వం యిలాగ హఠాత్తుగా అనుభూతం అయి జన్మాంతర భావన కలిగించగా, జానకమ్మ, అప్రయత్నంగానే వొక్క అంగతో అతనికి దగ్గిరగావెళ్ళి, నిస్సంకోచంగా— నిర్భర వాత్సల్యంతో అతని చేతుల్లోనుంచి సుభద్రను పుచ్చుకుని, అతని కళ్ళల్లోకి గంభీరంగా చూస్తూ రొమ్ముకి అదుముకుని వివశ అయిపోయింది.

ఇది సుభద్రకి, కన్నతల్లి మళ్ళీ బతికి వచ్చినట్టనిపించింది. రెండు మూడేళ్ళుగా ఘనీభవించి పోతూవుండిన మాతృవియోగ వ్యథ అంతా తీరి పోయినట్టున్నూ అనిపించింది.

ఆమె కళ్ళల్లో కొత్త తేజస్సు మెరిసింది. హృదయవీణ కొత్తనాదం పలికింది. మొగంమీద పరిపూర్ణమైన జీవకళ అంకితం అయింది.

వెంటనే ఆమె రెండుకాళ్ళూ నడుముకీ, రెండుచేతులూ మెడకీ చుట్టబెట్టి భుజంమీదకి వాలి జానకమ్మ చేతుల్లో బొమ్మ అయిపోయింది.

ఇదంతా చూశాటప్పటికి పంతులు మనస్సు గుబగుబలాడి పోయింది. కళ్ళు చెమ్మగిల్లాయి.

ఆ కళ్ళకి, జానకమ్మ మొగంమీద సుభద్ర తల్లిముఖకళ స్పష్టంగా కనబడింది.

దానిమీద, నామకరణమహోత్సవంనాడు పీటలమీద నుంచి లేచాక, కళ్ళతో పిలిచి, గదిలోకి తీసుకువెళ్ళి, ఆమె, సుభద్రను తన చేతుల్లో వుంచి అవిరళిత కపోలంగా తన వక్షస్థలంమీద వాలి, "వొక్కమాటు కళ్ళు విప్పి చూడు తల్లీ! నిన్నెవరమ్మా యెత్తుకున్నారూ?" అని గునుస్తూ, కెందమ్మి రేకల వంటి వేళ్లతో ఆ చిన్నినోరు పుణికిన ఘట్టం స్మృతికి తగలగా అతనూ పరవశుడయిపోయాడు.

12

ఆపూట కక్కడే భోజనం చేసి, యేదో మాటమీద మేడ అంతా కలయ చూసి, ఆ వైభవానికి ముగ్ధఅయి "యెంతవుండి యేమి లాభం? అడివిలో వున్నట్టున్నాను. నాలావణ్యానికి వినియోగం యేది? నాయాతనయెవ రెరుగుదురూ? ఇన్నాళ్ళకి నువ్వు కనబడ్డావు. నీకోసం యెదురు చూస్తున్నాను" అని గృహలక్ష్మి విన్నవించు కున్నట్టనిపించగా పొంగిపోయి, వొంటిగంట దాటాక మహోల్లాసంతో యింటికి వెళ్ళింది జానకమ్మ.

కాని తాళం తీశాటప్పుడు చేతులు పట్టు తప్పిపోయాయి. తలుపులు తెరిచాటప్పుడు వొళ్ళంతా వొణికిపోయింది. లోపల అడుగు పెట్టాటప్పటి కెవరో అదృశ్యులయి వచ్చి, అమాంతంగా మీద పడి, వొళ్ళంతా రక్కుతున్నట్టనిపించింది.

మనస్సు బేజారై పోయింది. కళ్ళు చెదిరి పోయాయి. తల తిరిగి పోయింది. కాళ్ళు తేలిపోయాయి.

నుంచో లేకపోయింది.

వెంటనే తలుపులు చేర వేసిందీ లేందీ యెరగకుండానే వొక్కదూకున వెళ్ళి మంచంమీద పడిపోయింది.

ఆమె కళ్ళు తెరుచుకునే వుంది; కాని గోడలికి ఆపటాలు లేవు. ఆ కిటికీ లేదు. ఆ బీరువా లేదు. ఆ డ్రెస్సింగు టేబిలు లేదు. ఆ మెరుపులైటు లేదు. ఆ నిలువుటద్దం లేదు. గుమ్మానికి ఆ పూసల జాలరు లేదు. మంచాని కా దోమ తెర లేదు.

ఆ దృశ్యం అంతా మారిపోయింది.

దభ్భైయ్యేళ్ళ మొగుడు ముక్కుపొడుం నూరిపెట్టలేదని గింజుకుంటు న్నాడు. ఎనభై యేళ్ళ పెద్దాడబడచు "మొగుడు మంచాన పడివుండగా నీకా పువ్వుల బేరం యేమిటే?" అని రుంజుకుంటోంది. అరవై యేళ్ళ చిన్నాడ పడుచు "యేకాదశిపూటా రాత్రి నీకు అన్నం పెడతానేం? ఇంద ఈ కాస్త్రా మింగి తగులడు" అంటూ నీళ్ళు కారుతున్న చలిమిడి ముందు పడేసిపోతోంది. పక్కయింట్లో అద్దెకున్న భావకవి గోడ అవతల పచారుచేస్తూ యేడుపు పాటలు పాడుతున్నాడు.

జానకమ్మ వొళ్ళు జలదరించేసింది.

చూడలేక ఆమె కళ్ళు గుచ్చేసుకుంది.

అయినా ఆరాటం పోలేదు; కాని సుమారు వొక్క అరగంట గడిచా టప్పటికి కళ్ళు అలా మూసుకునే వుండగా నిద్ర వచ్చింది.

మళ్ళీ మెలుకువ వచ్చాటప్పటికి థన్ థన్ థన్ అంటూ హాల్లో గడియారం నాలుగు కొట్టింది.

అంతసేపు వొళ్లు తెలవకుండా పడి వుండిపోయినందు కాశ్చర్యపడుతూ ఆమె లేచి కూచోబోతూవుండగా "మేష్టారూ" అని పిలుస్తూ వూచలాగ సుభద్ర వచ్చింది.

పైట సవరించుకుంటూ ఆమె "వస్తూ"న్నా నంది; కాని మాట పూర్తి కాకుండా యెగిరి గదిలోకి వచ్చి "పడుకున్నారా? నిద్రపోయారా? వీధి తలుపులు చేరవేసే వుంచేశారేం?" అని గుక్క తిప్పుకోకుండా అడుగుతూ తొడమీద కూచున్నంత యిరుగ్గా కూచుంది సుభద్ర.

ఈ మాటలవల్లా, యీ స్పర్శవల్లా బద్ధకం పూర్తిగా తొలిగిపోగా, జానకమ్మ, మెరుపు కొట్టినంత చురుగ్గా సుభద్రని చేతుల్లోకి తీసుకుని, వొక్క మాటు గట్టిగా కౌగలించుకుని, ఆమె మొగం తన మొగం దగ్గిరికి చేర్చుకుని "మీ నాన్నారు కోర్టునుంచి వచ్చారా!" అని చెవిలో వూదినట్టడిగింది.

ముందు "వచ్చా" రన్నట్టు తల వూపింది సుభద్ర. తరవాత "మా నాన్నా రివాళ కాఫీ హోటల్లో ఫలహారం చెయ్యలేదుట. వొట్టి కాఫీ అయినా నోటికి పోయింది కాదుట" అంది.

"అయ్యో" అని జానకమ్మ స్తబ్ధ అయిపోయింది.

ఈ మాట చెవిని పడేటప్పటి కామె అనుమాన శేషాలన్నీ యెగిరిపోయాయి. సంకోచాలన్నీ పటాపంచలై పోయాయి. భీతికూడా సన్నగిల్లి పోయింది. ఇన్నిటి కిందా యిందాకణ్ణుంచీ నలిగిపోతూ వుండిన ప్రణయం మళ్ళీ పురెక్కేసింది.

వెంటనే "యింటి కయినా వచ్చారు కారేమమ్మా?" అని ఆత్రంగా అడిగింది.

"పని తెమిలింది కాదుట."

"మధ్యాహ్నం భోజనం కూడ సగం సగమే చేశారు పాపం."

"మీరు మాత్రం కడుపునిండా తిన్నారా యేమిటివాళ?"

ఇలా అని సుభద్ర నిశ్చలంగానే అడిగింది; కాని యిది విని జానకమ్మ పొంగిపోయింది.

"ఎవ రన్నా రమ్మా?"

"మా నాన్నా రన్నా రమ్మా."

సిగ్గూ, ఆనందమూ జానకమ్మని వూపేశాయి.

"ఇంటికి వచ్చా కయినా కసింత కాఫీ—"

"కలపడం తరవాయిగా అంతా సిద్ధం చేసి వుంచింది కామప్ప."

"కాఫీ యిచ్చి వస్తేం నువు?"

"మీకు మాత్రం యివ్వవద్దూ?"

సుభద్రని రొమ్ముకి అదుముకోబోయి, మళ్ళీ అంతలో ఆగి "ఇంట్లో పడుకుని సుఖంగా నిద్రపోయినదానికి నా కెందుకు తల్లీ యిప్పుడూ?" అని శిరస్సు మూర్కుంటూ అడిగింది జానకమ్మ.

"మీరూ సోలిపోయే వుంటారన్నారు మా నాన్నారు. నాకూ అలాగే తోచింది, వచ్చేశాను" అని జవాబు చెప్పింది సుభద్ర.

ఈ మాట వినడం తరవాయిగా వొక్క వూపున సుభద్రని గాట్టిగా కౌగలించుకుని "అప్పుడే మొదలయిందా విరహం? అప్పుడే, కాఫీ పుచ్చుకోడానికి జానకి పక్కని వుండవలసి వచ్చిందా? మామ్మే, మా తల్లే! నీకూ నేను సోలిపోయి వుంటాననే తోచిందా?" అంటూ వూర్ధ్వశ్వాసతో ఆ బుగ్గ విడిచి యీబుగ్గా, యీబుగ్గ విడిచి ఆ బుగ్గా కందిపోయేటట్టు ముద్దులు పెట్టి మళ్ళీ వొకమాటు రొమ్ముకి అదుముకుని, యెలా వున్నదలా లేచి కొళాయి దగ్గిరికి బయలు దేరింది జానకమ్మ.

నీళ్ళు పోసుకునేటప్పుడూ, చీరారైకా మార్చుకునేటప్పుడూ, నిలువుటద్దం యెదట నుంచుని తలా బట్టలూ సవరించుకునేటప్పుడూ, యేమి టేమిటో చెబుతూ యేమిటేమిటో అడుగుతూ, సుభద్ర కూడాకూడా తిరుగుతూ వుండగా, యేమిటేమిటో భావించుకుంటూ, యేమిటేమిటో వూహించుకుంటూ యేమిటేమిటో కలలుకంటూ యేమిటేమిటోచెబుతూ, ఆమెవొక్క అరగంటలో తయారయింది.

ఉత్తరక్షణంలో యింటికి తాళంవేసి యిద్దరూ బండి దగ్గిరికి వచ్చారు.

వారిని చూడగానే సారథి, తలుపు తీసి పట్టుకునుంచున్నాడు. ముందు సుభద్ర యెక్కికూచుంది. ఇలాగా అలాగా వీధి పొడూగునా వొకమాటు పారజూసి "కుళ్ళికుళ్ళి చావండి" అంటూ యిరుగు పొరుగు వాళ్ళమీద నొడ్డు పెట్టేసి, జానకమ్మ తరవాత యెక్కింది.

సుభద్ర "తొరగా వెళ్ళాలి" అనగా "మంచిదమ్మా" అని సారథి వెంటనే తలుపు వేసేసి, తనస్థానంలోకి వెళ్ళి కూచుని, కొరడా ఛెళ్ళు మనిపించాడు.

"ఈ బండిపేరు బ్రూహాం. మీకు తెలుసా? అని" అడిగింది సుభద్ర.

"ఇప్పుడు తెలుసు" అని బదులు చెప్పింది జానకమ్మ.

"మా అమ్మకోసం కొన్నారు మా నాన్న రీబండి. వూళ్ళోకి యెక్కడికి వెళ్ళవలసివచ్చినా మాఅమ్మా నేనూ దీనిమీదే వెళ్ళేవాళ్ళం. ప్లాస్కునిండా కాఫీ పోసుకుని, రోజూ సాయంత్రం నాలుగున్నరకి బయలుదేరి మా అమ్మా నేనూ దీనిమీదే తోటకి వెళ్ళేవాళ్ళం. మానాన్నారు కోర్టునుంచే కారులో వచ్చేసేవారు. మా తోటలో యించక్కని బంగాళా వుంది. దానిముందు లో-తైన పే-ద్ద చెరువు కూడా వుంది. ఆ చెరువునిండా యెర్రకలవపువ్వులు. మధ్య మధ్య తెల్లతామరపువ్వులు. ఒకమూల నల్లకలవపువ్వులూ, మరోమూల తెల్లకలవ పువ్వులూనూ. చెరువుమధ్య గచ్చుస్తంభంమీద పెద్దపావురాలగూడు. ఆగూటి నిండా పావురాలు. మేష్టారోయ్! వాటిలో వొకటి నన్ను చూసిందంటే, వెంటనే మీదికివచ్చి వాలి, నన్ను ముద్దుపెట్టుకుంటుందండి. నేనూదాన్ని ముద్దుపెట్టుకుంటానండి. మరీ-తరవాతా? ఆ చెరువులో ముద్దులు మూటకట్టే డింగీ వుంది. అయిదుకాగానే కాఫీపుచ్చేసుకుని, ఆ డింగీలో కూచుని కబుర్లు చెప్పుకుంటూ మేము ముగ్గురుమూ ఆరయాదాకా చెరువంతా తిరిగేసేవాళ్ళం. మా అమ్మ పావురాలగూట్లో రోజుకి తవ్వెడు సెనగపప్పు పోసేది. మా నాన్నారి మేజామీది పూలబేసినులోకి నేను, తెల్లతామరపువ్వొకటీ, నాలుగైదు నల్లకలువలూ, యేడెనిమిది తెల్లకలువలూ, పదివన్నెండు యెర్రకలువలూ, తీసేదాన్ని. ఇంటికి ముగ్గురమూ కారులో వచ్చేసేవాళ్ళం. ఒక్కొక్కనాడు మా నాన్నారి పక్కని కూచుని మా అమ్మే కారునడిపేది, నేను బూరా వొత్తేదాన్ని. అసలు బూరా వొత్తడం యెప్పుడూ నేనేలెండి, ఏమండీ, మేష్టారూ, మళ్ళీ రేపణ్ణుంచి మనమూ వెడతాం, కదుటండీ?"

మురిసిపోతూ, చేతులు పట్టుకునివూపుతూ సుభద్ర యిలా అనేటప్పటికి జానకమ్మ వొళ్ళు ఝల్లుమంది.

13

ఆ వెళ్ళడం వెళ్ళడం జానకమ్మ పంతులు మేడలోనే వుండి పోయింది. మరియింటికి వెళ్ళలేదు.

చూడ్డానికయినా—అర్ధరాత్రి అయినా వెళ్ళలేదు.

నిజానికి, ఈ సంగతి కొన్నాళ్ళదాకా అయినా బ్రహ్మభేద్యంగా వుండి పోవలసింది.

కాని, సామానంతా మేడకి పట్టించుకు వెడుతూ, టూలెట్టు బల్లగోడకి తగిలిస్తూ "ఎక్కడా అనకూడదు సుమండీ. నాకూడు పడగొట్టినవారవుతారు సుమండీ" అని బెదురుతూ బెదురుతూనే యెత్తుకుని, చివరికి "చెప్పవద్దూ? కళ్ళతో చూడలేదే అనుకోండి; కాని నా కనుమానంగానే వుంది సుమండీ. మీరు స్నేహితులు కనక మీ దగ్గిర దాచలేక పోతున్నాను. బాబోయ్! కొంపతీసి—యెక్కడైనా—అపరాధిని" అని లెంపలు వేసుకుంటూ, నాలుగో గుమాస్తా, మన్నాడు పొద్దున్నే వొకట్యూటరు దగ్గిర నోరుజారేశాడు.

అయితే అయింది, ఆట్యూటరు అలాంటివాడూ యిలాంటివాడూ అయితే బాధ లేకపోవును: కాని అత నసాధ్యుడూ అఖండుడూనూ.

అంత చక్కగా బోధించి పాఠాలు చెప్పగలవాడు రాజ మహేంద్రవరంలోనే మరొకడు లేడు. అతనికున్నన్ని ప్రయివేట్లు కూడా మరెవరికీ లేవు.

అసలు, జానకమ్మ ప్రయివేట్లు పడగొట్టించినవాడే అతను.

ఇక చెప్పడానికేం వుందీ?

అత నావేళ తన పలుకుబడి అంతా వినియోగించుకున్నాడు. తన బోధనాశక్తి పూర్తిగా కనబరిచేశాడు.

ఖరాగా పదికొట్టాటప్పటికి, ఇన్నీస్‌పేటకి యిన్నీస్‌పేట అంతానూ, వూళ్ళోకొంత వరకూనూ, మంగళవారప్పేట సగం దాకానూ గోలగోల చేసేశాడు.

దీంతో, ఆమెకోసం తపసు ప్రారంభించిన వారందరూ యోగభ్రష్టులయిపోయారు.

వ్యాఖ్యాత లందరూ గోష్ఠికి కూచున్నారు.

అమ్మలక్క లందరూ "చూశావుటో వోవిడా" అంటే "విన్నావుటో వోయమ్మా" అంటూ నీలాటిరేవుల్లో బుగ్గలు నొక్కుకున్నారు.

ఆమె యిరవై అయిదేళ్ళ వితంతువుకావడం—అతను నలభైయైదేళ్ళ విధురుడు కావడం—ఇంటో సుభద్ర తప్ప మరో ఆడది లేకపోవడం—

ఆమె పంతుల్ని అలుముకుందన వారందరూ నిర్ధారణ చేసేశారు.

ఆమె పంతులమ్మ కనక అతనికి "పంతులయ్య" అని బిరు దిచ్చారు.

అతనితో సంబంధం గల పెద్ద లందరూ మెరుపు కొట్టినట్టయి పోయారు.

లోకం యిలాగ కిందామీదా పడిపోతూ వుండగా, అప్పటికి "మేష్టారు" మాత్రమే అయివుండిన జానకమ్మ వొక్క వారానికి,

సుభద్రకి "వాసే పిన్ని" అయిపోయింది.

పంతులయ్యకి "జానీ" అయిపోయింది.

ఇంటో వున్న నౌకర్లకి, చాకర్లకీ, గుమాస్తాలకీ, వంట లక్క కామవ్వకీ "అమ్మగా" రయిపోయింది.

ఆ యింటికి యజమానురాలే అయిపోయింది.

సుభద్ర తల్లే మళ్ళీ యీ రూపంగా వచ్చిందని నమ్మి, పంతులయ్య, సంఘానికి బలాదూరు చెప్పేశాడు.

14

రామచంద్రం సాపు రాసినకథ మలీనెల భారతిలో పడింది.

"ఈ మాటు నాకథకి బొమ్మలు రాయించారు నాన్నారోయ్" అంటూ యెగురుతూ దుముకుతూవెళ్ళి, సుభద్ర, యింటికి వచ్చీరావడంతోటే తండ్రి చేతిలోవుంచింది భారతి.

ఒకమాటు కథ వున్న పేజీలన్నీ తిరగవేసి "భేష్! మొలిచినట్టున్నాయి బొమ్మలు. అయితే, డి. యస్. అంటే యెవరో తెలుసా తల్లీ?" అని అడిగాడు పంతులయ్య.

"దామెర్ల సత్యవాణిగా రండీ"

"అన్నమాట. అంచేతే యింత చక్కగా వున్నాయి"

"ఒకమాటేం జరిగిందనుకున్నారు నాన్నారోయ్? ఆవేళా? సరిగా వారంరోజులు కాలేదండీ యింకానూ. ఆవిడ అన్నగారు సాంబశివరావుగారున్నారూ? వారి అబ్బాయిని చూడ్డానికి వెళ్ళామండీ నేనూ పిన్నినీ, పాపం సత్యవాణిగారు బొమ్మలు రాయడం మానుకుని మాతో గంటసేపు వుండిపోయారండీ. గాలరీలోవున్న పటాలన్నీ చూపించారు కూడానండీ. అప్పుడు శ్రీనివాసరావు తాతయ్యగారు వచ్చి "మావాణికి కథలు రాయడం నేర్పు తావుటమ్మా" అని అడిగారండీ నన్నూ. దానిమీద "మాగాలరీలోవున్న చిత్రాల

కన్నిటికీ కథలు రాస్తావా?" అని అడిగారండీ సత్యవాణిగారూ; కాని తాము నా కథకి బొమ్మలు రాసినట్టు చెప్పారుకాదు. చూశారా నాన్నారూ?"

"సరియైన విద్వత్తు కలవారెప్పుడైనా ఆత్మస్తుతి చేసుకుంటారా తల్లీ!"

"ఏమండీ, నాన్నారూ! వెనకటి కథలకి కూడా రాయించి పెట్టరుటండీ ఆవిడచేత బొమ్మలూ?"

"నేను రాయించే దేమిటమ్మా? నువ్వు వెళ్ళి అడిగితే రాయరూ?"

"రాస్తారనే తోస్తుందండీ. నేనూ పిన్నీ వెళ్ళి అడుగుతామండి"

"వెళ్ళండి"

సుభద్ర, బొమ్మలుంటే తన వెనకటికథ లెలావుంటాయో రూపించు కుంది.

బొమ్మలు చక్కగా వున్నట్టేవుంది; కాని కథలు?

అక్కడక్కడ కొంచెంకొంచెం వాదులు వాదులుగా - కొన్నిచోట్ల సరియైన మాటలు పడక -

మెరుపు కొట్టినంత చురుగ్గా తండ్రికేసి తిరిగి "వెనకటి కథలు కూడా దిద్దించి పెట్టరుటండీ?" అని అడిగిందామె.

"అలాగే" అన్నాడతను.

"నిజంగా? ఏమండీ నాన్నారూ? నిజంగానే?"

"సందేహ మెందుకమ్మా?"

"అయితే యెప్పుడు చెప్పండీ?" అంటూ చేతులు పట్టుకుందామె.

"నువ్వెప్పుడు కావాలంటే అప్పుడు"

"నిజంగా?"

"అదేమిటమ్మా వెర్రితల్లీ?"

"అయితేనూ-మరీ-యివాళే చెప్పెయ్యండి రామచంద్రంగారితోటి"

"చెప్పేస్తాను."

దానిమీద యేదో చెప్పబోయిన్నీ ఆమె బెదిరిపోయి వూరుకుంది. అది గమనించి "యింకేమిటి?" అని అడిగాడతను.

"ఏమండీ నాన్నారూ!"

"ఏం తల్లీ?"

ఆమె గుటకలు మింగింది; కాని చెప్పలేక పోయింది.

"చెప్పవమ్మా" అని బుజ్జగించాడతను.

"నేను రాసిన కథలన్నీ —"

"అన్నీని. కొన్ని విడిచిపెట్టడం యెందుకూ?"

"సాపు రాయించి-"

"సాపు రాయించి?"

సాహసించలేక మొగం పక్కకి తిప్పుకుందామె.

"రాయించి?.... ఏమిటి తరవాత?"

అదేస్థితిలో వుండిపోయింది.

"అదేమిటమ్మా?"

"మీరుకోప్పడతా రేమో బాబూ"

"ఎప్పుడయినా-"

ఇలా అంటూ అతను గడ్డం పట్టుకోగా, మాట సగంలోనే అందుకుని ఆమె "చెప్పెయ్యనా?" అంటూ తల యెగరవేసుకుంటూ అడిగింది.

"ఊ. తొరగా"

"అచ్చుకూడా-"

"హోస్! ఇంతేకదా? తప్పకుండానూ, ఈమాట చెప్పడానికంత సందేహం యెందుకుతల్లీ?"

"భయం వేసిందండీ"

"ఎందుకమ్మా? దానికేమంత డబ్బవుతుందమ్మా? అయితే మాత్రం అగత్యమైన పని మానుకుంటాముటమ్మా?"

"................................"

"కాకపోయినా నీమాట కద్దేమిటితల్లీ? నీకోరిక తీర్చడంకంటే నా కింకేమి ఆనందం వుందమ్మా?"

ఆమె మొగం విప్పారింది.

"నువ్వు కథలురాస్తూ వుంటే, లోకం అవి మెచ్చుకుంటూ వుంటే అది నాకు సంతోషకారణం కాదూతల్లీ? అవి అచ్చువేయించడం నాహూచీ కాదుటమ్మా?"

ఈ మాట విని సుభద్ర పొంగిపోయింది- సిగ్గూపడింది.

"ఇంకా యేదో వుంది. ఏమిటీ యివాళ ఇలా ఆరంభించావూ? సందేహించకు తల్లి"

ఇలా అంటూ అత నామె వీపు నిమిరాడు.

"అచ్చుకూడా రామచంద్రంగారే—"

"అతనే చేయించాలి. నాకు తీరుబడి లేదుకదా నీకు వీలు లేదుకధా"

మళ్ళీ యేదో చెప్పబోయి ఆమె ఆగిపోయింది.

"ఇంకా యేమిటి?"

ఒక్కమాటు తండ్రికేసి చూసి బిడియపడుతూ సుశీ ఆమె మొగం వంచుకుంది.

"మా అమ్మవు కావూ? నాకు ఆందోళన—"

"అమ్మో! ఇంకేమీ లేదండి. నిజంగానండీ"

"ఇంకా వుంది. తప్పకుండా వుంది. చెప్పమ్మా"

ఇలా అని అతడు ఆమె గడ్డం పట్టుకుని మొగం పైకెత్తి కళ్ళల్లోకి చూస్తూ "చెప్పు" అన్నట్టు తలవూపాడు.

"చెన్నాపట్టంలో—"

"మరీ సంతోషం. రామచంద్రాన్ని వెళ్ళమందాం"

దీంతో ఆమెకి ప్రాణాలు లేచివచ్చినట్టయింది. ఆ వుల్లాసంతో యిలాగా అలాగా చూడగా, తోటలో, కుళాయి దగ్గిర పంచెకి సబ్బుపట్టించుకుంటూ రామచంద్రం కనిపించాడు.

అది చూశాటప్పటి కామె మనస్సు చివుక్కుమంది. కళ్ళల్లో యేదో గుచ్చుకున్నట్టూ అయింది.

15

నిజానికి, ఈ దృశ్యం ఆమెకి కొత్తది కాదు.

ఇది యిప్పటికి నాలుగైదు మాట్లయినా కనపడివుంది. కనపడ్డప్పుడల్లా యెంతో జాలీ కలిగింది.

అయితే "బట్టలు తక్కువగా వున్నాయి కామో సుపా – పం" అని మాత్రం అనుకుంటూ వచ్చింది. అది అప్పటితోటే మరిచిపోతూనూ వచ్చింది.

కాని యీ సన్నివేశం అలా కాలేదు. ఇది చెయ్యిపెట్టి మనస్సంతా దేవేసింది. హృదయం మీద సమ్మెటపెట్లు పెట్టింది. కళ్ళల్లో టార్చిలైట్లు వేసింది.

వెంటనే "అలా – చూడండి నా – న్నారూ" అంటూ మాట సరిగా వుచ్చరించలేక అంగుళి నిర్దేశం మాత్రం చేసిందామె.

"అతను - రామచంద్రమేనా?" అని అడిగాడు పంతులయ్య.

ఆమె మాట్లాడలేకపోయింది.

"ఏం తల్లీ? రామచంద్రమేనా అతనూ?"

"అవునండీ."

"బట్టకి సబ్బు పెట్టుకుంటున్నాడు. అవునా?"

"మరేనండీ."

"ఏం, దాకలి ఆలస్యం చేశాడా యీ మాటూ?"

"రెండు రోజుల కోమాటు సబ్బు పట్టిస్తారండీ ఆయనా. రెండు పంచెలే వున్నట్టున్నాయండీ పాపం."

"మన ఇంటికి నీరుకావి ధోవతులతో వచ్చాడు. వచ్చాక సబ్బు పెట్టు కుంటున్నాడు కాబోలు."

"అలాగే వుందండీ."

"అంటే మన ఇంటికి వచ్చాక కూడా అతని స్థితి లేశమూ మారలే దన్నమాట."

ఇలా అని ఒతను మేజాదగ్గిరికి వెళ్ళి మెరుపు కాలింగు బెల్లు నొక్కి యేదో చీటీ రాసుకువచ్చాడు.

ఇద్దరూ అతనికేసి చూస్తూ నుంచున్నారు.

తువ్వాలు కట్టుకుని వున్నాడు రామచంద్రం. పంచెకి సబ్బు పట్టించడం అయిపోయింది. సబ్బు ముక్క కొళాయిమీద పెట్టి పంచె వుప్పళిస్తున్నాడు. చేతుల మీదా, గుండెల మీదా, మొగం మీదా సబ్బు నురగ పడుతోంది.

మొగం మీద పడ్డది మాత్రం ఎప్పటి కప్పుడే తుడిచేసుకుంటున్నాడు.

"చిత్తం బాబయ్యా" అన్నాడు పోతునాయడు వచ్చి. "పెద్ద గుమాస్తా గారికి. పరిగెత్తుకు రావాలి" అంటూ పంతులయ్య చీటీ వాడి చేతిలో పెట్టాడు.

తండ్రీ కూతురూ మళ్ళీ అతనికేసి చూడసాగారు.

"వొట్టి మొగమాటం మనిషి యెవరూ అంటే రామచంద్రం వొక్కడే కనపడుతున్నాడు. ఎలాంటి సందర్భాలు వచ్చినా నోరువిప్పి అడగడు సరి కదా, యెంత అడిగినా చెప్పడు. ఏ మడిగినా వెంట వెంటనే జవాబు చెబు తాడు; కాని డబ్బుమాట తెస్తే మాత్రం పెదవి కదపడు. ఇతనితో యిది చాలా చిక్కుగా వుంది. వచ్చి నాలుగు మాసాలు దాటినా, జీతం యెంత కావాలో తేల్చమంటే, నిన్న రాత్రి గిజా అన్నాడు. కాని తేల్చాడుకాడు చూశావా?"

"ముందు బట్టలు కొనిపెట్టండి పాపం."

"ఇదిగో బాబయ్యా" అంటూ వచ్చి పోతునాయుడు చీటీ అందించాడు.

జోడు లేకపోవడం వల్ల కళ్ళు చికిలించుకుంటూ చూసి "నెల కొక్క రూపాయి చొప్పున యిప్పటికి నాలుగు — "

"అయ్యో!" అంటూ వులిక్కిపడింది. సుభద్ర "నెల కొక్క రూపాయి టండీ?"

"అవును. రోజుకి రెండు డబ్బులు"

"మనతో వచ్చినప్పుడు తప్ప సినీమా కయినా వెళ్ళడం లేదు కాబోలు పాపం."

ఈ మాట అన్నప్పుడు సుభద్రకి బిక్క మొగం పడింది.

"అరకప్పు కాఫీ కూడా లేదన్నమాట."

"రామ రామా! ఎంత యిబ్బంది పడిపోతున్నారోనండీ పాపం."

"కోర్టులో వొక్కొక్క రోజున, సమయానికెవరో వొక స్నేహితుడు చక్కావచ్చి, నాకు పోగా మిగిలిన కాఫీ కొట్టెస్తూ వస్తున్నాడు. ఇంటి దగ్గిర్నుంచి మైలున్నర దూరం మోసుకు రావడమే కాని అతను వొక్క చుక్క అయినా — అతని కడుపు మాడుస్తూ నేను చాకిరీ చేయించుకుంటున్నా నన్నమాట."

పంతులయ్య కళ్ళు గిర్రున నిండిపోయాయి.

"పా — పం" అంది సుభద్ర.

ఆమె రెండు కళ్ళలో నుంచీ రెండు బాష్పబిందువులు పుట్టి అధరం మీదుగా జారి వెంటనే చినుకు చినుకు లయిపోయాయి.

ఇద్దరి కంఠాలూ కషాయితా లయిపోయాయి.

మళ్ళీ యిద్దరూ అతనికేసి చూశారు. ఒక్కమాటు పంచెమీదికి కొళాయి వదిలి మళ్ళీ వుప్పుశిస్తున్నాడు రామచంద్రం. ఒక్కక్షణం అయినాక, అంచు దగ్గిర రోడ్డుబురద మరకలున్నాయి కాబోలు, ఆ భాగం వొక అరచేతిలో వుంచుకుని రెండో అరచేత్తో గట్టిగా పామసాగాడు.

"ముందు బట్టలు కొనిపెట్టండి నాన్నారూ" అని మళ్ళీ అంది సుభద్ర.

మెరుపుకొట్టినట్టయి, ఆమెకేసి తిరిగి, అయితే బజారుకి వెళ్ళి నీకు నచ్చినవి పట్టుకురా" అన్నాడతను చురుగ్గా చూస్తూ.

ఆమె గతుక్కుమంది.

"వేళాకోళం కాదు. నీకథలు అతను దిద్దిపెడుతున్నాడు. అతనికి నువ్వు బహుమతీ చెయ్యాలి."

ఆమె మరీ సిగ్గుపడిపోయింది.

"ఇప్పటిమట్టుకి అతనికి మనం చేసే బహుమతీ బట్టలే. నీయిష్టం వచ్చినవి పట్టుకురా. పిన్ని కూడా వస్తుంది బజారుకి వెళ్ళు"

"..............................."

"మరి నుంచోకు. తొరగా తెమల్చు. అతను ఆ పంచె వుతికి ఆరవేసుకునేటప్పటికి నువ్వు కొత్తబట్ట లివ్వాలి. వెళ్ళు"

"వెడతాలెండి" అంది సుభద్ర. ఆమెకి ఈ చెప్పడం చాలలేదు.

"ఇంకా యెప్పుడో వెడతావా? అతను, ఆ బట్టలతో మోటారులో నాపక్కని కూచోడానికి జంకుతున్నాడు. సేలం చాపులు తేవాలి సుమా"

"పిన్నితో మీరే చెప్పండి"

"నేనే చెబుతాను, ముందు నువ్వు సొమ్ము తీసుకురా"

"మొత్తం తేల్చందే యెలాగ?" అన్నట్టు చూసిందామె.

"షర్టులూ కోట్లూ కూడా—"

"అవునండీ పాపం"

"ఎంత సొమ్ము పట్టుకువెళ్ళాలో యిప్పుడు తెలిసిందా?"

అంకె పెద్దదిగానే కనపడింది; కాని స్పష్టంగా లేదు. తెరలో లాగ మసక మసకగా వుండిపోయింది. దాంతో, పక్కవాటుగా చూస్తూ ఆమె ఆలోచన ప్రారంభించింది.

చేసినపని రాజాగా వుండాలి. కక్కుర్తి పనికిరాదు"....

మునపటికంటే కొంచెం బాగా కనపడుతోంది అంకె, కాని ఆమెకి ధైర్యమూ సాహసమూ యింకా కలగలేదు.

"అతను, అయిదారు మాటలు చేర్చడంవల్ల నీకథ కెంత గాంభీర్యం వచ్చిందో జ్ఞాపకం చేసుకో. దాన్నిబట్టి యీ మొత్తం తేల్చు"

మాం-చి కొలబద్ద.

దీంతో ఆమె చూపులికి నైశిత్యం కలిగింది. తెరకూడా తొలిగిపోయింది. వెంటనే కొట్టవచ్చినట్టు కనపడింది అంకె; కాని ఆమెపైకి వుచ్చరించలేక పోయింది.

అది కనిపెట్టి అతను "పోనీ నాతో చెప్పనక్కర్లేదు. నీకెంత తోచిందో అంతా నిస్సంకోచంగా పట్టుకువెళ్ళు" అని తాళా లామె చేతిలో వుంచాడు.

అప్పటికీ ఆమె బిడియం పోలేదు. పైగా ఉన్న మౌగ్ధ్యం అంతా ఘనీభవించి మొగంమీద అలుముకుపోయింది.

"నీకు తోచకపోలేదు, నాతో చెప్పడానికి మాత్రం బిడియపడుతున్నావు. పోనీ నువ్వనుకున్నదెంతో నేను చెప్పేసుకోనా?"

ఆమె వుత్సాహం కనబరచింది. వెంటనే అతను "రెండు వంద" లన్నాడు. అది విని ఆమె మొగం వంచేసుకుని చుట్టుకుపోయినట్టయిపోయింది.

"వెర్రితల్లీ! ఎంత ఖర్చుపెడితే నీ కద్దేమిటమ్మా? అసలు నీచేత్తో రెండు వందలు ఖర్చుపెడితే అదొక లెక్కటమ్మా? సందేహపడకు, వెళ్ళు సొమ్ము పట్టుకురా."

ఇలా అని అతను, ఆమె వీపుమీద మెల్లిగా తట్టుతూ యినప్పెట్టివున్న గదికేసి వంపి—సారథిని పిలవరానాయడూ" అంటూ కిందికి బయలుదేరాడు.

16

"ఇవాళ మెయిల్లో నువ్వు చెన్నపట్టణం వెళ్ళాలోయ్"

అప్పుడే ముగించిన వుత్తరం కవర్లో పెడుతూ, జానకమ్మతోటీ, సుభద్రమ్మతోటీ యేదో మాట్లాడుతూ వున్న పంతులయ్య, తానక్కడికి వెళ్ళి వెళ్ళడంతోటే తిరుగుడు కుర్చీతో తన కభిముఖంగా తిరుగుతూ యిలా అనే టప్పటికి "చి-త్-తం" అంటూ వులిక్కిపడ్డాడు, రామచంద్రం.

అది గమనించి" యేం, బెదిరినట్టున్నావేం?" అన్నాడు పంతులయ్య.

"లేదండి లేదండి. అక్కడి పనేమిటో తెలవకా, తమకి వుండుకున్న రాచకార్యాలు నేను నిర్వహించగలనా? అన్న సందేహంవల్లా దృఢంగా మాట్టాడ లేకపోయాను; గాని యిష్టం లేకా, వుత్సాహంలేకా కాదండి."

"పనంటే కోర్టు పనేమీకాదు. అమ్మాయి రాసిన చిన్నకథలు నాలుగు చేర్చి వొక సంపుటంగా అచ్చువేయించి తీసుకు రావడం"

ఈ మాట విని సుభద్ర మురిసిపోయిన్నీ సోఫాలో ముణుచుకు పోయింది.

"అయితే మరీ సంతోషంగా వెడతానండి. తమకి అందరికి పూర్తిగా తృప్తి కలిగేటట్టు నెరవేర్చుకు వస్తానండి."

"సత్యవాణిగారిచేత కథకి మూడేసి నాలుగేసీ బొమ్మలు రాయించి వొక వారం రోజుల్లో పంపిస్తాను. మొదటి కథ మొన్నటి భారతిలో పడింది సిద్ధం గానే వున్నది కదూ?"

"చిత్తం ఉందండి."

"నేను నాగేశ్వరరావు పంతులుగారి పేర రేపే వుత్తరం రాస్తాను. వారు ఆ బొమ్మల మాతృకలు దయచేయిస్తారు. అవీ, కొత్తవీ పుస్తకానికి సరిపోయే పరిమాణంలో అక్కడే బ్లాకులు చేయించు."

"చిత్తం"

"అచ్చుపని కూడా వారే చేయిస్తారు."

"సరేనండి."

"ఈలోపున సాపు రా సెయ్యడం-"

"రెండు మూడురోజుల్లోనే రాసేసి తమకి పంపుతానండి"

"ఏమంటావమ్మా? దిద్దాక నువ్వుచూడాలా?" అని అడిగాడు పంతులు సుభద్రని.

"అక్కర్లేదు నాన్నారూ! ఆలస్యంకావడం తప్ప మరేమీ లాభం లేదండి. వారెలా దిద్దినా బాగానే వుంటాయండి" అని ఆమె బదులు చెప్పింది.

"ఏం సరా?" అన్నట్టు పంతులయ్య తనకేసి చూడగా

"నా శక్తికొద్దీ బాగా సవరించి అచ్చు వేయిస్తానండి" అన్నాడు రామచంద్రం.

"ఇవాళ మార్చి యిరవై అయిదు, ఏప్రిలు పందొమ్మిదో తేదీ యిప్పటి కెన్నాళ్ళుందీ?"

"అదీ యిదీ కాక మధ్యని-యిరవై నాలుగురోజు లున్నాయండి"

"ఆవేళ అమ్మాయి పుట్టినరోజు. ఆమె కథల మొదటి సంపుటం కూడా ఆవేళ యిక్కడ అవతరించాలి"

సుభద్ర పొంగిపోతూ జానకమ్మ కేసి చూసింది.

"ఆవేళ నీకు కూతురు పుడుతుందన్నమాట" అంటూ ఆమెని యెడమ చేత్తో పొదివి దగ్గిరికి తీసుకుని, కుడిచేత్తో మొగంపై కెత్తుతూ నుదురు ముద్దు పెట్టుకుంది జానకమ్మ.

దీంతో మరీ సిగ్గుపడిపోయి, వొక్కమాటు రామచంద్రం కేసి వోర చూపులు చూసి, తన మొగం తీసుకువెళ్ళి జానకమ్మ కంఠంలో దాచేసుకుంది సుభద్ర.

"శబ్దేందు శేఖరః పుత్రోమంజూషా మమ పుత్రికా" అన్నమాట జ్ఞాపకం వచ్చి మనస్సు వొక్క పొంగు పొంగాక, పంతులయ్య గంభీరంగా చూస్తూ "గడువుదాటకూడదు. పని తరవాయి వుండకూడదు. పుస్తకం చక్కగా వుండాలి. వెయ్యిప్రతులూ యేకకాలంలో పట్టించుకు రావాలి" అన్నాడు.

"అలాగేనండి"

"ప్రభల సుబ్రహ్మణ్య సోమయాజులు గారని అక్కడ పేరు పడ్డ వకీలు. వారు స్వయంగా స్టేషనుకివచ్చి నిన్ను మైలాపూరు తీసుకువెళతారు. ఇప్పుడే వారికి తంతి వెడుతుంది. రేపీవుత్తరం చూపిస్తే వారు నీకు సమస్త సదుపాయాలూ యేర్పాటు చేస్తారు"

"చిత్తం" అంటూ రామచంద్రం ఆ కవరు పుచ్చుకున్నాడు.

"ఇందులో అయిదు నోట్లున్నాయి"

రామచంద్రం ఆకవరు కూడా పుచ్చుకున్నాడు.

"సొమ్ము చాలకపోతే యెంత కావలసినా వారిని అడుగు. లేకపోతే యిక్కడికి తంతికొట్టు"

"అలాగేనండి"

"అది నీ సొంతసొమ్మే అనుకో. అందులో నీకు కావలసినంతా స్వేచ్ఛగా ఖర్చుపెట్టుకో, చూడవలసినవన్నీ చూడు. కావలసినవన్నీ కొనుక్కో. ఏమీ మొగమాటపడకు"

ఇది విని సుభద్రా జానకీ ఆ ఔదార్యానికి ముగ్ధులయిపోయారు.

"నా కవసరాలే తక్కువ. ఉన్నవిమాత్రం—" అని రామచంద్రం యేదో చెప్పబోగా, పంతులయ్య సగంలోనే అందుకుని "అదే వద్దంటున్నాను. వెళ్ళేది చెన్నపట్నం; అక్కడ చూడవలసినవీ, నోరూరించేవీ యెన్నో వుంటాయి. నువ్వు చిన్నవాడవు. కనక యింతగా చెబుతున్నాను" అని లాలనగా చెప్పాడు.

"ఆవేళ మెయిల్లో నువ్వు తప్పకుండా రావాలి సుమా."

"తప్పకుండా వస్తానండి"

ఆవేళ పుస్తకం చూడకపోతే మా అమ్మ గిలగిల్లాడి పోతుంది. ఆ పుస్తకాన్ని పురస్కరించుకుని నే నా వేళకి పెద్ద కార్యక్రమం యేర్పరుచుకుంటున్నాను. నువ్వు సరిగా పని చెయ్యకపోతే అంతా చెడిపోయి నా మనస్సు—"

"అక్కర్లే దక్కర్లేదండి. తమరు సరిగా లెక్కచూసే గడువు నిర్ణయించారు. ఆవేళ మెయిల్లో తప్పకుండా వస్తానండి పుస్తకాలతోటి."

సుభద్ర కళ్ళు ఆనందముద్రితా లయినాయి.

మెరుపు కాలింగుబెల్లు రెండు మాట్లు నొక్కి పంతులయ్య "క్రౌన్ సైజుట. ఫెదర్ వెయిటు కాగితాలుట. కాలికో బైండుట, బాగా జ్ఞాపకం పెట్టుకో" అనగా "నే నలాగే అనుకున్నానండి" అన్నాడు రామచంద్రం.

ఇంతలో "యేమి సెలవు?" అంటూ రెండో గుమస్తా వచ్చి దూరంగా నుంచున్నాడు.

"బజారుకి వెళ్ళాలి."

"చిత్తం."

"మెయిల్లో రామచంద్రం మద్రాసు వెడుతున్నాడు. అడుగున్నర తోలు సూటి కేసొకటీ, హోల్డాల్ వొకటీ— పక్క సామగ్రితో అన్నమాట— పార్కర్ కలం వొకటీ నిమిషాలమీద కొని పట్టుకురావాలి. బజార్లలో

వున్నంతలో మంచి రకం కావాలి. ఈ తంతి సూరయ్య కిచ్చి వెంటనే పోస్టాఫీసుకి వెళ్ళమను."

ఇలా చెబుతూ పంతులయ్య, నూరు రూపాయల నోటొకటీ, తంతి కాగితం వొకటీ యిచ్చి అతన్ని వెళ్ళిపొమ్మన్నాడు.

"మంచివి తెస్తాడో లేడో?" అన్నట్టు అనుమానదృష్టితో సుభద్రా, "లేక పోతే యెంగడూ?" అన్నట్టు జంకెన చూపులతో జానకమ్మా వొకర్ని వొకరు చూసుకున్నారు.

17

గుమస్తా వెళ్ళిపోయాడు. మెట్లమీది అతని కాళ్ళ చప్పుడు అంతకిముందే వెళ్ళిపోయింది.

"అమ్మా" అని పిలిచాడు పంతులయ్య.

"తయారుగా వున్నా" నన్నట్టు ఆమె నిటాగ్గా కూచుంది; కాని యెవరో అదిమేస్తున్నట్టు వెంటనే ముణుచుకుపోయింది.

ఆమె హృదయం దుడుకూ దుడుకూ కొట్టుకుంది.

"నీ చేత్తోటే యివ్వాలి. తొరగా కానియ్యి తల్లీ" అని మళ్ళీ అన్నాడతను.

సుభద్ర చూపులూ, జానకమ్మ చూపులూ హఠాత్తుగా తారసిల్లాయి.

తండ్రికేసి చూడలేక పింతల్లి కేసి చూసింది పాపం సుభద్ర; కాని అక్కడ కూడా తండ్రి చూపుల్లో వున్న గాంభీర్యమే వుండడం గుర్తించి, ఆ చిరునవ్వులో "ఎన్నిమాట్లు చెప్పించుకుంటావ్" అని ముదలకిస్తున్న భావన కూడా వున్నట్టు గమనించి, మరీ సిగ్గుపడిపోయి మొగం వంచేసుకుంది.

పంతులయ్య జానకమ్మ కేసి చూశాడు.

వెంటనే జానకమ్మ వాత్సల్యంతో రెక్కపట్టుకుని లేవదీసి "నువ్వే తలపెట్టిందే కాదూ యిదీ?" అని మెల్లిగా చెవిలో వూది నింపాదిగా మేజా దగ్గిరికి తీసుకువచ్చి, మేజామీద వున్న తాంబూలం బట్టల దొంతరమీద పెట్టి "ఊఁ, కానియ్యి తల్లీ" అంది.

అప్పటికి సుభద్రకి సాహసం కలిగింది. దొంతర అంతా యెత్తబోయి సాధ్యపడక సగమే పుచ్చుకుని వొక్కమాటు రామచంద్రం కేసి చూసి మళ్ళీ తలవంచుకుంది.

రామచంద్రం చూపులు అప్పటికీ పంతులయ్యమీదే వున్నాయి. అవి మేజాకేసి తిరగనే లేదు

పంతులయ్య అది కనిపెట్టి గంభీరంగా చూస్తూ "అవి పుచ్చుకోవోయీ" అన్నాడు.

పంచెలు, కండువాలు, షర్టుగుడ్డలు, కోటుగుడ్డలు; ఒక్కొక్కటే కాదు, చాలా చాలా.

"ఇవన్నీ నీకోసమే" అని తాంబూలం రాగగర్భితంగా సూచిస్తూనే వుంది; కాని రామచంద్రం అదేమిటో గ్రహించుకోలేకపోయాడు.

ఒక్క అడుగు ముందుకివేసి "అవేం చెయ్యమంటారండి?" అని అమాయికంగా అడిగాడతను.

జానకమ్మ "వెర్రినాయన" అన్నట్టు జాలిగా చూసింది. సుభద్ర "చెప్పుకోలేకపోయారు" అనుకుంటూ లోపల్లోపల నవ్వుకుంది.

"నువ్వు వాడుకో. అవి నీకు బహుమతీ చేస్తోంది మా అమ్మ. నువ్విందాకా పంచెకి సబ్బు పట్టించుకోడం చూసిందది. నీకు బట్టలు తక్కువగా వున్నట్టు గ్రహించి అదీ తల్లీ బజారుకి వెళ్ళి అవి తీసుకువచ్చారు. పుచ్చుకో. చొక్కాలు చెన్నపట్నంలో కుట్టించుకో" అని వివరంగా చెప్పాడు పంతులయ్య.

రామచంద్రం వాటికేసి ఒక్కమాటు చూసి తరవాత పంతులయ్య కేసి మిడుతూ మిడుతూ చూశాడు.

"ఏం, అలా చూస్తావేం?"

"నాకు రెండు పంచెలే వున్నాయండి. మరో రెండు పంచెలయినా వుంటే బాగుండుననే అనిపిస్తోంది; కాని అలాంటి బట్టలూ—"

"నువ్వు చెప్పేదేమిటోయ్?"

"నాకు తాహతు—"

"మాట్టాడితే తాహతు, తాహతు. నీకు తాహతుకేం తక్కువోయ్?"

"నీకు తాహతే లేకపోతే వారి ప్రాపకం యెలా దొరుకుతుంది నాయనా" అంది జానకమ్మ.

"మరే" అన్నట్టొకమాటు కీగంట చూసి మళ్ళీ సిగ్గుపడింది సుభద్ర.

జానకమ్మ అన్నమాటతో రామచంద్రం హృదయం ఆర్ద్రమయిపోయింది.

"ఏమిటో నాకాదృష్టి లేకపోయింది; కాని వచ్చినప్పణ్ణుంచే నువ్విలాంటి బట్టలు కట్టవలసినవాడవు. పుచ్చుకో పుచ్చుకో. మోటార్లో నాపక్కని కూచోడానికి నువ్విక యిలాంటిబట్టలే కట్టాలి" అని దృఢంగా చెప్పాడు పంతులయ్య.

దానిమీద మళ్ళీ జానకమ్మ అందుకుని "లేనిపోని కుళ్ళంకలు పెంచుకునీ గజిబిజి పడకు. తలుచుకున్నారంటే కొసిరి కొసిరి యివ్వడం వారికి చేత కాదు. ఆపైని, మా అమ్మకి కలిగిన సంకల్పం యిది. ఎన్ని అంగళ్ళు చూసినా యింతకంటే మంచిరకం దొరకలేదు. లేకపోతే నీకు మా సుభద్ర యివ్వడం యిలాంటి వేనాః ఇప్పటికివి పుచ్చుకుని లక్షణంగా కట్టుకో. నాయనా" అని బుజ్జగిస్తూ చెప్పింది.

"నా కథలు దిద్దినట్టే మీరు మీ వేషం కూడా దిద్దుకోవద్దూః" అందా మనుకుంది సుభద్ర. మాట నాలుక చివరికి తెచ్చుకుంది; కాని దానితోటే సిగ్గుకూడా తోసుకురాగా నోరు మెదపలేకపోయింది. ఎత్తిన మొగం కూడా దించేసుకుంది.

ఇంత చెప్పినా రామచంద్రం సాహసించ లేకపోయాడు.

"మనవి చేసుకుంటున్నాను—"

"నేను చిత్తగించుకుంటున్నాను; కాని ఆలస్యం కావడం తప్ప మరేమీ ప్రయోజనం లేదు"

"నా స్థితిగతులు తమరు కొంచెం యోచించకోరుతున్నాను. వెనకా ముందూ వుండే సందర్భాలు—"

"అవన్నీ బాగా యోచించే నే నీ యేర్పాటు చేశాను. నీతల విలవ నీకు తెలవదు. ఇక మాట్లాడవద్దు పుచ్చుకో"

పంతులయ్య యిలా అనేటప్పటికి రామచంద్రానికి వాగ్బంధనం అయి పోయింది. కళ్ళల్లో ఆనందబాష్పాలు గిర్రున తిరిగి పోయాయి. హృదయం అంతా కృతజ్ఞతాభావం నిండిపోయింది. అప్రయత్నంగా వెళ్ళి వెంటనే అతను పంతులయ్య పాదాలు పట్టుకున్నాడు.

అందరి కళ్ళూ ఆర్ద్రాలయినాయి.

అందరి హృదయాలూ ముగ్ధా లయిపోయాయి.

అందరి కంఠాలూ రుద్ధా లయిపోయాయి.

కాని, మేఘ గంభీరనిస్వనంతో గంటలు కొద్దీ విలాసంగా మహోప న్యాసాలు చెయ్యగల గొప్ప వక్త కనక—అయినా అతి ప్రయత్నం మీద, పంతులయ్య మాత్రమే, మాట్లాడ గలిగాడు.

అప్పుడేనా "పుచ్చుకో" అని మాత్రమే పలికి ఆతను రామచంద్రం వీపు నిమిరాడు.

ఈ స్పర్శ రామచంద్రం రక్తనాళాల్లో మెరుపులు మొలిపించింది.

అయినా కృతజ్ఞత అతి భారంగా వుండడంవల్ల అతను చాలా మెల్లిగా ముందుకి అడుగు వేశాడు.

జానకమ్మ, సుభద్రని కూడా వొక్క అడుగు ముందుకి వేయించింది.

అయితే, ఆ లేతహృదయాలు రెండూ కూడా ఆ సాన్నిధ్యం భరించ లేకపోయాయి.

వెంటనే వొణుకుతూ వొణుకుతూనే ఆబట్టలు రెండు దొంతర్లుగా సుభద్ర అందించగా, జంకుతూ జంకుతూనే రామచంద్రం వాటిని అందు కున్నాడు.

అదిచూసి జానకమ్మా, పంతులెయ్యా యేదోమహోత్సవం చూస్తూవున్న ఆనందం అనుభవించారు.

ఇచ్చేటప్పుడు సుభద్రకీ, పుచ్చుకునేటప్పుడు రామచంద్రానికీ వొకరి చెయ్యి వొకరికి తగిలింది.

దాంతో రామచంద్రం శరీరం వొణికి పోయింది. సుభద్ర వొళ్ళు ఝల్లుమంది.

18

"మిఠాయిపాటి కాయలుట. అప్పలమ్మ బత్తాయి కాయిలు తెచ్చింది నాన్నారూ"

"ఏమంటుంది?"

"ఇవ్వకుండా వెళ్ళదుట"

"దానబ్బసొమ్ము దాచబెట్టిందా యేమి టిక్కడ? అయితే యే మాత్రం తెచ్చిందిట?"

"గంపెడు"

"ఇవాళకి పాతికకాయలు పుచ్చుకో. మళ్ళీ రేపురమ్మను"

సుభద్ర కదల్లేదు.

ఈ జవాబు ఆమెకి నచ్చలేదు. ఆమె వుద్దేశించుకు వచ్చిన సంగతే బయటికి రాలేదు. పోనీ, మాటల ధోరణిలో యిక ముందు రాకూడదూ అంటే, యిలా జవాబు చెప్పి అతను మళ్ళీ పత్రిక చదువులో పడిపోయాడు.

ఒక్కక్షణం ఆమె ఆలోచించింది. భావచక్రం వొక్కమాటు గిర్రున తిరిగి పోయింది. తమాయించగా వొక్క చక్కని మార్గం కనపడింది.

దానిమీద "ఈపాటికి కథలు సాపు రాసెయ్యడం అయిపోయి వుండదు టండీ నాన్నారూ?" అంటూ అందుకుందామె.

"అయిపోయే వుండవచ్చు" అని పత్రిక చదువుకుంటూనే అతను జవాబు చెప్పాడు.

"ఇవాళో రేపో అచ్చు మొదలు పెడతారన్నమాట. కాదుటండీ నాన్నారూ?"

దృష్టి అంతా పత్రికమీదే వుంది; కాని అతనికి మళ్ళించుకోక తప్పింది కాదు.

"అలా యెందుకూ? రాసిందల్లా అచ్చు వేయించేస్తూ వుండవచ్చు కాదుటమ్మా?"

"అవును నాన్నారూ! అలా చేయించమని రామచంద్రం గారికి రాయండి"

"అతనికి తెలవదుటమ్మా అదీ?"

ఈ మాట అన్నప్పుడతని శ్రద్ధ అంతా పత్రికమీద నుంచి మళ్ళి వుండడం ఆమె గ్రహించింది. వెంటనే "ఏమండీ? మనం రాస్తే యేమండీ? మొన్న భారతిలో పడ్డ కథ సిద్ధంగానే వుంది కాదుటండీ?" అని అడిగింది.

"అది మొదటే వెయ్యవలసింది కదా, యీ మాత్రం ఆలోచనే అతనికి తట్టదూ తల్లీ?"

ఇలా అడిగి, మరొక్కక్షణం ఆమెకేసి నిదానంగా చూసి, తరవాత "అయినా మనమేమీ రాయవద్దు. గడువునాటికి పుస్తకాలు పట్టించుకురాగలడో రాలేడో చూద్దాం" అంటూ మళ్ళీ పత్రిక చదువుకోసాగాడతను.

ఈమాట ఆమె లేతహృదయంమీద ములుకులాగ కసిక్కున గుచ్చుకుంది. "తేగలరో తేలేరో పాపం" అంటూ ఆ వ్యధితహృదయం తపా తపా కొట్టుకుంది.

పంతులయ్య అప్పటికీ దారికి రాకపోవడమే కాదు, రావడానికి అవకాశాలున్నట్టు కూడా కనపడలేదు.

అయితే వచ్చిన పని కాకుండా ఆమె అక్కణ్ణుంచి కదలతలుచుకోలేదు.

"అమ్మాయిగోరూ, అమ్మాయిగోరూ" అని కేకమీద కేకవేస్తూ కింద అప్పలమ్మగోల చేస్తూ వుండడమూ, "అంత తొందరతే యెలాగే మరీ?" అని జానకమ్మ కూకలేస్తూ వుండడమూ, వుండుండి కొంచెం కొంచెం వినపడుతూనే వుంది.

అయినా అది లెక్క చెయ్యలేదామె.

నిశ్చలంగా అలాగే నుంచుంది. రెప్ప వెయ్యకుండా తండ్రికేసి వొక్క చూపు చూసింది. తనపట్టుదలకి వుబికివుబికి వచ్చే నవ్వు బాగా అదుముకుంది.

చివరికి "చెన్నాపట్టంలో యింతమంచి బత్తాయిపళ్ళు దొరకవు కాదుటండీ నాన్నారూ?" అని కొంటెచూపులు చూస్తూ అడిగిందామె.

అయినా దృష్టి అంతా చదువుమీదే పెట్టుకుని, చూపులు కూడా పత్రిక మీదే వుంచుకుని "అక్కడ యింత మంచివి దొరకవు. అక్కడ దొరికేవి మనకి నచ్చవు; కాని అక్కడి వారి కవే అమృతగుటికలు" అది దానికతను యాదాలాభంగా జవాబు చెప్పి వూరుకున్నాడు.

"ఇంకా పత్రిక విడిచిపెట్టరూ?" అన్నట్టొక్కమాటు శిరస్సు పంకించి ఆమె "అలాగే కనపడుతోంది. ఇక్కడి వాళ్ళక్కడికి వెడితే అవి కనపడ్డప్పు డల్లా యిక్కడి పళ్ళు తలచుకుని గుటకలు మింగుతూ కూచోవలసిందే కామోసు" అంది.

ఊరుకొన్నట్టే వూరుకుని "మహా బాగా చెప్పావమ్మా" అని మందర స్థాయిలో జవాబు చెప్పి మళ్ళీ పత్రికాపఠనంలో పడిపోయాడతను.

కార్యాంతరవ్యగ్రతే తండ్రిని ఆ స్థితిలో వుంచిందని తెలిసి వుండినా సుభద్రకి విసుపు వచ్చింది. అయినా వొక్కనిమిషం చూసి చూసి యిక ఆలస్యం కానివ్వకూడదని ధోరణి మార్చేసింది.

"ఏమండీ, నాన్నారూ? పోనీ యిక్కణ్ణుంచి వెళ్ళిన వాళ్ళకోసం అక్కడి వర్తకులు ఇక్కణ్ణుంచి తీసుకువెళ్ళి అమ్మకూడదుటండీ?"

"అమ్మవచ్చు. అమ్మితేనే బాగుండును"

పత్రిక చూస్తూనే యిలా అన్నాడతను. అంతటితో వూరుకోబోయాడు; కాని సాగిందికాదు.

"సుభద్ర మాటలో స్వరం కొంచెం భేదించిందిసుమా?" అని చెవులు రహస్యంగా అందించగా "అదేదో చూడ్డం వుందా, నీధోరణే నీదా?" అని హృదయం మందలించింది.

ఉలిక్కిపడ్డాడతను. చేతిలో వున్న పత్రిక వొళ్ళోకి జారిపోయింది.

దీంతో అటుండిన శ్రద్ధ యిటు తిరగ్గా "పోనీ, రామచంద్రాని కేమయినా పంపుదామా తల్లీ?" అని అప్రయత్నంగా అనేశాడతను.

"అమ్మయ్యా" అనిపించింది సుభద్రకి.

ఆనందం తల మునకలయిపోయింది; కాని ఆ జంజాటంలో పడిపోయి జాప్యం చేస్తే మళ్ళీ అతనెక్కడ తిరిగిపోతాడో అని "పంపించండి నాన్నారూ" అంటూ అవ్యవధానంగా అందుకుందామె.

"పాపం సాపు రాయడమూ, ప్రూఫులు దిద్దడమూ, మైలాపూరూ టపునూ మళ్ళీట్రాముల్లోనో, బస్సుల్లోనో తిరగడమూ—"

"అయితే తెచ్చినవన్నీ యిచ్చేసి పొమ్మను అప్పలమ్మని" అంటూ సరిగో కూచున్నాడతను.

అతని చూపులన్నీ సుభద్ర మొగంమీదే వున్నాయి.

తన అంతరంగం పరిశీలిస్తున్నాడేమో అని ఆమె కొంచెం బెదిరింది. ఏమయినా ధోరణి కొంచెం మార్చాలని నిశ్చయించుకుని "పాపం వారి మూలాన నాకథ లించక్క తయారవుతాయి. పుస్తకం కూడా ముద్దులు మూటకడుతూ వుంటుంది. కదుటండీ నాన్నారూ?" అని బెల్లిస్తూ అడిగిందామె.

"మరే" అంటూ అలాగే చూశాడతను.

"బొమ్మలు కూడా వుంటాయి కనక పుస్తకం విడిచిపెట్ట బుద్ధికాదు. అవునా నాన్నారూ?"

"ఇంకా సందేహమా!

ఇలా అని రిస్టువాచీ చూసి "అప్పుడే పదయింది. ఇంకా బుట్టకొనాలి, కట్టాలి, స్టేషనుకి వెళ్ళాలి—" అంటూ అతను తొందరపడగా "తెచ్చిన పళ్ళన్నీ పుచ్చుకోనా?" అని ఆమె తొందరలేనట్టడిగింది.

"వందేనా వుంటాయా?" అని అడిగాడతను. ఆలోచించి "తక్కువయితే తెమ్మంటాను. ఏం?" అంటూ తల యెగరవేసుకుంటూ యెదురడిగిందామె.

"తెమ్మను"

"మనకి రెండు డజన్లు చాలు. మళ్ళీ రేపు తెస్తుంది కాదూ? అవునా నాన్నారూ?"

"అవును."

"సూరయ్యగారి నిక్కడికి పంపించనా?"

"పంపించు."

సుభద్ర పొంగిపోతూ బయలుదేరింది. ఇలా తిరగడంతోటే నక్కి వుండిన ఆనందం అంతా వొక్కమాటుగా ఆమె మొగం కమ్మేసింది; కాని "అయితేనూ?........అమ్మా" అంటూ పంతులయ్య మళ్ళీ యేమిటో ప్రారంభించాడు.

మళ్ళీ గాంభీర్యం కొనితెచ్చుకుని, విధిలేక ఆగి, మొగం యిలా తిప్పిందామె.

"వందే పంపితే యెలాగమ్మా?" అని అడిగాడతను.

అక్కడికి తానే మహా పొదుపయిన మనిషిలాగ "అంతకంటే యెందుకండీ?" అంటూ కళ్ళు తిప్పుకుంది ఆమె.

"సోమయాజులు గారికి పంపకుండా వారి యింట్లోవున్న రామచంద్రానికి పంపి వూరుకుంటే బాగుంటుందా?" అంటూ ననిగా డతను.

ఇది విని ఆమె వులిక్కిపడింది.

ఇదంతా ముస్సద్దీ పేచీ లాగ కనపడిం దామెకి.

దానిమీద "వారం రోజుల కిందటే కాదుటండీ రెండు వందలు బత్తాయిలూ, రెండు వందలు నారింజలూ పంపాము వారికి?" అని యెదురు వాదం చేసింది.

"అయినా బాగుండ దమ్మా! మూడు వందలు తెమ్మను."

"అ — లా — గే" అనక తప్పింది కాదు. ఈ మాట ఆమె వోపట్టాన అనలేకపోయింది.

"వాటిలో వొక వంద, ప్రత్యేకంగా రామచంద్రంగారికని రాయిస్తే బాగుంటుందో, బాగుండదో? అలా రాయించక పోతే కామేశ్వరమ్మ పిన్నిగారు పది పళ్ళయినా వారి చేతితో పెడతారో పెట్టరో?" అని ఆమెకి బెంగ పట్టుకుంది.

ఇంతలో జాబు రాయడానికి పంతులయ్య కలమూ కాగితమూ పుచ్చుకున్నాడు.

అది చూడగానే ఆమె మనస్సులో వొక మెరుపు మెరిసినట్టయింది.

"ఇదంతా పిన్నితో చెబుతాను పిన్నిచేత వొక చీటీ రాయించి అది బుట్టలో పడేయిస్తాను" అనుకుం దామె.

కాని, మొత్తానికి, యెంత వుబలాటపడుతూ పైకి వచ్చిందో, తండ్రి దారికి రావడం చూసి యెంత సంబరపడిపోయిందో, చివరికి, అంత దిగాలు పడిపోయి యెత్తిడి పోయిన మనిషి లాగ కాళ్ళీడ్చుకుంటూ కిందికి వెళ్ళిపోయింది.

19

"మొన్న మనం కొన్నామూ — కోటు గుడ్డలూ —? వాటిలో నీలాపు రంగుదీ —? "నేవీబ్లూ" అంటారు దాన్ని. మిల మిల మెరసిపోతోంది, కాదుటే పిన్నీ అదీ?"

"మరే"

"చెన్నాపట్టంలో వాళ్ళు కుడితే చొక్కాలు వొంటికి పూసినట్టు సరిపోతాయట. నాన్నారి కోట్లన్నీ అక్కడ కుట్టించుకున్న వే."

"అవునుట."

"ఆ సేలం పంచెలు తెలుపు చేయిస్తే పాము మీసంలాగ మెరసిపోతాయి."

"తే – ల్లని అ పంచెలూ, ఆ నీలాపు కోటూ వేసుకుంటే, పా – చ్చని రామచంద్రం – కళ్లు చెదిరిపోతాయి. కదూ తల్లీ?"

కొంటె చూపులు చూస్తూ యిలా అడిగింది జానకమ్మ. కాని మీగడ గిన్ని వొంచుకుంటూ వున్న సుభద్ర, పక్క చూడ్డానికి వీలులేక "ఊ, ఊ" అంటూ పొంగిపోయింది.

జానకమ్మ, తరువాత కూడా వొక్క క్షణం వోరచూపులే చూసి, కనిపెడితే సిగ్గుపడిపోతుందని జాలిపడి "ఆ కోటు కిందికి బాగుంటుందని ముచ్చటపడితే, నాలుగు కొట్లు తిరిగితేగాని సన్న యెరుపు చారల పాపులైను దొరికిందే కాదు చూశావా?" అని మొగం కంచం మీదికి తిప్పేసుకుని, మళ్ళీ యేమీ యెరగనట్టు చూస్తూ "ఆ వేళ కొత్త సరుకు వచ్చింది. కనక ముద్దినుసు రకాలూ దొరికాయి. ఆ ఆకు పచ్చంచు చాపూ? జ్ఞాపకం వుందా? కళ్ళకి కట్టి నట్టు కనపడుతోందది" అంది తల యెగరవేసుకుంటూనూ.

"మరే మరే"

"అన్నిటిలోనూ అదే బాగా నచ్చింది మీ నాన్నగారికి జ్ఞాపకం లేదూ?"

"అవును, కాని పిన్నీ, నిన్న మా నాన్నారు తెప్పించుకున్నవి చూస్తే జ్ఞాపకం వచ్చిందే. వుప్పాడ కండువాలు కూడా రెండు జతలు కొనవలసింది సుమా?"

"నాకు మొదణ్ణుంచీ జ్ఞాపకం వుంది; కాని యెన్నిమాట్లు తీసినా అయిదూ సేలంవే తీస్తూ వచ్చావు నువ్వు. అవంటే నీకంత సరదా అయినప్పుడు కాదనడం యెందుకని నే నూరుకున్నాను."

"చూ – శావా?.... కాస్త అందించి చూస్తేయేమే మా తల్లీ? నేనేనా వొకదానికంటే వొకటి బాగుండడం వల్ల అవి విడిచిపెట్టలేక పోయాను. అక్కడికీ వొకదానికి డబ్బు లేకేపోయింది.

"అదే వచ్చింది వులకం. ఒక్క పది రూపాయలయినా మిగిలితే నేను జ్ఞాపకం చేసి వుందును."

"అసలు, రెండువందల యాభై పట్టుకువెళ్ళవలసింది."

"పోనీ, ఆతనింటికి వచ్చాక కొని యివ్వరాదూ? ఇంతలో మించిపోయిం దేమిటీ?"

"అలా అన్నావా?" అంటూ ఆలోచనలోపడి, సుభద్ర, యెత్తిన ముద్ద కంచంలో పెట్టేసింది.

"మీ నాన్న మాత్రం వొద్దంటారా యేమిటీ?"

"మా నాన్నా రలాంటివారు కారు సుమా పాపం. దయ వచ్చిందంటే కొసిరి కొసిరి యివ్వడం యెరగరు వారు."

"అవతలి వాళ్ళకి అంత కావాలా అనయినా చూడ్డం లేదు. ఇవ్వడం వొక్కటే తెలుసు వారికి. నా బీరువాలో యాభై చీరలకి తక్కువ వున్నాయా? అందులో వొకటయినా పదిహేను రూపాయలకి తక్కువది వుందా, కొన్ని జరీముద్దలే కదా?"

"అదేమిటే, మనిషికి బట్టలే కాదుటే అందం?"

"నిజమేలే."

"ఆవేళ వారు పంచెకి సబ్బు పెట్టుకుంటూ వుంటే నాకు జాలివేసింది. అప్పటిదాకా యెంత యిబ్బంది పడ్డారో?"

"బీదవాళ్ళకి యిబ్బంది కాకపోతే సబ్బంది యెలా వస్తుంది తల్లీ?"

ఈ మాట అన్నప్పుడు, ట్యూటరుగా వున్నప్పుడు బట్టలకోసం తానెంత ఇబ్బంది పడ్డదీ జ్ఞాపకం వచ్చి జానకమ్మ వొణికిపోయింది.

"వారికి బట్టలు కొనిపెట్టండని నోరుజారి వచ్చేసింది మాట. నాన్నా రేమంటారో, అసలు, యేమనుకుంటారో అని గుండెలు పీచు పీచు మని – నేను బేజారయిపోయానేవ్ పిన్నోయ్."

"అద టలా అనిపిస్తుం దమ్మా"

"ఇప్పుడు వుప్పాడ కండువాల మాట చెప్పినా – నాన్నారి క్కోపం వస్తుందేమోనే. చెప్పవద్దే. ఏమే పిన్నీ?"

"నీకంత భయం అయితే నేను చెబుతాలే అమ్మా?"

"అవును, నువ్వు చెప్పవే. నువ్వు చెబితే, నాన్నారు వెంటనే తెప్పించి చెన్నాపట్టం పంపేస్తారు కూడానూ. కదుటే పిన్నీ?"

"అలాగే."

"రామచంద్రంగారి మూలానే నా కథలు, పుస్తకం అయిపోతున్నాయి. ఆవేళ వారా కథ సవరించకపోతే నాకీ వూహ తోచకపోవును. వారి మేలు మరిచిపోగూడదు. ఈ పుస్తకం వచ్చాక తక్కిన కథలుకూడా అచ్చువేయించి పెట్టమని కోరాలి నాన్నార్ని. ఈ మాట చెన్నాపట్టం పంపాటప్పుడు అక్కడ రిస్టువాచీ కొనుక్కోమంటారు నాన్నారు వారిని."

"మీ నాన్న తప్పకుండా అలా అంటారు. చూశావుకాదూ నాకు వొద్దు మొర్రో అంటూ వుంటే వచ్చిన వారం దినాలకే యీ రవ్వల వుంగరం కొని పెట్టారూ వేలికి? దీని మూలాన, పంతులుగారి తోటకి వెళ్ళడం ఖరాగా వొక ఘారం ఆలస్యం అయినా మానేరా?"

"అవునవును. పోనీ, రిస్టువాచీ కంటే — ఏమంటావే నువ్వు పిన్నీ?"

"అదా యిదా అని అంత ఆలోచన యెందుకే? రెండూ — "

"బాబోయ్."

ఇలా అని సుభద్ర, అప్పటికయిన ఆలస్యం కూడదీసుకోడానికా అన్నట్టు గబగబా భోజనం చేసేసింది.

20

రామచంద్రం చెన్నపట్నం వెళ్ళాక రోజులు గడిచినకొద్దీ సుభద్ర మనస్సేమిటేమిటో గజిబిజిపడిపోసాగింది.

అదివరకి ఆమె యేపని చేసినా యేకాగ్రచిత్తంతో చేసేది. అలాంటి మనిషి కిప్పుడు మనస్సు దేనిమీదా, కాస్తసేపూ నిలవడం లేదు.

ఎంత మంచిపుస్తకం పుచ్చుకున్నా నాలుగు బంతులు చదివాటప్పటికి చప్పచప్పగా వున్నట్టు తోస్తుంది.

ఎంత పేరువడ్డ పత్రిక విప్పినా చదవతగ్గ రచన కనపడదు.

గ్రామొఫోను దగ్గిర కూచుంటే బ్రేకువేసిన గుడ్సు రెయిలు చప్పుడా అనిపిస్తుంది. వీణ అందుకుంటే శ్రుతే కలవదు.

తోటలోకి వెడితే వొకచెట్టూ, వొక పొదా, వొక తీగా సజీవంగా కనపడదు. ఒక పువ్వూ ముట్టుకోవాలని వుండదు. అప్రయత్నంగా కొయ్యడం తటస్థపడితే నాలుగడుగుల వేశాటప్పటికి దానికదే చేతిలోనుంచి జారిపోతుంది.

రాత్రిళ్ళు చప్పున నిద్రపట్టదు. పట్టడమే వస్తే గాఢంగా వుండదు. ఏమిటేమిటో కలలు వస్తాయి. మళ్ళీ బాగా చీకటి వుండగానే మెలుకువ వచ్చేస్తుంది. కన్ను పొడుచుకున్నా మరి నిద్రరాదు. లేచాటప్పటికి కళ్ళు బరువుగా వుంటాయి.

స్నానం చేశాటప్పు డొక్కొక్కనాడు సబ్బుమాట మరిచి, పోతుంది. ఒక్కొక్కప్పుడు తడిబట్ట విడవకుండానే తల దిద్దుకుంటుంది.

బీరువా తెరుస్తుంది కాని చీరా జాకెట్టూ వోపట్టాన యేరుకోలేదు. ఏరుకున్న దయినా తీరాకట్టుకున్నాక "అబ్బే" అనుకుంటూ వుంటుంది.

నిలువుటద్దం యెదట నుంచుంటే మొగం వాడిపోయినట్టూ, కళ్ళు అలిసి పోయినట్టూ అనుకుంటుంది.

ఫలహారానికూర్చోవాలనే వుండదు. కూచుంటే చెయ్యిచాపదు. చాపితే యెంతసేపటికో గాని యే పదార్థమూ నోట వుంచుకోలేదు. ఉంచుకుంటే రుచే కనిపెట్టలేదు.

కాఫీలో మాటూ కమ్మదనమూ కనపడక సగం సగమే చప్పరించి పూరుకుంటుంది.

భోజనానికూ్కచుంటే మాటలేకాని లోపల కేమీపోదు. మూడాకులతోటే తాంబూలం పూర్తి అయిపోతుంది.

కథ రాయాలని కూచుంటుంది. మొదటి సంపుటం అచ్చయి వచ్చాటప్పటికి, వున్నకథలు అలా వుండగా మరో సంపుటానికి సరిపడ్డ కథలు రాసెయ్యాలని సంకల్పం. అయితే, తిరుగుడు కుర్చీయేకాని చెయ్యి తిరగదు. కాళ్ళేకాని కలం ఆడదు. మొదట ప్లాటే కుదరదు. కుదిరితే వుపక్రమోపసంహారాలు అతికినట్టు కనబడదు. కనపడితే ఆకథలో విశిష్టత వున్నట్టు తోచదు.

పాతకథలు తీస్తే, అన్నీ వాదులు వాదులుగా కనపడతాయి. వాటితో యెన్నో ఘట్టాలు అసందర్భంగానూ, యెన్నో వర్ణనలు అసహజంగానూ, యెన్నో మాటలు పేలవంగానూ కనపడి "యేమిటీ యీ రాతా?" అనిపిస్తాయి.

ఒక్క రామచంద్రం సాపు రాసిన కథమాత్రం పొంకంగా కనపడతుంది. అది యెన్నిమాట్లు చదివినా విసుపురాదు. పైపెచ్చు, చదివినకొద్దీ సారస్యాలు కనపడతాయి.

వెంటనే ఆమె దృష్టి అంతా అతనిమీద సుడితిరిగిపోతుంది.

ఆమె, అతని ఆకారం రూపించుకుంటుంది. చేష్టలు మననం చేసుకుంటుంది. మాటలు జ్ఞాపకం చేసుకుంటుంది.

ఆ సందర్భాలలో వాక్కొక్కప్పుడు బొమ్మలాగ వుండిపోతుంది.

హఠాత్తుగా పంచెకి సబ్బుపట్టిస్తూ వున్న ఘట్టాలు జ్ఞాపకం చేసుకుని మనస్సు చివుక్కుమనిపించుకుంటుంది.

ఒకనాడామె యేదో పనిమీద ద్వారమండపంలోకి వెడుతూ వుండగా అప్రయత్నంగా రామచంద్రంగది కనపడింది. వెంటనే ఆమెకి తలుపు తియ్యాలని తోచింది. గదిలోకి వెళ్ళాక అతని కేమేమి సామాను ఎలాంటిదివుందో చూడాలనిపించింది; కాని యెన్నిమాట్లెన్నివైపులు తిరిగినా చిలక్కొయ్యని వేలాడుతూ రైలుసంచీ తప్ప మరేమీ కనపడలేదు.

అదేనా తప్పగా వుంది. ఏమీ లేకపోతుందా అని చూస్తే అయ్యవార్లంగారి నట్టిల్లు.

"పాపం" అని జాలిపడింది.

తరవాత పక్కకి చూడగా కుర్చీమీదా మేజామీదా సన్ననిధూళి కనపడింది. అది చూశాటప్పటి కామెచూపులు జిలజిల్లాడిపోయాయి.

ఆమె భరించలేకపోయింది.

వెంటనే పనిమనిషిని రప్పించి, గదిఅంతా తుడిపించి నీళ్ళు చిలకరించి, తుండుగుడ్డతో బల్లా, కుర్చీ స్వయంగా బాగుచేసింది.

ఇదంతా అయాటప్పటికి కామెకొక కమ్మనికోరిక కలిగింది.

వెంటనే తలుపులు వేసేసింది. కిటికీతలుపులు కూడా బిగించేసింది. లైటు వేసింది. మెల్లిగా, మురిసిపోతూ వెళ్ళి కుర్చీమీద కూచుంది; కాని వెనక్కి చేరబడీ చేరబడ్డంతోనే యెవరో కితకితలు పెట్టినట్టు కాగా యెగిరిపడి లేచి నుంచుంది.

ఒక్క క్షణందాకా ఆమెకి ఆ వులుకు పోలేదు.

తరవాత మేజా సొరుగు లాగింది. దాల్లోవున్న రూళ్ళ కాగితాలు చెదిరి చెదిరి వుండగా, చక్కగా కుదించి, బొత్తిగా పెట్టి మళ్ళీ సొరుగు మెల్లిగా వేసేసింది.

గదిలో చెయ్యవలసిందంతా అయిపోయింది; కాని అప్పుడు "ఎందుకిలా చెయ్యడం?" అని యెవరో అడిగినట్లయింది.

వోస్! "ఎందుకు"ట "ఎందుకు?"

అతను కథలు దిద్ది పెడుతున్నాడుకదూ? చెన్నాపట్టంవెళ్ళి సంపుటంగా అచ్చువేయిస్తున్నాడు కదూ?

ప్రతీదానికీ ఆమె యీ కారణమే వూహించుకునేది. ఈ కారణమే చెప్పుకునేది; కాని యిందులో వూతం చాలినట్టు కనపడేదికాదు. ఎంత సరిపుచ్చుకుందామనుకున్నా యేదో లోటుగా వున్నట్టూ, యెంతమాత్రమూ అతకనట్టూ తోచేది.

అసలేమిటో మాత్రం అవగాహన అయేది కాదు.

ఉన్నట్టుండగా ఆమెకి అతని ఫొటో చూడాలని వుబలాటం కలిగింది; కానీ యేదీ.

మొదట వుసూరు మనిపోయింది; కాని తరవాత మాత్రం లేకపోవడమే మంచిదనుకుంది.

ఉండడమే వస్తే ఆనీరుకావి బట్టలతో తీయించుకున్నదే కాదూ?

సీ, అదేం వేషమూ? ఆ ఫోటో యేం బాగుంటుందీ?

అయితే, కొత్త వేషం యేదీ?

బట్ట లందుకునే టప్పుడు పుట్టిన వొణుకుతోనే అతను మెయి లెక్కాడు, వొక్కటేనా కట్టుకున్న దేదీ?

సేలం పంచెలు పాము మీసంలాగ వుండడం చలవ చేశాక కదా, అదేదీ?

చెన్నాపట్టంలో వాళ్ళు కుడితే కోట్లు పూసినట్టే వుంటాయి; కాని కుట్టడం యేదీ?

అత నా చాపులు మడతకూడా విప్పలేదు; కాని ఆ సేలం పంచె కట్టుకుని ఆ యింగ్లీషు ట్విల్లు షర్టుమీద ఆ నేవీబ్లూ కోటు తొడుక్కుని, యెడమ భుజం మీద సేలం పట్టుకండువా వేసుకుని, అతను, యెదట నుంచునివున్నట్టని పించింది.

చిరునవ్వు నవ్వుతూ, బెల్లింపు చూపులు చూస్తూ "బాగున్నానా?" అని అడుగుతూ వున్నట్టున్నూ అనిపించింది.

ఓహ్! ఎంత చక్కనివాడూ!

అయితే, యీ భావన కలిగేటప్పటికి, ఆమెకి, వల్లమాలిన సిగ్గువచ్చి గుంజేసింది.

ఉక్కిరి బిక్కిరి చేసేసింది—

తరవాత వొక్క నిమిషానిక్కాని ఆమె తేరుకోలేకపోయింది.

తేరుకున్నా మరి ఆ గదిలో వుండలేక, లైటు తీసేసి, తలుపులు వేసేసి, తోటలోకి బయలుదేరింది.

21

తోట అంటే ఆమెకి మునపటి గౌరవం లేదు; కాని ఆమె అంటే తోటకి మాత్రం మునుపటిదే కాదు, యెక్కువ గౌరవమే యేర్పడింది.

అంచేత వచ్చీ రావడంతోటే, తోట, ఆమెకి చల్లని గాలితో సేద తీర్చింది.

ఆ గాలి తగిలాటప్పటికి, సుభద్రకి, మద్రాసు మెరీనాబీచి జ్ఞాపకం వచ్చింది.

దాంతో, చెదిరి చెదిరి యెక్కడి కెక్కడికో యెగిరిపోయి వుండిన మనశ్శకలాలన్నీ యేకమయి చక్కని బిళువారీ అద్దంలా తయారయింది.

వెంటనే, అందులో, మళ్ళీ నిలువునా సాక్షాత్కరించాడు రామచంద్రం. అయితే, యీమా టామెకి సిగ్గుకి బదులు జాలిపుట్టింది.

వేషం అదే; కాని యే పది గంటలకో తిన్నతిండి కామోసు పాపం సోలిపోయి కనపడుతున్నా డతను.

అతను, వొక చక్కని మేడ గుమ్మంలో నుంచుని వున్నట్టున్నాడు.

అది ఆంధ్రపత్రికా ముద్రాక్షరశాల కామోసు. అప్పటిదాకా కళ్ళు పోటెత్తేటట్టు ప్రూఫులుదిద్ది బయటికి వస్తున్నాడు కామోసు.

కళ్ళు గుంటలు కట్టినట్టున్నాయి, యెక్కడికయినా వెళ్ళి వొక్క అరకప్పయినా కాఫీ పుచ్చుకుంటాడో పుచ్చుకోడో?

ఇక యేబస్సులోనో, య్రేటాములోనో యిరుకుళ్ళుపడుతూ మైలాపూరు వెళ్ళడమే కామోసు పని.

దీనిమీద ఆమె కింకో బెంగ పట్టుకుంది.

"చేతిలో డబ్బుందో లేదో? సోమయాజుబాబుగారు, కావలసింది యిచ్చారో లేదన్నారో? పోనీ, యిక్కడికి తంతికొట్టారుకా రెంచేతో?"

"నాన్నారు, ఎక్కువ ఖర్చుచేసుకున్నా వని పోతారో యేమో అని యేమి పొడిదుడుకులు పడిపోతున్నారో?"

"లేకపోతే డబ్బు మిగిల్చి తీసుకురావడమే ప్రజ్ఞ అనుకుంటున్నారో?"

"రోజూ సాయంత్రం బీచికి వెడుతున్నారో లేదో? ఇం చక్కని చేప లున్నాయీ? అదేదీ?....అదీ....అక్వేరియం. మరే. అది చూశారో లేదో?"

"మెరుపు రెయిలూ, లైటుహౌసూ, విమానమూ యెక్కారో లేదో?"

"ఆ అడయారు—ఆ బీసెంటునగరం—ఆ పేద్ద మర్రిచెట్టు—తరవాతా, ఆ మూజియం—ఆ పీపిల్సుపార్కు—ఆ మౌంటు రోడ్డు షాపులు—ఆ థియేటర్లు—ఆ హార్బరు—ఆ పైపుల చెరువు—అవన్నీ చూస్తూన్నారో లేదో?"

"కూడాతీసుకువెళ్ళి సోమయాజులు బాబుగారు హైకోర్టూ, కోటా చూపించారో, మరిచిపోయారో, యీ ధోరణే లేదో వారికి?"

"అసలు, వారు, రామచంద్రంగారిని గౌరవంగా చూస్తున్నారో లేదో?"

"అన్నట్టు పిన్ని స్పష్టంగా రాసింది కనక నూరుబత్తాయి పళ్ళూ వారి కివ్వక తప్పదు; కాని పిన్నిగారు రుంజుకుంటూ యిచ్చారో, ముభావంగా యిచ్చారో, సాదరంగా యిచ్చారో?"

"వాళ్ళ రెండోకొడుకు, రామనాథం, వారిని ఆపళ్ళు పుచ్చుకోనిస్తున్నాడో లేదో?"

"ఆవిడచేత మంచివాడనిపించుకోడానికి రామచంద్రంగారే యిచ్చేస్తున్నా రేమో వారి పిల్లలికి పళ్ళన్నీని?"

ఇలాగ సుభద్ర మనస్సు మనస్సులో లేదు. పోనీ ఆవున్న చోటయినా నిలకలడగా వుందేమో అంటే అదీ లేదు.

కథా నిలయం
48

22

ఉదయం యేడున్నర.

మూడో అంతస్థు గుమ్ఫీమీద నుంచుని వుంది సుభద్ర.

అప్పుడే తల అంటుకుని, చిక్కు తీసుకుని వున్న దీర్ఘకబరీ భారం, గాలికి విప్పారి ఆ బంగారు బొమ్మకి పరస్థలం లాగుంది.

సూర్యబింబానికి తెల్లని మేఘశకలం వొకటి అడ్డంగా వుండడంవల్ల ఆమె ధరించి వున్న లేతగులాబీ పట్టుచీర విలక్షణంగా మెరుస్తోంది.

కొంతసేపామె పిట్టగోడమీదకి వాలి, వంతెన దగ్గిరనుంచి ధవళేశ్వరం దాకా— బొబ్బర్లంక, విఘ్నేశ్వరాలదాకా గోదావరి పొడుగునా చూస్తూ నుంచుంది.

ఆ చూడ్డంలో, పెద్దవాడపల్లి దగ్గిర, డరోతీస్టీమరు వూదర కొట్టినట్టు పొగవిడిచిపెడుతూ రంయిమని వెడుతూ వుండడం కనపడింది.

దానిమీద జ్ఞాపకంరాగా మెరుపుకొట్టినట్టామె కొవ్వూరికేసి చూసింది

మద్రాసు మెయిలు అప్పుడే గోదావరి వంతెన యెక్కింది.

వెంటనే మనస్సు గుబగుబలాడిపోగా, తన్నెవరేనా చూస్తున్నారేమో అని వొక్కమాటు నాలుగువేపులా బాగా చూసుకుని, ఆమె, మురిసిపోతూ. సిగ్గుపడుతూ పట్టురుమా లొక్కమాటు సుతారంగా విసిరి, మళ్ళీ గభీమని గుప్పిట్లో దాచేసుకుని, అపవారించి కిలాకిలా నవ్వుకుంది.

ఆ నవ్వుతో వట్టివేళ్ళ అత్తరు సౌరభం వుద్రిక్తమై మెయిలు బండికి యెదురుసన్నాహం నెరిపింది.

వంతెనమీద నడిచినంతసేపూ సుభద్ర కోసమే అన్నట్టు మెయిలు చాలా నింపాదిగా నడిచింది. అందుకు సంతోషిస్తూ ఆమె యింజన్ దగ్గర్నుంచి వెనక్కి, వెనకనుంచి యింజన్ దగ్గిరికీ, మొదటకొంచెం వడిగానూ, తరవాత చాలా తాపీగానూ మెయిలు పొడూగునా పదిమాట్లు చూసింది; గాని గుర్తుంచుకో లేకపోయింది.

ఇంతలో, మెయిలు, వంతెన దిగిపోయింది. సుభద్ర గుమ్ఫీదిగి రెండో అంతస్థు వీధివసారాలోకి వచ్చింది.

వెంటనే, సుమారు యిరవై దినాలనుంచి వాడిపోయివుండిన తోట, నవనవ లాడుతూ, ఘుమఘుమ లాడుతూ ఆమె ముద్దు మొగానికి మిసమిసలు కానుక పెట్టింది.

ఆ పొద్దుటిపూట, ఆ లేతయెండలో, ఆ మేడమీదికి యెంతో ముచ్చటగా

కనబడగా సుభద్ర మేడదిగి తోటలో ప్రవేశించింది; కాని, మనస్సు గేటుకేసీ, కళ్ళు తోటలోకీ పడలాగగా వొకటి రెండు నిమిషాలామె గిరగిర లాడిపోయింది.

కొంతసేపటికో వొంటెద్దుబండి వచ్చి ద్వారమండపంలోకి వెళ్ళిపోయింది; కాని ఆమె దానికేసి చూడనేలేదు.

దానితరవాత వొక ఫీటన్ వచ్చింది. ముసీలి పండొకడు కుళ్ళూ కుళ్ళూ దగ్గుకుంటూ అందులో కూచునివున్నాడు.

అదయిన తరవాత వొక మోటారు వచ్చింది. దార్లోవున్న వాడెవరో పిల్లాడేగాని, నల్లగా జీడిగింజలాగ మోటారుకి సరిపోయి వున్నాడు.

ఆమె అటు చూడలేకపోయింది.

ఎనిముదింబావయింది.

మనస్సుకి గుంజాటన ప్రారంభమయింది.

"ఏం చెప్మా?" అనుకుంటూ వుండగానే మేఘాలమీద యెగిరిపోతూ వొక జట్కా వచ్చింది. ఆ విసురు విసురు ద్వారమండపంలోకి వెళ్ళి అది, యేస్తంభానికో గుద్దుకోవలసిందే కాని బండివాడు లగాములు బిగించి తోటలోనే ఆపేశాడు.

వెంటనే వొక యువకుడు కింది కురికి సుభద్రకేసి బయలుదేరాడు.

కట్టింది సేలంపంచె. తొడిగింది నేవీబ్లూ. ఆపైని పట్టుకండువా— నిదానించగా అతను రామచంద్రం.

సుభద్ర మొగమ్మీద చిరునవ్వు మెరిసి తోట అంతా తళుక్కు మనిపించింది.

అతనూ ఆమే వొకరి నొకరు సమీపించినట్టు కనబడ్డారు.

అంతే.

మళ్ళీ చూడగా ఆమె మేడకేసి వెళ్ళిపోతోంది.

అది నడకా కాదు, పరుగూ కాదు, వురుకులూ కావు; కాని బండికీ మేడకీ మధ్య వున్న తోట అంతా క్లుప్తమయిపోయినట్టనిపించింది.

ఆ సంతోషానికీ, ఆ వుత్సాహానికీ, ఆ చాకచక్యానికీ, అలా ఘవానికీ అతను చకితుడయిపోయాడు.

మొదట అతను "పుస్తకాలు తెచ్చానండి" అన్నాడు. ఇలాంటి సన్నివేశం తటస్థించవచ్చుననీ, అప్పుడు పెట్టి తియ్యబోతే రసాభాస అవుతుందనీ వూహించుకుని, జట్కా యెక్కగానే పెట్టితీసి మూడు పుస్తకాలు చేతిలోనే వుంచుకున్నాడతను; కాని తానే యిచ్చాడో, ఆమె వుళాక్కుందో మాత్రం యెరగడు.

తరవాత "పాకేజీలు వొంటెద్దుబండిలో వస్తున్నాయండి" అన్నాడు; కాని యిక్కడ వొక్కొక్క మాటపలికి అతనివాక్యం పూర్తి చేశాటప్పటికి, అక్కడ, వొక్కొక్క మెట్టే యెక్కి ఆమె మేడమీదకి వెళ్ళిపోయింది.

మేడమీది ఆఫీసులో కూచుని వొక జమీందారీ దావా తాలూకు కాగితాలు చూస్తున్నాడు పంతులయ్య.

అడిగినవాటికల్లా జవాబులు చెబుతూ పక్కని జమీందారూ, జమీందారు చెప్పలేని సంగతులు వివరిస్తూ యెదట దివానూ కూచుని వున్నారు. దివాను వెనకకూచుని ఠాణేదారొకడూ, ఫీటన్‌లో వచ్చిన ముసిలాయనా సాయం చేస్తున్నారు.

ఇద్దరు జూనియర్లు, దివానుకి రెండుపక్కలా కూచుని చదివేసిన కాగితాల్లోని ప్రధానసంగతులు మననం చేసుకుంటున్నట్టు పంతులయ్యకి జ్ఞాపకం చేస్తూ వుండగా, నాలుగోగుమస్తా తెచ్చి యిచ్చిన లా గ్రంథాలు పేజీలు తీసి మరో జూనియరు, పంతులయ్యకి అందుబాటులో బల్లమీద వుంచుతున్నాడు.

ఇలాంటప్పుడు సుభద్రగదిలో కాలు పెట్టింది.

జమీందారు వెనక, తలుపు వోరచేసుకుని నుంచుని వున్న వృద్ధదాసి ఆజంగమవల్లిని చూసి చకితురాలయింది.

అతను పలకరిస్తే జవాబులు చెప్పడానికి తప్ప, అతన్ని పలకరించడాని కెవరికీ ధీమా చాలనంతటి తాదాత్మ్యమూ గాంభీర్యమూ కనపడుతూ వున్నాయి పంతులయ్య మొగంమీద.

కాని సుభద్ర యిదియేమీ చూడలేదు. ఎంతమాత్రమూ జంకనూ లేదు.

ఊచలాగ వెళ్ళింది.

వెళ్ళీ వెళ్ళడంతోటే యెడమ చెయ్యి అతని మెడమీద ఆని, అతని మొగానికి తన మొగం తగిలేటట్టు ముందుకు వంగి "పుస్తకాలు వచ్చాయి నాన్నారోయ్" అంటూ మూడు పుస్తకాలూ అతని చేతిలో వుంచింది.

అందరూ వులిక్కిపడ్డారు.

ఆ చనువుకీ, ఆ ధైర్యానికీ, ఆ సాహసానికీ, ఆ స్వాతంత్ర్యానికి జమీందారు వూగిపోయాడు.

ఆ మాట విన్నాడు పంతులయ్య. ఆ పుస్తకాలు చూశాడు.

"అప్పుడే వచ్చాడుటమ్మా రామచంద్రం?" అని అడిగాడు.

అంతే.

మరేమీ అనలేదు. ఎవరికీ యేమీ చెప్పలేదు. జమీందారు దగ్గిర కళ్ళతో

అయినా సెలవు పుచ్చుకోలేదు. ఎక్కడికి చదివింది అక్కడికి ఆపుచేసి, యెలావున్న కాగితాలు అలా వుంచేసి, గభీమని లేచి పుస్తకాలు తిప్పి తిప్పి చూస్తూనే కిందికి బయలుదేరాడు అతను.

"బంగారపు అక్షరాలు. మనం చెప్పలేదు కాదుటండీ నాన్నారూ? ఎంత ముద్దొస్తున్నాయో?" అని పొంగుపోతూ సుభద్ర వెనకాలే వెళ్ళింది.

23

"రామచంద్రం కనక పని తొరగా తెమిలింది. పుస్తకంకూడా మెరిసి పోతోంది. సూరయ్యగా రయితే—"

"సడే — సూరయ్యగా రయితే కథలు దిద్దగలరేం?"

కళ్ళు ఇంతలేసి చేసుకుని, మొగం అయిమూలగా వంచుకుని, తల యెగరవేసుకుంటూ యిలా దురుసుగా అడిగింది సుభద్ర.

మేడమీద మూడో అంతస్థులో, సుభద్ర గదికి చేరివున్న తూర్పు వసారా గదిలో, జంట కుర్చీలో కూచునివున్నారు సుభద్ర, జానకమ్మానూ,

ఇద్దరి చేతుల్లోనూ చెరొక కథల పుస్తకమూ వుంది.

ఇద్దరూ సర్వాభరణాలూ ధరించి లక్ష్మిసరస్వతుల సమ్మేళనం లాగ కన్నుల పండువుగా వున్నారు.

అప్పటికి నాలుగ్ఘడియలు పొద్దు మాత్రమే వుంది. సూర్యబింబానికి మేడ అడ్డు కావడంవల్ల యింటి ముందరితోట వింత వెలుగుతో ప్రకాశిస్తోంది.

తోటలో ఆ భాగం అంతటా తాత్కాలికంగా వింత వింత మెరుపు దీపాలు అమర్చబడి వున్నాయి.

దగ్గిర వుండి, వరదారావు, ఫలహారపు బల్లలూ, వాటిమీద బందరు కలంకారీ దుప్పట్లూ వాటిమీద రంగు రంగుల పింగాణీ సామానూ సద్దిస్తు న్నాడు.

చిన్ని గుమాస్తాలు ముగ్గురూ ఆ పింగాణీ సామాను మధ్యగా అగరు వొత్తుల కూజా లుంచుతున్నారు.

ఒక చెట్టుకింద గుడ్డ కుర్చీలో పడుకుని వున్నాడు పంతులయ్య. రామచంద్రమూ, పెద్ద గుమాస్తా యెదట నుంచుని సలహాలు చెబుతూ, ఆజ్ఞలు అందుకుంటూ సర్వమూ లక్షణంగా జరిగేటట్టు చూస్తూ వున్నారు.

రెండో అంతస్థులో, గానసభ నిమిత్తం, పోతునాయుడు కుర్చీలు సద్దిస్తూ వున్న చప్పుడు వినబడుతోంది.

జానకమ్మా, సుభద్రమ్మా అత్యుల్లాసంగా మాట్లాడుకుంటున్నారు.

"మహా బాగా చెప్పావు."

"చెన్నాపట్టం వెళ్ళి అచ్చు వేయించడం కూడా ఆయనకి చేత నవునేం?"

ఇలాగ అదే ధోరణిలో మొదలకించింది సుభద్ర.

"వెళ్ళి వెళ్ళి చెన్నపట్నం కూడా వెళ్లాలి ఆ పెదబాబు. బజారుకి వెళ్ళి చెప్పిన కూరలయినా సరిగా తీసుకురాలేడు కానీ?"

"ఆయన కయితే నాన్నా రలాంటి బట్ట లిప్పిస్తురేం? నేను బత్తాయి పళ్ళు పంపిస్తునేం?"

"బట్టలు కూడా యివ్వాలి. నంగినంగి మాటలాడుకుంటూ — ఆయన పేరు చెబితేనే నాకు వొళ్ళు మండిపోతుంది సుమా."

"నాకూనూ" అని తల తాటించుకుంటూ అందుకుంది సుభద్ర. "ఒక్క కథ సాపు రాయడానికి పది రోజులు పట్టేది. "ఆఫీసు పనులు తేలడంలే"దని నాతోనూ, "అమ్మాగారి కథలు సాపు రాయడంతోటే సరిపోతోం"దని నాన్నా రితోనూ చెబుతూ, ఇంట్లో రెండో పెళ్ళి పెళ్ళాముకి పడిపడి దణ్ణాలు పెడుతూ—"

మాట సగంలోనే రుసరుస లాడుతూ అందుకుని "చెప్పిచెప్పి ఆ పెళ్లాన్నే చెప్పాలి, ఆ మొగుణ్ణే చెప్పాలి. ఫర్లాంగు దూరం వినపడేటట్టు నవులుతుంది, ఆ యిల్లాలు, తాంబూలం. యాక్కురారీ" అంటూ మొగం చిట్లించుకుంది జానకమ్మ.

"వోక్!........నాకు నిజంగా డోకే వచ్చేలాగుందే. ఆవిడ మాట చెప్పకే యిక పిన్నీ! ఆ గొడవ మరిచిపో. మరిచిపోడానికి, రామచంద్రంగారు కథలు దిద్దడమూ, అచ్చు వేయించడమూ — ఇలాంటివి చెప్పు."

ఫక్కుమని నవ్వబోయింది జానకమ్మ; కాని చాలా కష్టంమీద అణుచుకుంది. రామచంద్రం చెన్నపట్నం వెళ్ళినప్పణ్ణుంచీ లెక్కచూస్తే, ఆమెకిలాంటి సందర్భం పది పన్నెండుమాట్లు తటస్థపడింది; అయితే అప్పుడప్పుడు కూడా యింతా అవస్థపడుతూనే వచ్చింది.

నిజంగా, వొక్క మాటయినా బెసికిపోకుండా అన్నిమాట్లు జాగ్రత్త పడడం కష్టమే; కాని ఆ విషయం జానకమ్మకి అలవాటయిపోయింది.

ఆ మాట మీద మొగం పక్కకి తిప్పుకోడం ప్రయత్నంలో, జానకమ్మ, తోటలోకి చూసింది. ఎందుకో అని సుభద్ర కూడా అలా చూసింది.

పంతులయ్య ద్వారం దగ్గిరగా నుంచుని వున్నాడు. రామచంద్రం యెదట నుంచుని యెందుకో చిరునవ్వు నవ్వుతున్నాడు.

అదిచూసి సుభద్ర వుత్సాహవంతురాలు కాగా, జానకమ్మ, కొంటె చూపులు చూస్తూ "రామచంద్రానికి పెళ్ళికళ వచ్చిందేవ్" అంది.

సుభద్ర మనస్సు గుబగుబలాడిపోయింది. "అవు...." నన బోయింది; కాని మాట సగంలోనే మెరుపు కొట్టినట్టయి నీరవురా లయిపోయింది.

ఆమెచూపులు వొళ్ళోవున్న పుస్తకం మీదకి వాలాయి. ఆగిల్టు అక్షరాల మెరుపులు సాయపడ్డాయి కనక సరిపోయింది గాని లేకపోతే ఆమె మొగం సిగ్గు దాచలేకపోయి వుండును.

ఇంతలో తోటలో బాండు వాద్యం వినపడింది.

ఇద్దరూ వులిక్కిపడి చూశారు. మేళగాళ్ళు ప్రహరీపొడూగునా నిలిచి వున్నారు. అందరూ నల్లదొరలలాగ యేక వేషంతో వున్నారు. చాలా వుత్సాహంగా బాండు వాయిస్తున్నారు.

సుభద్ర మళ్ళీ పుస్తకంకేసి చూసి "యీగిల్టు అక్షరాలు యీ పుస్తకానికి మరీ అందం తెచ్చాయి, కదుటే పిన్నీ?" అంది.

దానిమీద, జానకమ్మ వొక్కమాటు శిరఃకంపంచేసి "అంత మేలు చేశాడు కదా, మరి, రామచంద్రానికి ఇవాళ నువ్వేం బహుమతీ చేస్తావు తల్లీ?" అని యేమీ యెరగనిదానిలాగ అడిగింది.

అందుకు సుభద్ర "అవునేవ్; నాకు తోచిందే కాదు చూశావా? ఏం చెయ్య మంటావే పిన్నీ?" అంటూ అమాయికంగా చూసింది.

"అలాంటి పిల్లాడికి, నీలాంటి పిల్ల, యెలాంటి బహుమతీ చెయ్యాలో నాకెలా తెలుస్తుంది తల్లీ?"

ఇలా అంటూ సాగతీసుకుంది జానకమ్మ.

"అదేమిటే అంత వులకంగా మాట్టాడతావూ?"

"కాకేమే? నువ్వుకథలు రాయడమూ, అతను దిద్దడమూ, ఈ విధంగా యిద్దరి వుద్దేశాలూ కలవడమూ-"

"బహుమతీ మాట చెప్పమంటే దండకం విడేస్తావేమిటే మామ్మా?"

"నేనేం చెప్పగలనే నాకూతురా? నీమనస్సులో యేంవుందో-"

"ఉంటే నిన్నడగడం యెందుకే?"

"నీ కబుర్ల కేంలే, నిజంగా నువ్వుతోచనిదానవే అయితే వొక్క కథ మాత్రం దిద్దినవాడికి అన్ని రూపాయల బట్టలు నీ చేతుల్తో యివ్వగలవేం? చెన్నపట్టం వెడితే పదిరోజుల్లో వచ్చే వాడికి మించిపోయినట్లు వంద బత్తాయి

పళ్ళు పంపగలవేం? పైగా, వుప్పాడ కండువాలూ, రిస్టువాచీ, రవ్వల వుంగరమూ—"

"ఆమాట నువ్వు తెచ్చావు"

"నువ్వు గట్టిగా పట్టుకున్నావు".

సుభద్ర మిడుతూ మిడుతూ చూసింది. ఆ చూపుల్లో మౌగ్ధ్యం మిసమిస లాడి పోయింది.

జానకమ్మ జాలి పడిపోయింది.

"అతనింటికి వచ్చేదాకా నీకు నిద్రాహారాలు సయించాయా? ప్రపంచకం యేమైనా కనపడిందా? ఇదంతా నే నెరగ ననుకున్నావేం?" అంటూ యిలాగ కూడా ఆమె అనేసేదే; కాని పస్తాయించింది.

ఆమాట లంటే సుభద్ర సిగ్గు పడిపోతుంది. చిన్న పుచ్చుకుంటుంది. ఆ స్థితి తాను చూడలేదు. ఆపైని గొప్ప విందూ, గానసభా, వుపన్యాసాలూ, కానుకలూ.... పెద్దతంతు జరగవలసివుంది.

సుభద్ర వుల్లాసంగా లేకపోతే యివన్నీ వెలవెలపోతాయి. దానికంతటికీ కారణం తానయిపోతుంది.

అది చాలా విచారకరమైన సంగతిగా పరిణమిస్తుంది.

జానకమ్మ వొక్కక్షణంలో యిదంతా ఆలోచించుకుని మొదట ఆప్రవాహానికి అడ్డువేసేసింది. తరవాత "ధోరణి యెలా మార్చనూ?" అనుకుంటూ కిందకి చూసింది.

ఫలహారపు వస్తువులు కావిళ్ళతో వస్తున్నాయి.

వీణ పట్టించుకుని గురువుగారు వస్తున్నారు.

అరటిదొప్పలతో పూలదండలూ; దాగర్లతో పూలగుత్తులూ తెస్తున్నారు పూల వర్తకులు.

చిన్న గుమస్తాలు ముగ్గురూ అగరువొత్తులు వెలిగిస్తున్నారు.

"చూడు తల్లీ" అంది జానకమ్మ.

సుభద్ర అలాచూసి "అతిథులు వస్తున్నారు పిన్నోయ్" అంది ఆత్రంగా.

ఇద్దరు ప్లీడర్లు వచ్చారు. పంతులయ్య వారిద్దరికీ కరస్పర్శ చేసి పూలగుత్తు లందించి కుర్చీలు చూపిస్తున్నాడు. పెద్ద వెండిపళ్ళెంతో పూల గుత్తులు పట్టుకుని పోతునాయడు పక్కని నుంచునివున్నాడు. తమ కోసమే కాబోలు రామచంద్రం మేడకేసి వస్తున్నాడు.

తల్లి కూతురూ అప్రయత్నంగా లేచారు.

"ముందు వచ్చినవాళ్ళు ఆడాళ్ళయారు కాదునయమే" అంది సుభద్ర.

"తొరగారా" అంటూ అడుగువేసింది జానకమ్మ.

24

పంతులయ్య, మేడమీద, వుత్తరపు వసారాలో పచారుచేస్తూ శనివారపు పత్రిక చదువుకుంటూ వుండగా, ముసిముసినవ్వులు నవ్వుకుంటూ వచ్చి జానకమ్మ పత్రిక వుళాక్కుంది.

తనూ, ఆమే, సుభద్రా, కులాసాగా కభుర్లు చెప్పుకుంటూ ఫలహారం చేసి, కాఫీ పుచ్చుకుని, తాంబూలం వేసుకుని అప్పుడప్పుడే అక్కడికి వచ్చాడతను. ఇంకా అరగంట అయినా పూర్తి కాలేదు.

కనక యింతలో ఆమె రావలసిన కారణం కనపడక, శ్రద్ధ అంతా సంపాదకీయం మీద కేంద్రీకృత మయి వుండడంవల్ల మాట్టాడాలేక "యేం?" అన్నట్లు చూశాడతను.

ఆలాగే — ముసిముసి నవ్వులతోనే ఆమె బదులుచూపులు చెల్లించింది.

చివరికి "ఏమిటి కథ?" అని అడగక తప్పలేదతనికి.

"అమ్మాయికి సమ్మంధం చూడండి" అంది ఆమె.

ఆమెచూపులు గంభీరముద్ర వహించి వున్నాయి.

అది గ్రహించి వెంటనే శ్రద్ధ అంతా యిటు మళ్ళించుకున్నాడతను.

"ఏం?"

"ఈడు వచ్చింది కాదూ?"

"చిన్నపిల్ల. దాని కప్పుడే పెళ్ళి—"

"అదేమిటండీ? పదహారేళ్ళు నిండినదాన్ని మీరింకా చిన్నపిల్లే అంటారేమిటండీ?"

"నిజంగా?.... అప్పుడే పెళ్ళియీడు వచ్చిందంటావా?"

"పెళ్ళియీడేకాదు, బిడ్డనికనే యీడు కూడా వచ్చింది. ఇప్పుడు పెళ్ళి చేస్తే మళ్ళీ యీరోజుల్లోనే మీరు మనవణ్ణి యెత్తుకుంటారు"

అతను ఆమె బుగ్గలు పుణికాడు.

"నిజం. ఇక ఆలస్యం చెయ్యడం అమ్మాయిని బాధపెట్టడంగాని సుఖపెట్టడంకాదు. ప్రేమించడం కానే కాదు"

అతనికి, ఆమె సుభద్రని కన్నతల్లిలాగ కనపడింది.

ఆయితే నువ్వే చూడరాదూ?"

"ఇంతకంటేనా? చాలా సంతోషం. భారం అంతా మీరు నామీద పెడితే, నేను అమ్మాయిమీద పెట్టేస్తాను. పెట్టేవేశాను"

"అంటే?" అని అతను గతుక్కుమన్నాడు.

"నాతో రండి తెలుస్తుంది" అంది ఆమె.

ముందు జానకమ్మా, తరవాత పంతులయ్యా బయలుదేరారు.

జానకమ్మ తనకి చూపించే దేమిటో పంతులయ్య గ్రహించేశాడు; కాని వరుడెలాంటివాడో అని కంగారు పట్టుకుంది పాపం అతనికి.

సగం దారిలో జానకమ్మ "మీరేమీ మాట్టాడకండేం?" అన్నట్టు కళ్ళు తిప్పుకుంటూ, చేత్తో నిషేధించింది; కాని అంతకి ముందే నీరవు డయిపోయి వున్నాడతను.

25

ఆగ్నేయంగా వున్న వసారా గదిలోకి వెళ్ళి యిద్దరూ దక్షిణపు కిటికీ దగ్గిర నుంచున్నారు.

ముందు తాను వెళ్ళి నుంచుని, చూడవలసిన దృశ్యం యింకా వుందా లేదా అని తోటలోకి పరకాయించి, తరవాత, అతణ్ణి తన వెనక్కి రమ్మని సన్న చేసిందామె.

ఆమె బుజాలు పట్టుకుని, తల పక్కకి వంచుకుని నుంచున్నాడతను.

అలాగే నుంచుని, మొగంపై వాటుగా వెనక్కితిప్పుకుని, మంద హాసంతో కళ్ళు చేరెడేసి చేసుకుని "యేం, కనపడిందా?" అన్నట్టు తల యెగరవేసిం దామె.

మేడకి పాతిక గజాలదూరంలో వొక పొగడచెట్టు, ఆచెట్టుకి చుట్టూరా పాలగచ్చు అరుగు. దానికి నాలుగైదుగజాల దూరాన గులాబీ కట్టవకి ఆనుకొని వొక పెద్ద అశోకవృక్షం.

తువ్వాలు పరుచుకుని, యేదో పుస్తకం చూసుకుంటూ ఆ అరుగుమీద పడుకుని వున్నాడు రామచంద్రం.

ఒకమాటు అతన్ని తొంగిచూస్తూ, వొకమాటు దాక్కుంటూ, మధ్య మధ్య మేడకేసి బెదిరి బెదిరి చూస్తూ సుభద్ర, అశోకం చాటున నుంచుని పొంగిపోతోంది. సిగ్గుపడిపోతోంది. పరవశురాలున్నూ అయిపోతోంది.

తర్జనితో నిర్దేశిస్తూ జానకమ్మ పంతులయ్యకి అదృశ్యం చూపించింది.

ఆ యువకుడు ఫలానా అని నిశ్చయించుకో గలిగే దాకా తేరిచూసి,

పెద్ద నిట్టూర్పు విడుస్తూ కిటికీ చాటుకి తప్పుకున్నాడు పంతులయ్య. ఎదటికి వెళ్ళి నుంచుని యేమని పోతాడో అని జానకమ్మ ఆదుర్దాపడిపో సాగింది.

"ఏమి టంటావ్?"

"మీ రేమి టంటారూ?"

ఒక్కక్షణం ఆలోచించి "యెప్పణ్ణుంచీ యిదీ?" అని అడిగాడతను.

"అతను చెన్నపట్నం వెళ్ళినప్పణ్ణుంచీనీ"

"మరి చెప్పావు కాదేం?"

''ఇది చూసేదాకా నిరుకు చేసుకోలేకపోయాను"

మళ్ళీ వొకమాటు తొంగి చూశాడతను. వెనక్కీ, పక్కలికీ, మేడకేసీ బెదిరి బెదిరి చూసి మళ్ళీ రామచంద్రాన్ని తొంగిచూస్తోంది సుభద్ర. ఇదేమీ యెరక్కుండా చదువులో మునిగిపోయే వున్నాడు రామచంద్రం.

''ఆవేళ అతణ్ణి మెయి లెక్కించి వచ్చింది. అది మొదలు దానికి నిద్రలేదు. హారంలేదు. అతను తప్ప మరి ప్రపంచకమే కనపడ్డం లేదు.

''అతనికి తెలుసా?''

"ఏమీ యెరగడు పాపం. అసలు, ఆడదానిమీదకి దృష్టి పోయినట్టే కనపడ దింకాను''

''అలాగా?''

''ఆరు నెల్లయింది వచ్చి. వచ్చిననాడెంతో నేడూ అంతే. పలకరిస్తే తప్ప నాతోటీ దాంతోటి కూడా మాట్టాడడు. అమాట్టాడ్డం అయినా మాకేసి చూడకుండానే''

''అమ్మాయి-''

''మొదట మొదట యేవారానికో, యే పదిరోజులకో వొకమాటు, వొకమాట అతనితో చెబుతూ వుండేది. క్రమ క్రమంగా అదీ లేదిప్పుడు. అతను యెదట వున్నంతసేపూ అతనితో సరిగా మొగం వంచుకుంటుంది. ఓర చూపులు మాత్రం చూస్తూ వుంటుంది. నా దగ్గిర అతణ్ణి గురించి యిక యిసక పాతర్లు. నేనేమయినా అనుకుంటానేమో అని మధ్య మధ్య అతను కథ దిద్దడమూ, పుస్తకం అచ్చు వేయించడమూ, పంచెకి సబ్బు –"

"ఇప్పుడర్థం అవుతోంది. బత్తాయికాయల మాటతెచ్చి, నాచేత పంపుదా మనిపించడానికి అది వేసిన యెత్తులు తలుచుకుంటే, యిప్పుడు దాని తపన కళ్ళకి కట్టినట్టు కనపడుతోంది."

"మీకు తెలవకుండా నా చేత వొక పని చేయించింది సుమండీ."

"ఏమిటదీ?"

"అయిన మూడు వందలూ తమకే పంపామనుకుంటారేమో, అతని కిస్తారో యివ్వరో కామేశ్వరమ్మ అక్కయ్యగారు అని అది పొందిన ఆవేదన శత్రువులకైనా వొద్దు. నేను చూడలేకపోయానది. చివరి కేమయినా సరే అని "ఇందులో వంద పళ్ళు రామచంద్రానికి" అని యెవరు రాశారో తెలవకుండా—"

''ఇచ్చినట్టా?''

''వద్దువద్దన్నాట్ట తాను; కాని పెద్ద కూతురూ ఆవిడా పళ్ళెలతో తెచ్చి తనకిచ్చిన గదిలో అలమార్లో వుంచి వెళ్ళిపోయారుట. అన్ని పళ్ళు ప్రత్యేకంగా తాను పుచ్చుకున్నట్టు తెలిస్తే ఇక్కడ మీ రేమని పోతారో — ''

"వో — త్త్రి అమాయకుడు. అన్నానికి మొగం వాచిపోయి వచ్చాడు పాపం; కాని జాతిరత్నం?

''మీ అనుగ్రహం తప్పిపోకుండా వుండేటట్టు చూసుకోడం తప్ప మరో కోరికే వున్నట్టు లేదతనికి.''

''ఏమిటి చెయ్యడం?''

''నన్నా అడుగుతారు?''

''అడగడానికి నీకంటే నా కెవ రున్నారూ?''

ఇలా అంటూ అత నామె భుజం మీద చెయ్యి వేశాడు. ఆ చేతి మీదికి తన శిరస్సు వాల్చుకుని అవ్యక్తానందం అనుభవించిం దామె.

''నీ వుద్దేశం చెప్పు. ఏమి చెయ్యమంటావో ఆజ్ఞాపించు.''

''ఏం చెప్పడానికీ అంతా విషమంగా వుంది.''

ఇలా అంటూ ఆమె, మొగం పక్కకి తిప్పుకుని ఆలోచించసాగింది.

''ఏమి టా వైషమ్యం?'' అని అడిగా డతను.

ఒక్క నిమిషం అలాగే వుండి, చివరికి మొగం పైకెత్తుకుని "ఏమంటే? ఇటు చూస్తే యీడూ జోడూనూ. ఆ పైని అమ్మాయి తల్లడిల్లి పోతోంది. ఏం చేసినా దాని దృష్టి మరొకడి మీదికి తిరుగుతుందని తోచదు''

''ఇంకా యేమిటి?'' అన్నట్టు చూశాడతను.

''అటు చూస్తే — '' నసికేసిందామె.

'చెప్పు. సందేహించకు. ఇది ఆలోచన.''

''మీ తాహతుకీ, మీ దర్జాకీ, మీ సంప్రదాయానికీ — ''

మాట సగంలో ఆపివేసి "యింకా చెప్పాలా?" అన్నట్టు చూసిం దామె.

''నిజమే'' అంటూ వొక్కక్షణం పక్కకి చూస్తూ ఆలోచించి "నువ్వు చెప్పింది కాదనను. కాని అతని సంప్రదాయం మనకి తెలవదు. ఇంతకీ నువ్వు పైపై సంగతులు చూసి పైపై మాటలు చెప్పావు."

''లేకపోతే నేను ఖండనగా చెప్పగలనా?'' అన్నట్టు చూసిందామె.

''అవునా?'' అన్నాడతను.

అయినా సాహసించలేకపోయింది.

''చెప్పవూ?'' అంటూ గడ్డం పట్టుకున్నా డతను.

ఈ సన్నివేశం ఆమెకి ధైర్యమూ, సాహసమూ కలిగించింది.

''అతని భావోన్నతి యెదట మన ఐశ్వర్యమూ, అతని వినయ విధేయతల యెదట మనదర్జా యేపాటిదీ?''

''సెబాస్!'' అంటూ చిటికెవేసి "నువ్వు అసలు సంగతి కనిపెట్టావు" అని ప్రశంసించాడతను.

''అతను నా కడుపున పుట్టివుంటే — ''

"బెంగపెట్టుకోకు" అని రెండు చేతులూ పట్టుకుని ప్రారంభించా డతను.

"వాత్సల్యం తెలిసిన వాళ్ళకి తదనుభూతి కలవాళ్ళకి అల్లుడయినా వొకటే, కొడుకయినా వొకటే. నువ్వేకాదు నేనూ అలాగే అనుకుంటూ వచ్చాను. కడుపున పుట్టి నా చేతిలో పెరిగి పెద్దదయిన సుభద్రా, నిన్నగాక మొన్న — గాలికి కొట్టుకువచ్చిన అతనూ నా హృదయంలో వొక్కస్థానమే ఆక్రమించుకుని వున్నారు."

ఆశ్చర్యచకితురా లయిపోయింది జానకమ్మ.

"అతనే నీ అల్లుడు."

జానకమ్మ వొళ్ళంతా గరిపొడిచి జల్లుమంది.

''అమ్మాయికి తగిన వరుడు అతను తప్ప భూమ్మీద మరివొకడు లేడు. ఈశ్వరుడు, యిందుకోసమే అతణ్ణి మన ఇంటికి తీసుకువచ్చాడు. అతణ్ణిచ్చి పెళ్ళిచెయ్యడం కంటే అమ్మాయికి నేను చెయ్యవలసిందీ చెయ్యగలదీ మరేమీ లేదు?''

అప్రయత్నంగా ఆమె అతని రెండు భుజాలూ పట్టుకుని అతని మొగంకేసి యేకాగ్రంగా చూడసాగింది.

"నే నీ పని చెయ్యకపోతే అమ్మాయికి అపకారమూ, దాని కన్నతల్లికి ద్రోహమూ చేసినవాణ్ణయిపోతాను.''

ఆమె అదే చూపు.

''అమ్మాయికి పెళ్ళియీడు వచ్చిందని నా కప్పుడప్పు డనిపిస్తూనేవుంది. అయితే, దాని చూపు యెవరిమీదికి పోతుందో, నా సంపత్తి కెలాంటివాడు వ్యవహర్త అవుతాడో అని నేను చాలా బెంగ పెట్టుకుని వున్నాను.''

ఆమె యింకా అదే చూపు.

"ఇప్పటికి ఆ బెంగ తీరడమే కాదు, నా తపస్సు ఫలించింది."

హృదయంలో యేదో భావం పురికింది; కాని ఆమెకి కంఠం స్వాధీనం కాలేదు.

"ఏమంటావ్?" అని అడిగాడతను.

అప్పటికి కంఠం స్వాధీనపడింది; కాని నాలుక తడబడిపోయింది. మాట రాలేదు. చూపు మాత్రం అదే.

అప్పటికాచూపు గుర్తించాడతను. అది భరించలేక "యేమిటి చూస్తున్నావ్?" అని సాదరంగా అడిగాడు.

"దేవతాకళ"

అప్రయత్నంగానూ, అజ్ఞాతంగానూ పలికింది ఆమె యీమాట.

"ఎక్కడా?"

"మీ మొగాన"

పొంగిపోయి ఆమె యెడమ బుగ్గమీద యిట్టే అన్నాడతను.

అది ఆమెకి పులకలు పేటెత్తించింది.

"మీరు వేసే ప్రతీ అడుగులోనూ, చేసే ప్రతీపనిలోనూ, పలికే ప్రతీ అక్షరంలోనూ, పరిపే ప్రతీ చూపులోనూ అంతులేని ఔదార్యం యెప్పుడూ కనపడుతూనే వుంది. అయినా అది యింతటిదని నేనిప్పటివరకూ గుర్తుంచుకో లేదు. మీ హృదయంలో యింత అమృతం నిండివుందని నేనెప్పుడూ భావించుకో లేకపోయాను. నిజంగా, మీ నిజస్వరూపం నాకిప్పుడు కనపడ్డంత స్పష్టంగా యెప్పుడూ కనపడలేదు. లోకంలో– పధ్నాలుగు లోకాల్లోనూ కూడా యే సంపన్నుడూ, యే పండితుడూ, యేత్యాగీ, యేభోగీ, యే పెనిమిటీ, యేతండ్రీ కూడా మీ కాలిగోటికయినా సాటిరారు."

ఇలా అని, ఆమె, తన చేతులతని మెడకి చుట్టబెట్టి, తన కుడిబుగ్గ అతని వక్షస్థలంమీద అన్చుకుని, అతను గుచ్చి కౌగిలించి తన శిరస్సు మూర్కొనగా నిలువునా కరిగిపోయింది.

ప్రబుద్ధాంధ్ర 1934 అక్టోబరు
సవరణలతో విపులీకృతం